మంగళవారం
3•3•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 248
• పేజీలు : 12 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




మల్యాల మండలం రాంపూర్ పంప్‌హౌజ్ దగ్గర నిండుగా మారిన వరద కాలువ



# ఫలించిన జల ఆశయం



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం రంగారావుపల్లిలో వరదకాలువను ఆనుకుని కనిపిస్తున్న పచ్చని పొలాలు

రిజర్వాయర్ నుంచి నీళ్లు తీసుకుపోయేది కాలువ.
కానీ కాలువే 122 కిలోమీటర్ల రిజర్వాయర్‌గా మారితే..!

జలాశయంలో నీళ్లుంటేనే కాలువ పారుతుంది.
కానీ కాలువే నీళ్లు తెచ్చి జలాశయాన్ని నింపగలిగితే..!

ఆనకట్టకు ఎగువనున్న జలాశయంతో పోటీపడుతూ
ఆ నీటితో సంబంధం లేకుండానే
దిగువన కాలువ జలకళలాడితే..!

### దాన్ని ఎస్సారెస్పీ పునర్జీవ పథకం అనాలి!!

ఎగువ నుంచి వరద రాని కరువుకాలంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టును నింపడం కోసం రూపొందించిన వరద కాలువ పునర్జీవ పథకం మూడింతల సఫలమైంది. శ్రీరాంసాగర్ నిండినప్పుడు దాన్నుంచి శ్రీ రాజరాజేశ్వర, దిగువ మానేరు డ్యాంకు నీళ్లు తరలించడానికే కాదు; వరద కాలువనే ఏకంగా జలాశయంగా మార్చి వాడుకోవడానికీ ఇది వీలు కల్పిస్తున్నది.

ఎప్పుడూ ఎండిపోయే ఎగువ గోదావరికి, ఎల్లప్పుడూ నీళ్లతో నిండి ఉండే దిగువ గోదావరికి మధ్య సజీవ జల వారధి.. ఈ వరద కాలువ. శ్రీరాంసాగర్‌లోకి వరద వచ్చినపుడు పారాల్సిన వరద కాలువ చెరువుల్లోకి వరదను పారిస్తూ తన పేరును మరోరకంగా సార్థకం చేసుకుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునర్జీవం కోసం చేపట్టిన ఈ పథకం దానికంటేముందే పంట చేలను పునరుజ్జీవింపజేసి చిరస్మరణీయంగా మారింది. కరీంనగర్ జిల్లా గంగాధర, బోయిన్‌పల్లి మండలాల్లో వరద కాలువ పొడవునా, 25 ఏండ్లుగా ఎన్నడూ నిండని చెరువులిప్పుడు మత్తడి దుంకుతున్నాయి.

భూగర్భజలాలు విరగ నిండి బోరు మోటర్లు నీళ్లను దంచి కొడుతున్నాయి.

### 122 కిలోమీటర్ల వరదకాలువ జలాశయం..

### కేసీఆర్ ప్రభుత్వ సుదీర్ఘ జల- ఆశయం!!

## స‘జీవ జల’ వారధిగా మారిన ఎస్సారెస్పీ వరదకాలువ


**122 కిలోమీటర్ల మేర రిజర్వాయర్‌గా కాలువ**
**ఎస్సారెస్పీ పునర్జీవ పథకంతో కొత్త చరిత్ర**

**నెరవేరుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ కల**

**కాళేశ్వరం.. కథలు**
Success of Telangana

- పాతికేండ్ల తర్వాత నిండుతున్న చెరువులు
- 32 స్లూయిస్ గేట్లతో 49 చెరువులకు నీళ్లు
- కాలువలో టీఎంసీ నీటినిల్వ.. పెరిగిన భూగర్భ జలాలు
- 16 చోట్ల ఎత్తిపోతల నిర్మాణానికి ప్రణాళిక
- లక్ష ఎకరాల ఆయకట్టు స్థిరీకరణే లక్ష్యం
- మురుస్తున్న పల్లెలు.. ఆనందంలో రైతులు

### పంట దిగుబడి పెరిగింది



గర్శకుర్తి శివారులో 2 ఎకరాల 20 గుంటల భూమి ఉన్నది. మెట్ట ప్రాంతమైన గర్శకుర్తిలో వర్షం పడితేనే పంటలు సాగుచేసేవాళ్లం. నీళ్లు చాలక సగం పొలాన్ని సాగు చేసి, మిగతాది బీడుగా వదిలేసేవాడిని. తెలంగాణ వచ్చిన తర్వాత మార్పు కనిపిస్తున్నది. వర్షం కోసం ఎదురుచూడకుండా పొలం సాగుచేశా. వరదకాలువ మా చెరువును నింపుతున్నది. బీడు భూమిని కూడా సాగుచేయగా, 46 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.
– పుల్కం మల్లయ్య, గర్శకుర్తి

**లక్ష ఎకరాలకు ఆయకట్టుకు జీవం**

వరదకాలువ పొడవునా 16 చోట్ల ఎత్తిపోతలు నిర్మించి గొలుసుకట్టు చెరువులను నింపడంద్వారా లక్ష ఎకరాలకు నీళ్లివ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది.

**మూడు రిజర్వాయర్లుగా..**

ఎస్సారెస్పీ నుంచి 122 కిలోమీటర్లు ఉన్న వరదకాలువను ఎస్సారెస్పీ పునర్జీవ పథకం కింద నిండుకుండలా మార్చడానికి మూడు రిజర్వాయర్లుగా విభజించారు.

**వరదకాలువ పథకాన్ని నిర్వచిస్తే..**
కేవలం 48 ఎకరాల భూ సేకరణ, మూడు లిఫ్టులు, అతి తక్కువ ఖర్చు!


**వచ్చిన ఫలితాన్ని ప్రస్తావిస్తే...**
46 ప్రధాన చెరువులకు వరద, వాటి నుంచి వందలాది గొలుసుకట్టు చెరువులకు జలసిరి, 33 వేలదాకా కరంటు మోటర్లకు నీళ్లు. వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు.

**అనుకున్నవిధంగా మరో కాలువ మీద మరో**
16 లిఫ్టులను కూడా నిర్మిస్తే ఏకంగా లక్ష ఎకరాల పంట పొలాలకు గోదావరి జలాల సరఫరా!



జగిత్యాల జిల్లా మల్యాల మండలం గొల్లపల్లిలో నిండుగా పోస్తున్న పంపు

సమగ్ర కథనం 2వ పేజీలో



# దుబాయ్ ప్రయాణికుడికి కరోనా

- హైదరాబాద్‌లో వ్యాధి నిర్ధారణ, గాంధీ దవాఖానలో చికిత్స
- కొవిడ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం
- మన వాతావరణంలో వైరస్ విస్తరించదు
- వైద్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడి
- ఢిల్లీ, రాజస్థాన్‌లో ఒక్కొక్కరికి కరోనా



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ప్రపంచదేశాలను వణికిస్తున్న మహమ్మారి వ్యాధి కరోనా ఓ దుబాయ్ ప్రయాణికుని ద్వారా హైదరాబాద్ చేరింది. గాంధీ దవాఖానలో ఆ వ్యక్తికి నిర్వహించిన వైద్య పరీక్షల్లో కొవిడ్-19 (కరోనా) వ్యాధి ఉన్నట్టు తేలింది. ఢిల్లీలో ఒకరికి, రాజస్థాన్‌లో ఓ ఇటలీ పర్యాటకునికి కూడా కరోనా సోకినట్టు నిర్ధారణ అయింది. ఢిల్లీవాసి కూడా ఇటీవల ఇటలీ వెళ్లివచ్చినట్టు అధికారులు తెలిపారు. దీంతో ఇప్పటివరకు కరోనా సోకిన భారతీయుల సంఖ్య ఐదుకు చేరింది. ఇంతకుముందు కేరళకుచెందిన ముగ్గురు విద్యార్థులకు వైరస్ సోకగా, వారు చికిత్స పొంది దవాఖాన నుంచి డిశ్చార్జి అయ్యారు. హైదరాబాద్‌లో వ్యాధినిర్ధారణ అయిన వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అని, అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, భయాందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. హైదరాబాద్‌లో తొలి కరోనా కేసు నమోదైన నేపథ్యంలో అది ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. కరోనాను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా సిద్ధంగా ఉన్నదని చెప్పారు. డీఎంఈ కార్యాలయంలో మంత్రి రాజేందర్ సోమవారం విలేకరులతో మాట్లాడారు. బెంగళూరులో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కంపెనీ పనిమీద గతనెల 15న దుబాయ్ వెళ్లారని చెప్పారు. అక్కడ ఐదు రోజులు వివిధ దేశాలవారితో కలిసి పనిచేసిన ఆయన తిరిగి 20న బెంగుళూరుకు, అక్కడి నుంచి 22న హైదరాబాద్‌కు వచ్చారని

మిగతా 4వ పేజీలో



### సోషల్ మీడియాకు మోదీ వీడ్కోలు?

వైదొలగాలని యోచిస్తున్నట్టు ప్రధాని వెల్లడి

5

### ఉరి మళ్లీ వాయిదా

నిర్భయ దోషుల కేసులో ఢిల్లీ అదనపు సెషన్స్ కోర్టు ఆదేశం
రాష్ట్రపతిని క్షమాభిక్ష కోరిన దోషి పవన్
న్యాయపరమైన ప్రక్రియలు పూర్తికాలేదన్న న్యాయవాది
ఏకీభవించిన న్యాయమూర్తి..
వరుసగా మూడోసారి ఉరి అమలు నిలిపివేత

5

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 57.00 | రిటైల్ లైవ్ | 79.00 |
| డ్రెస్డ్ | 115.00 | స్కిన్‌లెస్ | 130.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 316.00 | రంగారెడ్డి | 316.00 |
| మెదక్ | 316.00 | కరీంనగర్ | 319.00 |
| వరంగల్ | 319.00 | డజన్ ధర | 60.00 |

# రైతుకు బహుముఖ ప్రోత్సాహం



- అన్నివిధాలుగా ఆదుకుంటున్న సీఎం కేసీఆర్
- ఓ రైతు సీఎంగా ఉన్నందునే వ్యవసాయం కొత్తపుంతలు
- ప్రతిపక్షాల విమర్శలను సమర్థంగా తిప్పికొట్టాలి
- టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారక రామారావు
- డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లతో సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

స్వయంగా రైతు అయిన కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండటంవల్లే రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధితోపాటు, రైతు సంక్షేమానికి అనేక కార్యక్రమాలు, పథకాలు అమలవుతున్నాయని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంతో సాగునీరు, పెట్టుబడి సాయంకోసం రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, గిట్టుబాటు ధర.. ఇలా అన్నిరకాలుగా ప్రోత్సాహంతో రాష్ట్రంలో వ్యవసాయరంగం కొత్తపుంతలు తొక్కుతున్నదని తెలిపారు. సోమవారం తెలంగాణభవన్‌లో డీసీసీబీ, డీసీఎంఎస్ నూతన చైర్మన్లు, వైస్‌చైర్మన్లతో కేటీఆర్ సమావేశం నిర్వహించారు. ఇందులో మంత్రులు నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్, మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్లు, వైస్‌చైర్మన్లుగా ఎన్నికైనవారికి కేటీఆర్

మిగతా 3వ పేజీలో

### రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

అన్ని ఏర్పాట్లు పూర్తి • హాజరుకానున్న 9.65 లక్షల మంది విద్యార్థులు
నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ • విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడి
పరీక్షా కేంద్రాల కోసం ‘సెంటర్ లొకేటర్’ యాప్

4



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ బాల్క సుమన్

### రేవంత్.. తప్పు ఒప్పుకో

ఇప్పటికైనా క్షమాపణలు చెప్ప
ప్రభుత్వ విప్ బాల్క సుమన్ డిమాండ్
ప్రజల దృష్టిని మరల్చడానికే ఆరోపణలంటూ ఆగ్రహం
ఫాంహౌస్‌ను నాలుగేండ్ల క్రితం కేటీఆర్ లీజుకు తీసుకున్నారని వెల్లడి
భూములను ఎన్నికల అఫిడవిట్‌లోనే చూపారని స్పష్టీకరణ

4

### కబ్జాల లెక్క పక్కా

‘రేవంత్ భూదందా’పై కలెక్టర్‌కు ఆర్డీవో నివేదిక
5.21 ఎకరాలు బోనావెకెన్సియా పరిధిలో చేర్చాలని సిఫారసు
అసలు పట్టాదారు ఇంటిపేరు ‘వడ్డె’.. మధ్యలో చేరిన ‘దబ్బా’ ‘ఎర్రగండ్ల’

4

# తెలంగాణ క్రమశిక్షణ

- ఎఫ్‌ఆర్బీఎం పరిధిలోనే తెలంగాణ అప్పులు
- బ్యాంకులు, ఆర్థికసంస్థల నుంచి అతి తక్కువ రుణం తీసుకున్న రాష్ట్రం
- పార్లమెంట్ సాక్షిగా మరోసారి కేంద్రం స్పష్టీకరణ



**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

ఆర్థికక్రమశిక్షణలో తెలంగాణ అగ్రభాగాన ఉన్నదని, ఎక్కువ సంపద ఉన్నా తక్కువ అప్పులు తీసుకుంటున్న రాష్ట్రాల్లో ముందు వరుసలో నిలిచిందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా మరోసారి వెల్లడించింది. రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు ఎప్పుడూ ఆర్థిక క్రమశిక్షణ దాటలేదని పేర్కొన్నది. తెలంగాణప్రభుత్వం తీసుకుంటున్న అప్పులు ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్బీఎం) పరిమితికి లోబడే ఉన్నాయా? లేక పరిధి దాటాయా? అంటూ రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీ బండి సంజయ్, కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి అనురాగ్‌ఠాకూర్ సోమవారం లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం మొత్తం అప్పులు పరిమితిలోనే ఉన్నాయంటూ గతంలోనే కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రకటించగా.. బ్యాంకులు, ఇతర ఆర్థికసంస్థల నుంచి తీసుకుంటున్న అప్పులు ఇతరరాష్ట్రాలకంటే తెలంగాణలోనే తక్కువగా ఉన్నాయంటూ సహాయమంత్రి అనురాగ్‌ఠాకూర్ తాజాగా లిఖితపూర్వకంగా ప్రకటించడంతో రాష్ట్రం అప్పులపై గొంతుచించుకునే ప్రతిపక్షాలు ఒక్కసారిగా కంగుతిన్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 293 (3) సెక్షన్ ప్రకారం ఆయా రాష్ట్రాల సంపద (జీఎస్డీపీ) మొత్తంలో 3శాతం వరకు మాత్రమే అప్పుతీసుకునే పరిమితి

మిగతా 2వ పేజీలో

## సాఫ్ట్‌వేర్ కుటుంబం ఆత్మహత్య

భార్య, ఇద్దరు పిల్లలకు విషమిచ్చి బలవన్మరణం

3

వ్యాపారంలో నష్టమే కారణమని సూసైడ్ నోట్ • హైదరాబాద్ హస్తినాపురంలో విషాదం

epaper.ntnews.com

## చెరువు నీళ్లు చూస్తే ఆకలి ఐతలేదు



మా ఊరి ఉదకమ్మ చెరువులో నీళ్లను చూస్తే కడుపునిండినట్టు అనిపిస్తున్నది. ఏండ్ల తర్వాత చెరువులో నీళ్లను చూస్తుంటే ఆకలి ఐతలేదు. వరదకాలువల్లో నీళ్లు వదులడంతో చెరువునిండి మత్తడి దుంకుతున్నది.

**-పొన్నం లక్ష్మి, తక్కళ్లపెల్లి (కథలాపూర్)**


## జన్మలో మత్తడి దుంకుతుందనుకోలే



పదిహేనుండ్లుగా నీళ్లు లేక ఉన్న కొచ్చెరువు కాళేశ్వరం నీళ్లతో మత్తడి దుంకుతున్నది. జన్మలో మత్తడి దుంకుతుందనుకోలే. 550 ఫీట్ల వరకు బోర్లు వేసినా లాభం ఉండకపోయేది. 15 ఏండ్లుగా నాలుగు ఎకరాల పంట పండించడమే గగనమయ్యేది. కాళేశ్వరం నీళ్లు రావడం సంతోషంగా ఉన్నది.

**- గోదాల నర్సయ్య, రైతు, నాగుల మల్యాల**

## మొత్తం పొలం సాగుచేశాం



వరదకాలువలో నీళ్లు మస్తుగా వస్తుండటంతో మొత్తం పొలం వేసిన. మాకు 3 ఎకరాల 10 గుంటల భూమి ఉంది. కొన్నేండ్ల కింద 20 గుంటల పొలంచేసి మిగిలింది బీడు పెట్టెటోళ్లం. చెరువులకు నీళ్లు రావడంతో బోర్లకు నీళ్లు మస్తుగ వచ్చినయి. ఉన్న మొత్తం పొలం సాగు చేసిన. కేసీఆర్ సారు ఉండబట్టే ఇంత పొలం సాగుచేసిన.


**- వేల్పుల పోచవ్వ, గర్శకుర్తి (గంగాధర మండలం)**

## భూగర్భజలాలు పెరిగితే మంచిది



భూ అంతరంలోకి వెళ్తున్నకొద్దీ లవణాల గాఢత అంత ఎక్కువ. బోరు నీటితో సాగుచేస్తే ఎరువులు పనిచేయవు. భూగర్భ జలాలు పెరిగితే లవణాల గాఢత తగ్గుతుంది. ఫలితంగా అధిక దిగుబడి, నాణ్యమైన పంట చేతికొస్తుంది.

**- ఆచార్య ఉమారెడ్డి, పొలాస పరిశోధన స్థానం (జగిత్యాల)**



జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో నిండుగా ప్రవహిస్తున్న ఎస్సారెస్పీ వరద కాలువ

### వరద కాలువకు నీళ్లు వచ్చేది ఇలా..


శ్రీరాజరాజేశ్వర జలాశయం వరకు ఉన్న ఎస్సారెస్పీ వరదకాలువ మొత్తం పొడవు 122 కిలోమీటర్లు. కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లో భాగంగా శ్రీరాజరాజేశ్వర జలాశయానికి నీటిని ఎత్తిపోసే క్రమంలో 99.02 కిలోమీటర్ వద్ద వరద కాలువ కలుస్తుంది. వరద కాలువ 102 కిలోమీటర్ వద్ద హెడ్‌రెగ్యులేటర్ గేట్లు బిగించారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ వద్ద (వరదకాలువ 73వ కిలోటర్) తొలి పంపుహౌస్, ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేట (34 కిలోమీటర్) వద్ద రెండో పంపుహౌజ్, నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం (0.10 కిలోమీటర్) వద్ద మూడో పంపుహౌజ్ ఏర్పాటుచేశారు. మూడు పంపుహౌజ్‌ల పరిధిలో రోజుకు ఒక టీఎంసీ చొప్పున నీటిని ఎత్తిపోసేందుకు ప్రతి పంపుహౌజ్‌లో ఏనిమిది మోటర్లు ఏర్పాటుచేశారు. ఒక్కో మోటరు సామర్థ్యం 6.5 మెగావాట్లు. ఒక్కో మోటరు రోజుకు 1,450 క్యూసెక్కుల చొప్పున ఎనిమిది మోటర్లు రోజుకు టీఎంసీ నీటిని ఎత్తిపోస్తాయి. ప్రస్తుతం రాంపూర్, రాజేశ్వర్‌రావుపేట పంపుహౌజ్ వద్ద మోటర్లు విజయవంతంగా నడుస్తున్నాయి. దీంతో 102 కిలోమీటర్ నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరదకాలువ హెడ్ రెగ్యులేటరీ గేట్ల వరకు కాళేశ్వరం జలాలు వెళ్లాయి. ప్రాజెక్టులో 50 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నంతవరకు వరద కాలువ నుంచి నీళ్లు హెడ్ రెగ్యులేటరీ గేట్లద్వారా లోపలికి వెళ్తాయి. 50 టీఎంసీలు మించి ప్రాజెక్టులో నీళ్లుంటే ముప్కాల్ పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 51.86 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి.



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండన్నపల్లి వద్ద వరద కాలువ నుంచి పొలాలకు పెట్టిన మోటర్లు

### మారిన పల్లెల రూపురేఖలు

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి కొన్నేండ్లుగా కరువుతో కొట్టుమిట్టాడింది. కొంతకాలంగా గ్రామం దశ తిరిగింది. వరద కాలువ ఈ గ్రామంపక్క నుంచే వెళ్తున్నది. ఎస్సారెస్పీ పునర్జీవ పథకం కింద రిజర్వాయర్‌లా మారటంతో గ్రామానికి చెందిన వేలమంది రైతులు మోటర్లతో పొలాలకు నీళ్లు పెట్టుకొంటున్నారు.గర్శకుర్తి పరిధిలో 3317 ఎకరాల సాగుభూమి ఉండగా, 2017-18లో యాసంగిలో 429 ఎకరాల్లో సాగైంది. 2018-19 రబీలో 612 ఎకరాలు సాగుకాగా.. ప్రస్తుత యాసంగిలో ఏకంగా 1280 ఎకరాల్లో సాగుచేసారు. వానకాలంలో 2,426 ఎకరాల్లో సాగు చేశారు.



కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం నాగులమల్యాలలో మత్తడి దుంకుతున్న కొచ్చెరువు

**జగిత్యాల** జిల్లాలోని కథలాపూర్ మండలం తక్కళ్లపల్లి పరిధిలోని ఉదకమ్మ చెరువు అలుగుపారితే దిగువన కోరుట్ల వరకు చేరేది. ఉనికి కోల్పోయిన ఈ చెరువులో నెల కిందటి వరకు నీరు లేదు. ప్రస్తుతం వరద కాలువ పుణ్యమాని ఉదకమ్మ చెరువు అలుగు దుంకింది. చెరువు కింద 304 ఎకరాల ఆయకట్టు సాగయ్యే అవకాశం ఉన్నది.

**జగిత్యాల జిల్లా** మల్యాల మండలం పోతారం పెద్ద చెరువు వరద కాలువ 76.560 కిలోమీటర్ వద్ద తూము నుంచి వచ్చే నీటితో 25 ఏండ్ల తర్వాత మత్తిడి దుంకింది. పోతారం చెరువు నిండుకుండగా మారడంతో పోతారంతో పాటు రాజారాం, రామన్నపేట, నూకపెల్లి, మల్యాల, నర్సింగాపూర్, తారకరామనగర్ ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగి రెండు పంటలకు నీరందుతున్నది.

**కరీంనగర్** నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలం నాగులమల్యాల కొచ్చెరువుకు దశాబ్దంన్నర తర్వాత మత్తడి దుంకింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గంగాధర మండలం ఆచంపల్లి వద్ద వరద కాలువకు రెండు తూములు ఏర్పాటుచేసి చెరువులోకి నీటిని తరలిస్తున్నారు. దీంతో నాగుల మల్యాల కొచ్చెరువుతోపాటు గొలుసుకట్టు చెరువులైన బాహు చెరువు, ఉర చెరువు, పెద్ద చెరువు, కరువు కుంట నిండాయి.

# ఫలించిన జల ఆశయం

**ఎస్సారెస్పీ పునర్జీవ పథకంతో కొత్త చరిత్ర.. 122 కిలోమీటర్ల మేర రిజర్వాయర్‌గా వరద కాలువ**

**టీఎంసీ నీటినిల్వ.. పెరిగిన భూగర్భజలాలు.. 32 స్లూయిస్ గేట్లతో 49 చెరువులకు నీళ్లు**

**పాతికేండ్ల తర్వాత నిండుతున్న చెరువులు.. 16 చోట్ల ఎత్తిపోతల నిర్మాణానికి ప్రణాళిక**

**కే ప్రకాశ్‌రావు, కరీంనగర్ ప్రధాన ప్రతినిధి/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కనీసం ఊహించనైనా లేదు..ఇసుకమేట వేసిన వరదకాల్వలో నీళ్లొస్తాయని. ఏడాది పొడవునా కాల్వ నిండుకుండలా ఉంటుందని ఆలోచనైనా చేయలేదు. ఎగువ ప్రాజెక్టులతో వట్టిపోయిన శ్రీరాంసాగర్‌లో జలకళ ఉట్టిపడుతుందన్న ఆశ ఎప్పుడో పోయింది. కానీ.. ఇప్పుడు అదే వరదకాల్వ తెలంగాణ పాలిట వరప్రదాయినిగా మారింది. శ్రీరాజరాజేశ్వర జలాశయాన్ని నింపటం కోసం ఉద్దేశించిన ఈ కాలువ ఇప్పుడు 122 కిలోమీటర్ల పొడవునా నీటినిల్వలతో అతిపెద్ద జలాశయంగా రూపుదిద్దుకొన్నది. తెలంగాణలో గోదావరి పునరుత్థానం కోసం ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు రూపకల్పనచేసిన పునర్జీవ పథకం అనుకొన్నదానికంటే మూడింతల బహుళ ప్రయోజనాలను చేకూరుస్తున్నది. కాలువ పొడవునా 33 వేల మోటర్ల ద్వారా రైతులు పొలాలకు నీళ్లు తీసుకొంటున్నారు. కాళేశ్వరం జలాల ఎత్తిపోతతో వరదకాల్వ జీవనదిలా మారింది. నాలుగు దశాబ్దాల తర్వాత నాలుగు జిల్లాల్లో చెరువులను నింపి వేల ఎకరాల్లో రెండుపంటలకు సాగునీరు అందించడానికి అవకాశం కల్పించింది. కాలువ వెంట 16 చోట్ల లిఫ్టులు పెట్టడం ద్వారా.. వరదకాల్వ కుడివైపున చెరువులను కూడా నింపి లక్ష ఎకరాలకు సాగునీరు అందించే బృహత్ప్రయత్నం జరుగుతున్నది.

### చెరువులకు మహర్దశ

ఇటీవల సీఎం కేసీఆర్ ఆదేశంతో అధికారులు మూడు రోజుల పాటు మోటర్లను నడిపి 1.5 టీఎంసీ నీటిని వరదకాల్వకు తరలించారు. చెరువులకు ఇప్పటివరకు 0.5 టీఎంసీ నీటిని విడుదల చేశారు. దీంతో కాలువను ఆనుకొని ఉన్న కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాల్లో చెరువులకు మహర్దశ పట్టింది. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాలు, జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కథలాపూర్, మేడిపల్లి, మల్యాల, పెగడపల్లి, కరీంనగర్ జిల్లాలోని రామడుగు, గంగాధర, కొత్తపల్లి మండలాల్లోని చెరువులను నింపుతున్నారు. వరద కాలువ పొడవునా 49 చెరువులు ఉండగా, మూడు మినహా 46 చెరువులను తూముల ద్వారా వంద శాతం నింపారు. ఈ చెరువుల కింద సుమారు ఆరువేల ఎకరాలు సాగవుతున్నాయి.

### భారీగా పెరిగిన భూగర్భ జలాలు

వరద కాలువలో ఒక టీఎంసీ జలాలు నిల్వ ఉండటంతో అది జలాశయంగా మారింది. ఇటీవల 1.5 టీఎంసీ నీటితో వరద కాలువను నింపగా, చెరువులకు 0.5 టీఎంసీ నీటిని విడుదల చేశారు. వరదకాలువ పొడవునా వేల మోటర్లతో రైతులు నీళ్లు తీసుకుంటున్నారు. నీళ్లు తగ్గగానే మళ్లీ నింపేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వరదకాలువకు రెండు వైపులా సుమారు పది నుంచి పదిహేను కిలోమీటర్ల వరకు భూగర్భజలాలు పెరిగాయి. రాజన్నసిరిసిల్ల జిల్లాలో మధ్యమానేరు నిండడంతోపాటు పునర్జీవ పథకం ప్రభావంతో భూగర్భజలాలు భారీగా పెరిగాయి. గత ఏడాది ఫిబ్రవరిలో 16.68 మీటర్ల భూగర్భ జలాలు ఉండగా ప్రస్తుతం 9.48 మీటర్ల లోతున ఉన్నాయి. అంటే 7.2 మీటర్ల మేర పైకి వచ్చాయి.



నాగుల మల్యాలలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే గంగుల చిత్రపటాలకు క్షీరాభిషేకం (ఫైల్)

### రైతులపై సీఎం కేసీఆర్ సానుభూతి

వరద కాలువను నింపి చెరువులకు నీళ్లిస్తుంటే, కాలువ పొడవునా దాదాపు 33 వేల మోటర్లతో రైతులు నీటిని పొలాలకు మళ్లించుకుంటున్నారు. అక్రమంగా మోటర్లు ఏర్పాటు చేయడంతో నీళ్లు పైకి ఎక్కేందుకు కష్టమవుతున్నదని సాగునీటిశాఖ అభ్యంతరం వ్యక్తంచేసింది. ఉచితవిద్యుత్ అందిస్తున్నందున మోటర్ల ఏర్పాటు అక్రమం కాదని, పొలాలు ఎండిపోయే అవకాశం ఉన్నందున రైతులు నీళ్లు తీసుకోవడాన్ని అడ్డుకోవద్దని అధికారులకు సీఎం కేసీఆర్ సూచించినట్టు తెలిసింది.

### లక్ష ఎకరాల ఆయకట్టుకు జీవం

వరద కాలువ ఎడమ వైపు పల్లంగా, కుడివైపు ఎత్తుగా ఉన్నది. ఎడమవైపు తూముల ద్వారా చెరువులకు నీళ్లిస్తున్నారు. కుడివైపు చెరువులను నింపేందుకు గ్రావిటీ ద్వారా అవకాశం లేదు. దీంతో వరదకాలువ పొడవునా ఎత్తిపోతల పథకాలు నిర్మించి రైతులకు సాగునీరు అందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. లిఫ్టుల ఏర్పాటుకు 16 ప్రాంతాలు అనువుగా ఉన్నాయని అధికారులు ప్రాథమికంగా నివేదిక పంపారు. ప్రస్తుతం ఎడమవైపు ఉన్న 49 చెరువులతోపాటు కుడివైపు ఎత్తిపోతల ద్వారా గొలుసుకట్టు చెరువులను నింపుతూ సుమారు లక్ష ఎకరాలకు నీళ్లివ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది.

### వరదకాలువలో రిజర్వాయర్లు

ఎస్సారెస్పీ నుంచి 0-122 కిలోమీటర్లు ఉన్న వరదకాలువను ఎస్సారెస్పీ పునర్జీవ పథకం కింద నిండుకుండలా మార్చడానికి మూడు రిజర్వాయర్లుగా విభజించారు. ఇందులో 0-34 కిలోమీటర్ వరకు ఒకటి, రెండోది 34-73 కిలోమీటర్ వరకు, మూడోది 73-122 వరకు ఏర్పాటుచేశారు. మిడ్‌మానేరు వరకు నాలుగు ప్రాంతాల్లో హెడ్ రెగ్యులేటర్స్‌తో వదరకాలువ 122 కిలోమీటర్ల పొడవు కాళేశ్వరం జలాలతో 1.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

### తూముల వ్యాసం పెంపు

వరదకాలువపై 32 స్లూయిస్ గేట్లు ఉన్నాయి. ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా మెజార్టీ తూముల వ్యాసం పెంచారు. ఉమ్మడిరాష్ట్రంలో వ్యాసం పెంచాలని విజ్ఞప్తిచేసినా పట్టించుకోలేదు. వరదకాలువ నుంచి చెరువులు త్వరగా నిండేందుకు తూముల వ్యాసాన్ని 450 ఎం.ఎం. నుంచి 800 ఎం.ఎం.కు పెంచారు. దీని వల్ల గతంలో ఫీటు ఎత్తుతో వెళ్లే జలాలు, ప్రస్తుతం మూడు ఫీట్ల ఎత్తుతో చెరువులకు తరలుతున్నాయి. చాలాచోట్ల ఆరు మీటర్ల ఎత్తులో తూములు ఉండేవి. సీఎం కేసీఆర్ ఆదేశాలతో చెరువుల ఎత్తును పరిగణనలోకి తీసుకొని రెండు మీటర్లు తగ్గించి నాలుగుమీటర్ల ఎత్తులో పెట్టారు. దీంతో చెరువులు త్వరగా నిండేందుకు అవకాశం ఏర్పడింది.

### మూడురకాలుగా వినియోగం

ఎస్సారెస్పీ పునర్జీవ పథకం మూడు రకాలుగా ఉపయోగపడనుంది.ఎస్సారెస్పీ నిండితే అక్కడి నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయం, దిగువమానేరు జలాశయానికి నీటిని తీసుకోవచ్చు. మరోవైపు ఎస్సారెస్పీ గడ్డు పరిస్థితుల్లో ఉన్నప్పుడు కాళేశ్వరం పథకం ద్వారా నీటిని ఎదురెక్కించి పూర్తిస్థాయిలో నింపవచ్చు. అవసరాన్ని బట్టి 122 కిలోమీటర్ల పొడవునా 1.5 టీఎంసీల నీటిని నింపి తద్వారా పరివాహక ప్రాంతంలోని చెరువులకు నీరు ఇవ్వవచ్చు.

### ఇదీ శ్రీరాంసాగర్ దుస్థితి

1963 జూలై 26న ఆనాటి ప్రధాని నెహ్రూ పోచంపాడుప్రాజెక్టు (శ్రీరాంసాగర్)కు శంకుస్థాపన చేశారు. 1970 జూలై 24న అప్పటి సీఎం బ్రహ్మానందరెడ్డి ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90 టీఎంసీలు. శ్రీరాంసాగర్ స్టేజీ-1 కింద పూర్వ నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలో 9,68,640 ఎకరాలకు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు స్టేజీ- 2 కింద 3,97,949 ఎకరాలకు నీళ్లివ్వాలని నిర్ణయించారు. ఉమ్మడిరాష్ట్రంలో ప్రాజెక్టు కాలువల నిర్మాణంపై వివక్ష, ఎగువన మహారాష్ట్రలో గోదావరిపై పలు ఎత్తిపోతల ప్రాజెక్టులను నిర్మించారు. దీంతో వరప్రదాయినిగా భావించిన ప్రాజెక్టు ఉనికే ప్రశ్నార్థకంగా మారింది.

### పునర్జీవమే శ్రీరామరక్ష

కోటి ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యంగా సాగుతున్న సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల రీడిజైనింగ్‌లో భాగంగా ఎస్సారెస్పీ పునర్జీవ పథకానికి శ్రీకారం చుట్టారు. కాళేశ్వరం లింక్-2లో శ్రీరాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయానికి ఎత్తిపోయడం పునర్జీవపథకంలో ఓ భాగం. గాయత్రి పంపుహౌజ్ నుంచి బహుబలి మోటర్ల ద్వారా ఎత్తిపోసే నీరు వరద కాలువ 99.02 కిలోమీటర్ వద్ద కలుస్తుంది. వరదకాలువ 102 కిలోమీటర్ వద్ద హెడ్ రెగ్యులేటర్‌కు గేట్లు బిగించారు. గేట్లు తెరిస్తే దిగువన మధ్యమానేరుకు నీళ్లు వెళ్తాయి. మూస్తే ఎగువన ఎస్సారెస్పీకి ఎదురెక్కుతాయి. రూ.1,751 కోట్లతో చేపట్టిన పునర్జీవ పథకానికి 2017 ఆగస్టు 10న ముప్కాల్ వద్ద సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. నీటిని ఎత్తిపోసేందుకు రాంపూర్, రాజేశ్వర్‌రావుపేట పంపుహౌజ్‌పై ప్రత్యేక దృష్టిపెట్టి రెండేండ్లలో పూర్తిచేశారు. ముప్కాల్ పంపుహౌజ్‌కు సంబంధం లేకుండా రాంపూర్, రాజేశ్వర్‌రావుపేట పంపుహౌజ్ ద్వారా సుమారు 54 టీఎంసీల నీటిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎత్తిపోయడానికి ఆస్కారం ఉన్నది. ముప్కాల్ పంపుహౌజ్ కూడాపూర్తయితే రోజుకు టీఎంసీ నీటిని ఎస్సారెస్పీకి ఎత్తిపోయవచ్చు. రోజుకు టీఎంసీని తరలించేందుకు డిజైన్ చేసిన ఈ పథకం అతితక్కువ ఖర్చుతో 48 ఎకరాల భూసేకరణతోనే పూర్తయ్యింది.

## ఆస్తిపన్ను వసూళ్లలో 100% లక్ష్యం

**ఎగవేతదారుల జాబితా సిద్ధం చేయాలి: సీడీఎంఏ డాక్టర్ సత్యనారాయణ**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆస్తిపన్ను వసూళ్లలో వంద శాతం లక్ష్యాన్ని చేరుకొనేందుకు పురపాలకశాఖ నడుం బిగించింది. ఇవ్వాల్టివరకు వసూళ్లు కనీసం 80 శాతం కూడా దాటలేదు. కొన్నింటిలో 30 శాతమూ చేరలేదు. ఈ నెల 31 లోపు వసూళ్లు వంద శాతం సాధించేలా చర్యలు తీసుకోవాలని పురపాలకశాఖ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ సోమవారం అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు 500 మంది ఎగవేతదారుల జాబితా సిద్ధం చేసుకొని.. వసూళ్ల లక్ష్యాలను ఇవ్వాలన్నారు. మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీచేసేలా మున్సిపల్ కమిషనర్లకు అధికారాలు ఇచ్చారు.

**ముహూర్తం**



సూర్యోదయం: 6.33 గంటలకు



సూర్యాస్తమయం: 6.17 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం అష్టమి మధ్యాహ్నం 1.50 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: రోహిణి ఉదయం 10.32 వరకు, తదుపరి మృగశిర, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 3.20 నుంచి సాయంత్రం 4.49 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.53 నుంచి 9.40 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.22 నుంచి 3. 09 వరకు, వర్జ్యం: సాయంత్రం 4.19 నుంచి 6.00 వరకు.

**లోకం పోకడ**




# తెలంగాణ క్రమశిక్షణ

మొదటిపేజీ తరువాయి...

ఉంటుందని.. దానిని అనేక రాష్ట్రాలు అతిక్రమిస్తున్నా తెలంగాణ మాత్రం పరిధి దాటలేదని కేంద్రమంత్రి తన సమాధానంలో పేర్కొన్నారు. రాష్ట్రఖజానాపై అప్పుల భారం పెంచకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నదని కితాబిచ్చారు. 'తెలంగాణ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు ఏ ఏడాది కూడా ఆర్థిక క్రమశిక్షణ గీత దాటలేదు. సంపద ఎక్కువ ఉన్నా అతితక్కువ అప్పులు తీసుకుంటున్న రాష్ట్రాల్లో ముందువరుసలో ఉన్నది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు బ్యాంకులు, నాబార్డు, పీఎఫ్‌సీ, హడ్కో వంటి ఆర్థికసంస్థల నుంచి రూ. 3,468 కోట్లు మాత్రమే అప్పు తీసుకున్నది' అని వెల్లడించారు. ఎఫ్‌ఆర్బీఎంకు లోబడే రుణాలు తీసుకుని ఆర్థికక్రమశిక్షణ పాటిస్తున్నట్టు స్పష్టంచేశారు. దేశంలోని 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కలిపి బ్యాంకులు ఇతరఆర్థిక సంస్థల నుంచి ఇప్పటివరకు రూ.2,58,232.30 కోట్ల అప్పు తీసుకున్నాయని.. పెద్దరాష్ట్రాలలో అతితక్కువ అప్పు తీసుకున్న జాబితాలో తెలంగాణ ముందువరుసలో నిలిచిందని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ రూ.5,117కోట్లు, తమిళనాడు రూ.11,220 కోట్లు, కర్ణాటక రూ. 4,941 కోట్లు అప్పు తీసుకున్నాయి. దేశవ్యాప్తంగా అత్యధికంగా అప్పు తీసుకున్న రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉన్నది. ఆ రాష్ట్రం రూ.63,452 కోట్లు తీసుకోగా.. పంజాబ్ రూ.29310.90 కోట్లు, మహారాష్ట్ర రూ.18,721 కోట్లు, గుజరాత్ రూ.17,075 కోట్లు, మధ్యప్రదేశ్ రూ.15,061.60 కోట్లు తీసుకున్నాయి. చిన్నరాష్ట్రాలయిన అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, నాగాలాండ్, మిజోరం, గోవా వంటి చిన్న రాష్ట్రాలు తక్కువ అప్పు తీసుకున్న జాబితాలో ఉన్నాయి. వాస్తవానికి తెలంగాణ రాష్ట్ర సంపద ఎనిమిదిన్నర లక్షల కోట్ల రూపాయలకుపైగా ఉన్నది. అందులో 3 శాతం వరకు అప్పు తీసుకునే అవకాశముంటుంది. రాష్ట్ర ఆర్థికపరిస్థితి పటిష్ఠంగా ఉండటంతోపాటు, క్రమశిక్షణ పాటిస్తున్న కారణంగా కేంద్రప్రభుత్వం ఎఫ్‌ఆర్బీఎం పరిమితిని 3 నుంచి 3.25కు తర్వాత 3.5 వరకు పెంచుతున్నది. దీనిప్రకారం మన రాష్ట్రం ఈ ఏడాది రూ.27 వేల వరకు అప్పుతీసుకునే అవకాశమున్నది. అయితే తెలంగాణ సర్కార్ మాత్రం మొత్తం అప్పులు పరిమితి దాటకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నది.

### రాష్ట్ర రాబడులు 67,574 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2019-20లో జనవరి వరకు రాష్ట్రం మొత్తం రాబడులను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రం సొంత రాబడులతో పాటు కేంద్రగ్రాంట్లు కలుపుకుని రూ.67,574 కోట్లు రాష్ట్ర ఖజానాకు చేరిందని తెలిపింది. ఇది మొత్తం బడ్జెట్ అంచనాలలో 70 శాతాన్ని దాటినట్టు పేర్కొన్నది. ఫిబ్రవరి, మార్చి కలిపితే ఇది ఇంకా పెరిగే అవకాశమున్నది.

### ప్రతిపక్షాలకు చెంపపెట్టు

తెలంగాణ అప్పల ఊబిలో కూరుకుపోతున్నదని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదంటూ వీలు దొరికినప్పుడల్లా గొంతు చించుకునే కాంగ్రెస్ పార్టీకి కేంద్రప్రభుత్వం ఇచ్చిన సమాధానం చెంపపెట్టులా మారింది. తెలంగాణ రెవెన్యూ లోటులేకుండా ఆర్థికంగా స్వయంసమృద్ధిని సాధిస్తున్నదని, 2014-15 ఆర్థిక సంవత్సరం మొదలుకుని 2018-19 వరకు తెలంగాణ రెవెన్యూ మిగులు రాష్ట్రంగా ఉన్నదని కేంద్రం మరోసారి స్పష్టంచేయడంతో ప్రతిపక్షాల నోరుమూసినట్టయింది. 2014-15 నుంచి ఇప్పటివరకు తెలంగాణ తీసుకున్న అప్పులు 14వ ఆర్థికసంఘం సిఫారసు చేసిన నిబంధనల పరిమితులకు లోబడే ఉన్నాయంటూ ఇదివరకే ఆర్థికశాఖమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంచేశారు. పైగా, తెలంగాణ రూపొందించుకున్న మధ్యకాలిక ప్రణాళికకు అనుకూలంగా ఉన్నదంటూ వెల్లడించారు. కేంద్ర నిబంధనలకు అనుగుణంగానే గ్రాంట్-ఇన్-ఎయిడ్ నిధులను మంజూరుచేస్తున్నామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఆయా శాఖలవారీగా యుటిలైజేషన్ సర్టిఫికెట్లను ఇస్తున్నదని పేర్కొన్నారు.కాగా, రాష్ట్రానికి ఉన్న ఎఫ్‌ఆర్బీఎం పరిమితిని 3 నుంచి 3.5కు పెంచుతూ కేంద్ర ఆర్థికశాఖ అధికారికంగా ఉత్తర్వులను జారీచేసింది. రాష్ట్రం సాధిస్తున్న స్థిరమైన ఆర్థికవృద్ధిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నది.

**ఆర్బీఐ నివేదిక ప్రకారం బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రాష్ట్రాలు తీసుకున్న రుణాల వివరాలు**

| రాష్ట్రాలు | 2017-18 | 2018-19 | 2019-20 (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| తెలంగాణ | 4154.20 | 4025.60 | 3468.90 |
| ఆంధ్రప్రదేశ్ | 4615.10 | 5262.40 | 5117.00 |
| అసోం | 2164.20 | 3468.70 | 4309.70 |
| బీహార్ | 6827.20 | 7919.10 | 9422.30 |
| ఛత్తీస్‌గఢ్ | 3889.20 | 4566.80 | 5116.10 |
| ఉత్తరప్రదేశ్ | 58817.30 | 62,294.30 | 63452.40 |
| పశ్చిమబెంగాల్ | 7031.90 | 7679.40 | 8171.30 |
| గుజరాత్ | 11837.20 | 14690.60 | 17075.40 |
| హర్యానా | 3492.70 | 3583.30 | 4670.90 |
| హిమాచల్‌ప్రదేశ్ | 2491.60 | 2626.30 | 2840.60 |
| జమ్ముకశ్మీర్ | 3725.60 | 3601.20 | 3522.50 |
| జార్ఖండ్ | 6070.40 | 7416.40 | 9458.40 |
| కర్ణాటక | 4289.10 | 4760.30 | 4941.90 |
| కేరళ | 5208.10 | 5093.20 | 5006.90 |
| మధ్యప్రదేశ్ | 9569.30 | 12284.00 | 15061.60 |
| మహారాష్ట్ర | 8173.50 | 12242.80 | 18721.90 |
| మణిపూర్ | 326.30 | 446.80 | 476.50 |
| మేఘాలయ | 375.10 | 517.80 | 711.40 |
| మిజోరం | 502.60 | 564.80 | 655.60 |
| నాగాలాండ్ | 658.00 | 594.00 | 519.50 |
| ఒడిశా | 11031.30 | 14526.40 | 17612.00 |
| పంజాబ్ | 34422.90 | 30269.60 | 29310.90 |
| రాజస్థాన్ | 9413.00 | 10551.90 | 11243.60 |
| తమిళనాడు | 9498.90 | 10502.70 | 11220.90 |
| ఉత్తరాఖండ్ | 3784.90 | 3980.20 | 4075.50 |
| అరుణాచల్‌ప్రదేశ్ | 559.70 | 338.40 | 40.20 |
| గోవా | 688.10 | 659.00 | 730.30 |
| త్రిపుర | 951.80 | 920.50 | 984.40 |
| సిక్కిం | 308.00 | 302.70 | 293.70 |
| మొత్తం | 2,11,877.20 | 2,35,689.20 | 2,58,232.30 |



రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్‌ను కలిసిన మాజీ సీఎస్ మోహన్ కందా

# తెలంగాణలో పండుగలా వ్యవసాయం

- రాష్ట్ర ప్రభుత్వ కృషిని అభినందించిన విశ్రాంత సీఎస్ మోహన్‌కందా
- ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌తో భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గునీటి వనరులు పుష్కలంగా అందుబాటులోకి రావడంతో రైతులు సంతోషంగా పంటలు పండించే వాతావరణం తెలంగాణలో నెలకొందని విశ్రాంత ఐఏఎస్ అధికారి, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి మోహన్ కందా చెప్పారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌తో సోమవారం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ప్రణాళిక, వ్యవసాయం, నీటిపారుదల, విద్యుత్ రంగాలతోపాటు పలు అంశాలపై వారు చర్చించారు. వ్యవసాయరంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పలు చర్యలను వినోద్ కుమార్ వివరించారు. కాళేశ్వరం, శ్రీరాంసాగర్ వంటి ప్రాజెక్టుల ద్వారా బీడు భూములను సస్య శ్యామలం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. రానున్నరోజుల్లో కోటి ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. రైతుబంధు పథకంతో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. వ్యవసాయ, సహకార, నీటిపారుదల, విద్యుత్ రంగాల్లో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని అమలుచేస్తున్నామని చెప్పారు. అనంతరం మోహన్‌కందా మాట్లాడుతూ.. సాగునీటి వనరులను అందుబాటులోకి తేవడంలో రాష్ట్ర ప్రభుత్వ కృషి అభినందనీయమన్నారు. వ్యవసాయాన్ని బతుకుదెరువు కోణంనుంచి వాణిజ్యమార్గంలోకి తీసుకుపోవాలని, తద్వారా రైతులు మరింత ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు దోహదపడుతుందని చెప్పారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో ప్రణాళికా సంఘం పాత్ర అత్యంత కీలకమైనదని తెలిపారు. అన్ని శాఖలకు దిశానిర్దేశం చేయాల్సిన గురుతర బాధ్యత ప్రణాళిక సంఘానిదే అని నొక్కిచెప్పారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో మౌలిక, నిర్మాణాత్మక మార్పులు జరుగాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లను విస్తృతంగా ఏర్పాటుచేయాలని, తద్వారా రైతులు ఎదుర్కొంటున్న మార్కెటింగ్ సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు.

## స్థిరంగా ఉపరితలద్రోణి

- రాష్ట్రంలో తేలికపాటి వానలు

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** నైరుతి మధ్యప్రదేశ్, దాని పరిసరాల నుంచి మధ్య మహారాష్ట్ర మీదుగా కోస్తా కర్ణాటక వరకు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వద్ద ఉపరితలద్రోణి స్థిరంగా కొనసాగుతున్నది. ఫలితంగా రాగల 24 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.



# సమన్వయంతో పనిచేయండి

- పెండింగ్ పనులు వేగంగా పూర్తికావాలి
- వివిధశాఖల అధికారులతో మంత్రి కేటీఆర్
- హైదరాబాద్‌లో ఆకస్మిక పర్యటన

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

వివిధశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని ఐటీ, పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు ఆదేశించారు. హైదరాబాద్‌లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సోమవారం మంత్రి ఆకస్మికంగా తనిఖీచేశారు. తెలంగాణభవన్‌లో పార్టీ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న అనంతరం మంత్రి కేటీఆర్ నేరుగా జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45కు చేరుకొని ఫ్లైఓవర్ నిర్మాణపనులను పరిశీలించారు. అనంతరం దుర్గంచెరువుపై నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జి పనులను చూశారు. సుమారు గంటన్నరపాటు సాగిన పర్యటనలో అధికారులకు పలు సూచనలు చేశారు. వర్కింగ్ ఏజెన్సీ ప్రతినిధులను అడిగి పనుల పురోగతిని తెలుసుకున్నారు. పనులు తొందరగా పూర్తిచేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, వివిధశాఖల మధ్య సమన్వయంపై అధికారులతో చర్చించారు. పనులకు అడ్డంకిగా ఉన్న లైన్లను రెండువారాల్లోగా తరలిస్తామని ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. కేబుల్ బ్రిడ్జి పనులు దాదాపు పూర్తయిందని.. సుందరీకరణ, లైటింగ్, పాదచారుల బాటల పనులు చేపట్టినట్టు ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధులు తెలిపారు. కేబుల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యాక దానికి అనుసంధానంగా రోడ్ నంబర్ 45వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను వేగంగా పూర్తిచేయాలని కేటీఆర్ ఆదేశించారు. దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జిపూర్తయితే పశ్చిమ హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ చాలావరకు తగ్గుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయస్థాయిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డిజైన్లతో నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జితో హైదరాబాద్‌కు మరింత గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఈ పర్యటనలో మేయర్ బొంతు రామ్మోహన్, స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తుది దశ పనులు పూర్తిచేసుకొని ప్రజలకు అందుబాటులోకి రానున్న దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి..



పనులను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు

# ఢిల్లీ అల్లర్లపై చర్చ తప్పనిసరి

**స్పీకర్‌తో అఖిలపక్ష భేటీలో నామా నాగేశ్వరరావు డిమాండ్**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఢిల్లీలో జరిగిన హింసపై లోక్‌సభలో చర్చించి, ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించాలని టీఆర్ఎస్ పక్షనేత నామా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై దేశవ్యాప్తంగా కొన్ని వర్గాల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఢిల్లీతోపాటు పలుప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షతన సోమవారం అఖిలపక్ష నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నామా మాట్లాడుతూ, సీఏఏకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలపై కేంద్రం స్పందించాలని కోరారు. ఈ అల్లర్ల కారణంగా ఒక్క ఢిల్లీలోనే 46 మంది చనిపోయారని, ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఢిల్లీలో మళ్లీ అల్లర్లు జరుగుతున్నాయంటూ వదంతులు వస్తున్నాయని, వీటిని ఏమాత్రం ఉపేక్షించవద్దని ఆయన కోరారు. పార్లమెంట్‌లో చర్చ జరిపి ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించి, ప్రజలకు పూర్తిభరోసా కల్పించాల్సిన అవసరం కేంద్రంపై ఉన్నదన్నారు.



రైతులు తమ భూమిని కాపాడుకునేందుకు చేపట్టిన వినూత్న నిరసన ఇది. రాజస్థాన్‌లోని 'జైపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ' అధికారులు నిందార్ గ్రామంలోని భూములను సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. దీనిని నిరసిస్తూ బాధిత రైతులు 'జమీన్ సమాధి సత్యాగ్రహ'న్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా రెండడుగుల లోతు గుంత తవ్వి.. అందులో కూర్చున్నారు. శరీరం సగభాగం వరకు మట్టిని కప్పేసుకున్నారు.

# ఎస్టీపీపీ మరోసారి వందశాతం పీఎల్ఎఫ్

- రెండేండ్లలో మూడోసారి ఘనత
- అభినందించిన సింగరేణి సీఎండీ శ్రీధర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద ఏర్పాటుచేసిన సింగరేణి థర్మల్ విద్యుత్‌కేంద్రం (ఎస్టీపీపీ) మరోసారి ఘనతను సొంతంచేసుకున్నది. ఫిబ్రవరి నెలలో స్టేషన్‌లోని రెండుయూనిట్లు నూరుశాతం పైబడి పీఎల్ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) సాధించాయి. ఈ నెలలో ప్లాంటు 836.70 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయగా.. ప్లాంటుకు అవసరమైన విద్యుత్ పోను మిగిలిన 791.79 మిలియన్ యూనిట్లను గ్రిడ్‌కు సరఫరాచేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 8,398 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేయగా, 7,895 మిలియన్ యూనిట్లను తెలంగాణ రాష్ట్ర అవసరాలకు అందించింది. ఎస్టీపీపీ మరోమారు మెరుగైన పనితీరు కనబర్చడంపై సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ హర్షం వ్యక్తంచేశారు. ఉద్యోగులు, అధికారులు సిబ్బందికి అభినందనలు తెలిపారు. రానున్న కాలంలో కూడా ఇదే ఒరవడిని కొనసాగించాలని సూచించారు.

### వేర్వేరుగా 15సార్లు వందశాతం

ఎస్టీపీపీ రెండేండ్ల కాలంలో మూడుసార్లు వందశాతం పీఎల్ఎఫ్ సాధించింది. ఎస్టీపీపీలో గల రెండుయూనిట్లు వేర్వేరుగా మొత్తం 15సార్లు నూరుశాతం పీఎల్ఎఫ్ సాధించాయి. దీంతోపాటు ఎస్టీపీసీ జాతీయస్థాయిలో అత్యుత్తమ 25 థర్మల్ విద్యుత్‌కేంద్రాల జాబితాలో 2017-18లో ఐదోర్యాంకును సొంతం చేసుకున్నది. ఎస్టీపీపీ ప్రారంభమైన ఏడాది (2016 సెప్టెంబర్) నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 30,921 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయగా.. 29,056 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను రాష్ట్ర అవసరాలకు అందజేసింది.

# సాగర్ ప్రాజెక్టు సీఈగా నర్సింహారావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ (సీఈ)గా నర్సింహారావు సోమవారం పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు సీఈగా ఉన్న నరసింహ ఫిబ్రవరి 29న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో నీటిపారుదలశాఖ ఇంటర్‌స్టేట్ చీఫ్ ఇంజినీర్‌గా ఉన్న నర్సింహారావుకు ఆ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

# రైతుకు బహుముఖ ప్రోత్సాహం

మొదటిపేజీ తరువాయి...

శుభాకాంక్షలు తెలిపారు. సహకార ఎన్నికలను సవాల్‌గా తీసుకొని ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రతి జిల్లా మంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. కేసీఆర్‌కు రైతులంటే ప్రత్యేకమైన ప్రేమ ఉన్నదని చెప్పారు. అనునిత్యం తమను విమర్శించే వర్గాలుసైతం ఈ రోజు సీఎం కేసీఆర్ మానసపుత్రిక కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిఫలాలను అంగీకరిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో పెద్దఎత్తున వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించి వ్యవసాయరంగం కోసం ప్రత్యేక చొరవ తీసుకున్న ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఎంతటి ఖర్చయినా వెనుకాడకుండా రైతు సంక్షేమంకోసం ముందుకెళుతున్నామని.. ఒకవైపు భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపడుతూనే.. వివిధ పథకాలను అమలుచేస్తున్నామని వివరించారు. అందుకే రైతులు టీఆర్ఎస్‌పై అపారమైన ప్రేమతో 906 సంఘాల్లో 94 శాతానికిపైగా గెలిపించి అపూర్వమైన విజయాన్ని అందించారని హర్షం వ్యక్తంచేశారు. కేంద్రప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో దేశవ్యాప్తంగా ఆర్థిక మందగమనం ఉన్నప్పటికీ రైతులకు హామీఇచ్చిన మేరకు రుణమాఫీకి సంబంధించిన ప్రక్రియను త్వరలోనే ప్రారంభించాలని అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీచేశారని కేటీఆర్ తెలిపారు. రైతులకు ఇచ్చినమాట మేరకు ఆర్థిక పరిమితులున్నప్పటికీ కేసీఆర్ దృఢసంకల్పంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.



డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు, వైస్‌చైర్మన్ల సమావేశంలో మాట్లాడుతున్న పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు. చిత్రంలో మంత్రులు సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్, ప్రశాంత్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా ఉన్నారు.

### ఇదీ అసలైన సామాజికన్యాయం అంటే..

ప్రతి ఎన్నికల్లోనూ తెలంగాణ ప్రజలు టీఆర్ఎస్‌కు తిరుగులేని విజయాన్ని అందిస్తూ వస్తున్నారని.. సహకార ఎన్నికల్లోనూ గెలిపించి పార్టీని మరింతగా బలోపేతం చేశారని కేటీఆర్ కొనియాడారు. చైర్మన్, వైస్‌చైర్మన్ పదవుల్లో 45 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాతినిధ్యం కల్పించామని తెలిపారు. ఆదిలాబాద్ నుంచి దళితుడ్ని, మహబూబ్‌నగర్ నుంచి మైనార్టీని, అనేకచోట్ల బీసీలను చైర్మన్లుఎంపిక చేసుకున్నామన్నారు. ఈ ఎన్నికల్లో ఎలాంటి రిజర్వేషన్లు లేకున్నా కేసీఆర్ ప్రత్యేక చొరవతో బలహీన, బడుగువర్గాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఎన్నికలముందు ఎలాంటి హామీ ఇవ్వకున్నా.. ఫలితాల తర్వాత అసలైన సామాజిక న్యాయం అంటే ఏమిటో చూపిస్తున్నారని చెప్పారు. పురపాలక ఎన్నికల్లోనూ నిర్ధారిత రిజర్వేషన్ల కన్న ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు పెద్దపీట వేశారన్నారు. వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను రైతుల్లోకి పెద్దఎత్తున తీసుకెళ్లాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎల్లవేళలా రైతుల మధ్యలో ఉంటూ రైతుల సంఘటితశక్తిని వారి సంక్షేమం కోసం వాడుకునేలా సహకారసంఘాల నేతలు పనిచేయాలని సూచించారు. రైతాంగ సమస్యలపైన ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాలను గట్టిగా తిప్పికొట్టాల్సిన బాధ్యత సహకార సంఘాల నాయకులు తీసుకోవాలన్నారు. సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.







**THE SINGARENI COLLIERIES COMPANY LIMITED**
(A Government Company)
Regd. Office: KOTHAGUDEM - 507101, Telangana.

**EMPLOYMENT NOTIFICATION No: 01/2020. Dt. 01.03.2020**

SCCL is looking for suitable candidates for the following executive posts.

| Name of the post | Total vacancies |
|---|---|
| Management Trainee (F&A) E-2 Grade | 20 |
| Management Trainee (Personnel) (Men only) E-2 Grade | 18 |
| Management Trainee (Legal) E-2 Grade | 04 |

For details i.e., experience, age, qualifications, grade, scale of pay etc., please visit our SCCL Website https://www.scclmines.com "Careers" link available on home page. Please apply ONLINE w.e.f. 04-03-2020 at 12 noon. Contact No. 08744-249992.

PR/2019-20/PER (CRP)/VLM/120 — Chairman & Managing Director

# సాఫ్ట్‌వేర్ కుటుంబం ఆత్మహత్య

- భార్య, ఇద్దరు పిల్లలకు విషమిచ్చి బలవన్మరణం
- వ్యాపారంలో నష్టమే కారణమని సూసైడ్ నోట్
- హైదరాబాద్ హస్తినాపురంలో విషాదం



ఆత్మహత్యకు పాల్పడిన ప్రదీప్‌కుమార్, స్వాతి దంపతులు వారి కుమారులు కల్యాణ కృష్ణ, జయకృష్ణ (ఫైల్)

**మన్సూరాబాద్/నేరెడుగొమ్ము:** వ్యాపారంలో నష్టాలతో మనోధైర్యం కోల్పోయిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దారుణానికి ఒడిగట్టాడు. భార్య, ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తాను ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యాపారంలో నష్టంతోనే బలవన్మరణానికి పాల్పడుతున్నట్టు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. ఈ విషాద ఘటన హైదరాబాద్ హస్తినాపురంలో సోమవారం తెల్లవారుజామున వెలుగుచూసింది. ఎల్బీనగర్ సీఐ అశోక్‌రెడ్డి కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా నేరెడుగొమ్ముకు చెందిన కొత్త యాదయ్య, కలమ్మ దంపతుల కుమారుడైన ప్రదీప్‌కుమార్ (36) వివాహం 2012లో నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లికి చెందిన స్వాతి (28)తో జరిగింది. వీరికి కుమారులు కల్యాణకృష్ణ (6), జయకృష్ణ (ఏడాదిన్నర) ఉన్నారు. ప్రదీప్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాగా, స్వాతి ఎమ్మెస్సీలో గోల్డ్ మెడలిస్ట్. రెండేండ్లపాటు బెంగళూరు టీసీఎస్‌లో పనిచేసి ప్రస్తుతం గచ్చిబౌలిలోని ఐబీఎంలో నెలకు రూ.70 వేల జీతంతో ప్రదీప్ ఉద్యోగం చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తూనే సొంతంగా ఎదిగేందుకు వ్యాపార రంగంలో పెట్టుబడి పెట్టారు. శుక్రవారం తల్లిదండ్రులకు ఫోన్‌చేసి పెండ్లి కోసం కరీంనగర్ వెళ్తున్నట్టు చెప్పారు. శనివారం వారి ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఆదివారం తిరిగి ఫోన్‌చేసినా అందుబాటులోకి రాలేదు. నగరంలోనే ఉంటున్న స్వాతి అన్న సతీశ్‌కుమార్ ఆదివారం అర్ధరాత్రి ఎల్బీనగర్ ఠాణాలో ఫిర్యాదుచేయగా, పోలీసులు తెల్లవారుజామున 3 గంటలకు ప్రదీప్‌కుమార్ ఇంటికి చేరుకొన్నారు.

### వ్యాపారంలో నష్టమంటూ నోట్

'నాన్నా.. మీకు నేను రాసే చివరి సందేశం ఇదే అనుకుంటా. మీకు ఏదేదో చెప్పాలనుకున్న. చెప్పలేక పోతున్న. నన్ను క్షమించు నాన్న. నాకు ఇంతకంటే మార్గం కనిపించలేదు. నీ మంచి చెడులు చూసుకోవాల్సిన నేనే మిమ్మల్ని వదిలి వెళ్లి పోతున్నా. లైఫ్‌లో ఏదో చేయాలని, జాబ్‌పై డిపెండ్ అవ్వొద్దనే ఉద్దేశంతో.. నాకంటూ ఓ కంపెనీ ఉండాలనే ఆలోచన. డబ్బులు సంపాదించి నాకున్న హోంలోన్ అయిపోగొట్టాలి అనే ఆలోచనలతో తొందరపాటు నిర్ణయాలు తీసుకున్న. పర్సనల్ లోన్ తీసుకొని హోంలోన్‌ను ఎల్ఐసీకి మార్చి.. రూ.22 లక్షలు తీసుకొని చాలా పెట్టుబడులు పెట్టి చేతులు కాల్చుకున్న. తిరిగి చూస్తే అప్పు తప్ప ఏమీ కనిపించలేదు. ఒకడు నా ఇంటికి వచ్చి నిలదేసే దాక ఎదురు చూడలేను. ఎంతో ప్రేమతో ఇల్లు కట్టుకున్న. ఇది నాకు అమ్మ ఉంచిపోయిన జ్ఞాపకంగా భావించాను. ఇంతగా అప్పులైన విషయం స్వాతికి కూడా తెలియదు. ఎవరికి చెప్పాలో అర్థం కాదు.. ఎలా తీర్చాలో దారి దొరకడం లేదు' అంటూ సూసైడ్‌నోట్ రాశారు.

### కిటికీ పగులగొట్టి చూడగా..

ప్రదీప్ నివసించే ఇళ్లు కిటికీ అద్దం పగులగొట్టి చూడగా.. హాల్‌లో ప్రదీప్‌కుమార్ నిర్జీవంగా కనిపించారు. స్థానికుల సహకారంతో డోర్‌ను బలవంతంగా తీసి ఇంట్లోకి ప్రవేశించారు. హాల్‌లో ప్రదీప్‌కుమార్, బెడ్‌రూంలో స్వాతి, ఇద్దరు కుమారులు నోటి వెంట నురగలు వచ్చి శవమై కనిపించారు. గుర్తుతెలియని విషాన్ని కలుపుకొని తిని నలుగురూ మృతిచెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

### ఇలా చేస్తాడనుకోలేదు

వ్యాపారంలో పెట్టుబడి రూ.40 లక్షలు నష్టం వచ్చినట్టు కొన్నిరోజుల క్రితం చెప్పాడు. అప్పు తీర్చేందుకు పైసలు ఇస్తానన్నా ఒప్పుకోలేదు. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది. అన్ని విధాలా ఉండి కొడుకు, కోడలు, మనుమండ్లను కోల్పోయాను. ఒక్కగానొక్క కొడుకు ఇలా చేస్తాడనుకోలేదు.

– యాదయ్య, ప్రదీప్‌కుమార్ తండ్రి

మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. ప్రదీప్.. భార్య, పిల్లలకు శనివారం మధ్యాహ్నం విషమిచ్చి చంపి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానిక నాగార్జున స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న కల్యాణకృష్ణను శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంట్లోకి తీసుకెళ్తుండగా పరిచయస్తుడైన ఆటోడ్రైవర్ నర్సింహ కొద్దిసేపు ముచ్చటించారు. అర్జంట్ అంటూ ప్రదీప్ ఇంట్లోకి వెళ్లినట్టు నర్సింహ చెప్పారు. ఆ వెంటనే ఓ స్నేహితుడు ఫోన్ చేయగా గాభరాగా కనిపించినట్టు దర్యాప్తులో తేలింది. మొదట భార్య, పిల్లలకు విషమిచ్చి.. వారు చనిపోయిన పది గంటల తర్వాత ప్రదీప్ విషం తాగినట్టు ప్రాథమిక పోస్టుమార్టం రిపోర్ట్‌లో తేలినట్టు సమాచారం.

### ఆస్తులు ఉన్నా..

ప్రదీప్ తన సూసైడ్ నోట్‌లో రాసిన విధంగా ఆయనకు రూ.22 లక్షల అప్పు ఉన్నది. నెలకు రూ.70 వేల జీతంతోపాటు ఇంటి అద్దెలు రూ.20 వేల వరకు వస్తుంటాయి. ప్రస్తుతం తానుంటున్న ఇల్లు విలువ సుమారు రూ.2 కోట్లు ఉంటుంది. పక్కనే ఉండే వెంకటేశ్వరకాలనీలో ప్రదీప్‌కు 200 గజాల స్థలం ఉన్నది. అతడి తండ్రికి ఊరిలో పదెకరాల భూమితోపాటు ఓ రైస్‌మిల్లులో వాటాలు ఉన్నట్టు బంధువులు తెలిపారు.





ఐదు రూపాయలకే మధ్యాహ్న భోజనం అందించే అన్నపూర్ణ పథకం ప్రారంభించి సోమవారానికి ఆరేండ్లయింది. ఈ సందర్భంగా దివ్యాంగులు, వయోవృద్ధులు, క్యాంటిన్ల వద్దకు రాలేనివారి కోసం మొబైల్ క్యాంటిన్ పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, సీఎస్ సోమేశ్‌కుమార్, మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, హరేకృష్ణ ఫౌండేషన్ అధ్యక్షుడు సత్య గౌరచంద్రదాస పాల్గొన్నారు. - హైదరాబాద్, నమస్తే తెలంగాణ

## కేంద్ర మంత్రి గడ్కరీతో మంత్రి కొప్పుల భేటీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి సంబంధించి కేంద్ర రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఢిల్లీలో తెలంగాణ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేకంగా కలిశారు. సోమవార ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ఆయన ఎంపీ నామా నాగేశ్వర్‌రావుతో పాటు కేంద్ర మంత్రిని కలిశారు. జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో 15 రహదారులు, నేషనల్ హైవేల నిర్మాణం, ఎన్‌హెచ్-63 నిజామాబాద్, జగ్దల్‌పూర్ 121/800 నుంచి 128/200 వరకు ధర్మపురి నియోజకవర్గంలో (7 కిలోమీటర్ల) ఫోర్‌లైన్ మంజూరుచేయాలని కేంద్ర మంత్రికి కొప్పుల ఈశ్వర్ వినతి పత్రం సమర్పించారు.



సోమవారం ఉస్మానియా యూనివర్సిటీలో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెన్నా మధుసూదన్‌ను సన్మానిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సలహాదారు కేవీ రమణాచారి, ఎమ్మెల్సీ ఎన్ రాంచందర్‌రావు తదితరులు





ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై మీడియాకు వెల్లడిస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

## రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం
- మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లుపూర్తి చేశామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని అన్నారు. సోమవారం నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు ప్రధాన కార్యాలయంలో పరీక్షల ఏర్పాట్లపై విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్, ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్‌తో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు. మొత్తం 9.65 లక్షల (ఫస్టియర్ 4,80,531, సెకండ్ ఇయర్ 4,85,345) మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మొత్తం 1,339 పరీక్ష కేంద్రాల్లో 26,964 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఇంటర్ పరీక్షల్లో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను నిషేధించారు. ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు నేరుగా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్ష కేంద్రాలను తెలుసుకోవడానికి సెంటర్ లొకేటర్ యాప్‌ను రూపొందించారు. విద్యార్థులు ఎలాంటి అనుమానా లు ఉన్నా bigrs.telangana.gov.in ద్వా రా ఫిర్యాదు చేసుకోవడా నికి వెసులుబాటు కల్పించారు. ఈ క్రమంలో ప్రతి సమస్యను 24 గంటల్లోనే పరిష్కరిస్తారు.

# దురాక్రమణల లెక్కపక్కా

## 'రేవంత్ భూదందా'పై కలెక్టర్‌కు ఆర్డీవో నివేదిక

- 5.21 ఎకరాలు బోనావెకెన్షియా పరిధిలో చేర్చాలని సిఫారసు
- అసలు పట్టాదారు ఇంటిపేరు 'వడ్డె'.. మధ్యలో చేరిన 'దబ్బా' 'ఎర్రగండ్ల'

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

ప్రభుత్వ భూముల కబ్జా, నీటివనరుల విధ్వంసానికి పాల్పడిన కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి అక్రమాలపై దర్యాప్తులో ప్రభుత్వం వేగం పెంచింది. రేవంత్‌రెడ్డి అండ్ కో సాగించిన భూదందాపై రెవెన్యూ అధికారులు నిజానిజాలను వెలుగులోకి తీసుకొస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలోని సర్వేనం. 127, 128, 34, 35,160లపై రాజేంద్రనగర్ ఆర్డీవో కే చంద్రకళ.. రంగారెడ్డి కలెక్టర్ అమయ్‌కుమార్‌కు సోమవారం నివేదిక సమర్పించినట్టు తెలిసింది. కోమటికుంట చెరువు కబ్జాను నియంత్రించకుండా ఉదాసీనంగా వ్యవహరించిన శేరిలింగంపల్లి తాసిల్దార్ వంశీమోహన్‌కు షోకాజ్ నోటీసులు జారీచేసినట్టు సమాచారం. విశ్వసనీయంగా తెలిసిన ప్రకారం ఆర్డీవో నివేదికలోని అంశాలు ఇలా ఉన్నాయి.

**పత్రాలు లేకుండానే మారిన ఇంటిపేర్లు**

గోపన్‌పల్లిలోని సర్వేనంబర్ 127లో 10.27 ఎకరాలు 1954-55 ఖాస్రా పహణీలో వడ్డె హనుమ పేరిట ఉన్నది. 1960-61లో పట్టాదారుడిగా వడ్డె హనుమయ్య.. సాగుదారుగా వడ్డె లక్ష్మయ్యగా పేర్కొన్నారు. 1964 నుంచి 68 వరకు పట్టాదారు, సాగు కాలంలో వడ్డె లక్ష్మయ్య తండ్రి హనుమయ్యగా నమోదయింది. 1969-70, 1972-73, 1974-75లో వడ్డె మల్లమ్మ తండ్రి లక్ష్మ య్య పేరు.. 1975-76, 1976-77 పహణీల్లో వడ్డె మల్లయ్య తండ్రి లక్ష్మయ్య తదితరుల పేరిట రాశారు. 'కాస్తు కాలమ్'లో మాత్రం టీ లీల, వెంకటరామయ్య పేరిట రెండెకరాలు, సూర్యనారాయణ పేరిట ఎకరం ఉన్నది. మిగిలిన ఐదెకరాల్లో మాత్రం కాస్తు కాలమ్‌లోనూ వడ్డె మల్లయ్య తదితరుల పేర్లే ఉన్నాయి. 1979-80 నుంచి 1988-89 వరకు మల్లయ్య తదితరుల పేరిట మొత్తం 10.21 ఎకరాలు రికార్డు చేశారు. 1989-90 నుంచి 1990-91 వరకు మల్లయ్య, మాద సుందరేషు పేరిట రికార్డు చేశారు. కానీ కాస్తుకాలమ్‌లో ఏ వెంకట్రావు 1.10 ఎకరాలు, రవి, మైసయ్యల పేరిట రెండెకరాలు, శ్రీరామ జయసింహ పేరిట రెండెకరాలుగా పేర్కొన్నారు. 1990-91లో అలీ సలాంబిన్ మహమూద్ పేరిట 1.24 ఎకరాలు, రవి, మైసయ్యల పేరిట రెండెఎకరాలు అనుభవిస్తున్నట్టు ఉన్నది. 1976-77 వరకు హనుమయ్య, లక్ష్మయ్య, మల్లయ్యల ఇంటిపేరు వడ్డె అని ఉండగా.. 1979-80 నుంచి 1990-91 వరకు మల్లయ్యకు సంబంధించిన పహాణీల్లో ఇంటిపేరు లేదు. 1993-94 నుంచి ఇంటిపేరు దబ్బా (dabba)గా వచ్చింది. దబ్బా మల్లయ్యకు తోడు కో పార్టనర్‌గా ఏ వెంకటరావు, సలాంబిన్ మహాఫూజ్, సుందరేష్ మాదిల పేర్లు చేరాయి. అవికూడా 1993-94 నుంచి 1997-98 వరకు వచ్చాయి. 1998-99 నుంచి 1999-2000 లో దబ్బ మల్లయ్యకు కో పార్టనర్‌గా ఆర్ కళావతిబాయి పేరు చేరింది. ఏ వెంకట్రావు, అలీసలాంబిన్‌ల పేర్లను ఎలాంటి ఆధారాలు చూపించకుండానే రౌండప్ చేశారు. 2001-2002, 2002-03, 2003-04లో అలీసలాంబిన్, ఏ వెంకట్రావు, ఏ వెంగేశ్వర్‌రావు, ఆర్ కళావతి, శ్రీరామ జయసింహ పేరిట 10.21 ఎకరాలు చూపారు. అదికూడా పట్టాదారు, కాస్తు కాలమ్‌లో నమోదుచేశారు. 2004-05 నుంచి 2012-13 పహణీల్లో ఏ రేవంత్ రెడ్డి, అలీసలీంబిన్, వెంకట్రావు, వెంగేశ్వర్ రావు, ఆర్ కళావతి, శ్రీరామజయసింహల పేరిట 10.21 ఎకరాలు నమోదైంది.

- వడ్డె హనుమయ్య డాక్యుమెంట్ 161/1968 ప్రకారం టీ లీల తండ్రి సత్యనారాయణరావుకు రెండెకరాలు, 162/1968 ప్రకారం కే వెంకట్రామయ్య తండ్రి పుల్లయ్యకు రెండెకరాలు, 163/1968 ప్రకారం సత్యనారాయణ తండ్రి దక్షిణమూర్తికి ఎకరం వంతున విక్రయించారు.
- కానీ,1979-80 పహాణీలను మార్చి వడ్డెగా ఇంటిపేరు మాయమైంది. అంటే అక్కడి పట్టాదారులకు వారసులెవరూ లేరు. దాంతో దబ్బా మల్లయ్య పేరు చేర్చారు.
- దబ్బా మల్లయ్య, రామయ్య, ఎల్లయ్య, ఆంజనేయులు, కిష్టయ్యల నుంచి డాక్యుమెంట్ నం.2577/1988 ప్రకారం శ్యాంలెట్ మైసయ్య తండ్రి రామయ్య 10.20 ఎకరాలకు జీపీఏ తీసుకున్నారు. డాక్యుమెంట్ నం.10844/1989 ప్రకారం ఎన్ రవి తండ్రి చంద్రయ్య, ఎస్ మైసయ్య తండ్రి రామయ్యలు 2 ఎకరాలు కొనుగోలు చేశారు. ఇక అక్కడి నుంచి 22 సేల్‌డీడ్ల ద్వారా పలువురికి భూమిని విక్రయించారు. అందులో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులు కూడా ఉన్నారు.
- అంతకుముందే లీల, వెంకట్రామయ్య, సూర్యనారాయణలకు వడ్డె కుటుంబం ఐదెకరాలు విక్రయించింది. కానీ దబ్బా మలయ్య, అతని కుటుంబసభ్యులు జీపీఏ డాక్యుమెంట్ నంబర్ 2577/1988 ద్వారా శ్యాంలెట్ మైసయ్యకు 10.20 ఎకరాలు అప్పగించారు. మరో 1.15 ఎకరాలను వెంగేశ్వర్‌రావుకు బదిలీచేశారు. ఆ తర్వాత దబ్బా మల్లయ్య డాక్యుమెంట్ నంబర్ 44/2005 ప్రకారం జీపీఏను క్యాన్సిల్ చేసుకున్నారు.
- ఎర్రగండ్ల కుటుంబం చాలా డాక్యుమెంట్లు చేశారు. అయితే, రికార్డులు, డాక్యుమెంట్లల్లో ఆ కుటుంబం లేదు. వారినుంచి అమ్మకాలు, కొనుగోళ్లు కూడా చెల్లవని తేలింది.
- రెవెన్యూ రికార్డులు, చట్టం ప్రకారం వడ్డె కుటుంబం నుంచి కొనుగోళ్ల వరకు మాత్రమే చెల్లుబాటు కానున్నాయి. ఆ తర్వాత దబ్బా, ఎర్రగండ్ల ఇంటిపేరు కలిగిన వ్యక్తులు అమ్మిన, కొన్న డాక్యుమెంట్లు చెల్లవని నివేదికలో స్పష్టంచేసినట్టు తెలిసింది.

### క్షేత్రస్థాయి పరిశీలన

- సర్వేనంబర్ 127లో 12.02 ఎకరాలకు ప్రహరీ నిర్మించి, గేట్లు ఏర్పాటుచేశారు. ఇందులో సర్వే నంబర్ 34లోని ప్రభుత్వ భూమి 1.21 ఎకరాలు కబ్జా చేశారు. బండ్లబాట కింద 10 గుంటలు కనుమరుగయింది.
- కోమటికుంటలో ఎఫ్‌టీఎల్ 32 గుంటలు, బఫర్ జోన్ కిందకు 22 గుంటలుగా తేలింది.
- వాల్టా చట్టం, ఏపీ(టీఏ) ల్యాండ్ రెవెన్యూ యాక్ట్, 1317 ఫస్లీ సెక్షన్ 24ను ఉల్లంఘించారు.
- స్థానిక విచారణ ప్రకారం నిర్మాణాలను ఏ రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులు కొండల్‌రెడ్డి, కృష్ణారెడ్డిగా తేలింది.
- సర్వే నంబర్ 127లో 5.21 ఎకరాలకు వారసులు లేరు. లేదా హక్కుదారులు లేరు. దాంతో బోనావెకెన్షియా చట్టం 1974 పరిధిలోకి వస్తుంది. అడ్వకేట్ జనరల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ లీగల్ ఒపీనియన్ ప్రకారం చర్యలు చేపట్టనున్నారు.

## రేవంత్ హైడ్రామా

- రంగారెడ్డి జిల్లా జన్వాడలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- సొంత పూచీకత్తుపై విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/రామచంద్రాపురం:** చేసిన తప్పునకు జవాబు చెప్పడం తెలియకపోతే ఏంచేయాలి.. ఎదురుదాడి చేయాలి.. తన అక్రమాల బండారం బట్టబయలైతే ఏంచేయాలి.. ఎదుటివారిపై బురద చల్లాలి.. తన అవినీతి లోగుట్టు బయటపడవద్దంటే ఏంచేయాలి.. అక్కరలేని డ్రామాలు ఆడాలి.. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ రేవంత్‌రెడ్డి ఇప్పుడు అదే కోవలో కొన్నిరోజులుగా తనపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పలేక మల్లగుల్లాలు పడుతూ సరికొత్త డ్రామాకు తెరలేపారు. ప్రభుత్వంలోని పెద్దలు అక్రమాలు చేశారని, వాటిని బయటపెడతానని సోమవారం రేవంత్‌రెడ్డి మీడియాకు కొత్తకథ చెప్పారు. అన్నింటికీ ఆధారాలు చూపిస్తానన్న సదరు ఎంపీ.. ఆధారాలు చూపకుండా రంగారెడ్డి జిల్లాలోని జన్వాడకు తీసుకెళ్లారు. మీడియా ప్రతినిధులను ఓ కారులో ఎక్కించి.. ఆయన మరోదారిలో జన్వాడకు వెళ్లారు. జన్వాడకు వెళ్తున్న రేవంత్ అనుచరులను పోలీసులు ఖానాపూర్ వద్ద నిలిపివేశారు. మరోమార్గంలో జన్వాడకు వెళ్లిన రేవంత్‌రెడ్డి.. అక్రమాలంటూ అక్కడ షోకు యత్నించారు. దీంతో ముందు జాగ్రత్త చర్యగా ఆర్సీపురం పోలీసులు ఆయనను స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకొన్న ఆయన అనుచరులు ఠాణాకు చేరుకొన్నారు. అనంతరం రేవంత్‌ను పోలీసులు సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. వాస్తవంగా ప్రభుత్వ పెద్దలు అక్రమాలకు పాల్పడి ఉంటే.. అందుకు ఆధారాలు తన వద్ద ఉంటే.. వాటిని హైదరాబాద్‌లోనే మీడియాకు చూపించవచ్చు. కానీ మీడియా సమావేశం నిర్వహిస్తే గోపన్‌పల్లిలో తానుచేసిన భూ అక్రమాలను ప్రశ్నిస్తారని సరికొత్త నాటకానికి తెరతీశారు.

## యాసంగి అంచనా 77 లక్షల టన్నులు

- కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లుచేయాలి
- మంత్రివర్గ ఉపసంఘం సమీక్షలో అధికారులకు ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే యాసంగి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ ఏర్పాట్లుచేయాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. యాసంగిలో 77.73లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం రాగలదని అంచనావేస్తున్నట్టు తెలిపింది. యాసంగి కార్యాచరణపై సోమవారంనాడు హాకాభవన్‌లో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు వ్యవసాయమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్, ఆ సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. గత ఏడాది యాసంగిలో 37లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని కొనుగోలుచేయగా, ఈ ఏడాది అంతకు రెండింతలు దాటవచ్చని అంచనావేశారు. ఆ మేరకు కొనుగోళ్లకు ఏర్పాట్లుచేయాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గన్నీ సంచులు, స్టోరేజీ స్పేస్, రవాణా తదితర అంశాలపై ప్రధానంగా దృష్టిసారించాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, ఉద్యాన శాఖ డైరెక్టర్ వెంకట్రామరెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కేశవులు, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, మార్క్‌ఫెడ్ ఎండీ భాస్కరాచారి ఇతర అధికారులు పాల్గొన్నారు.



హాకాభవన్‌లో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు ఈటల, గంగుల ఉన్నారు

## గిరిజన సంక్షేమానికి ప్రత్యేక నిధులు

- మంత్రి సత్యవతి రాథోడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కేటాయిస్తున్న ప్రత్యేక అభివృద్ధి నిధులు సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆదేశించారు. సోమవారం సంక్షేమభవన్‌లో 33వ నోడల్ ఏజెన్సీలతో సమావేశమైన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం సీఎం కేసీఆర్ గిరిజనులకు కేటాయించే నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు పెట్టడంపై అందరూ కలిసి పనిచేయాలని కోరారు. సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి క్రిస్టినాఝడ్ చోంగ్తూ, ఆర్థికశాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి, అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చట్టంలోని సెక్షన్‌పై పిటిషన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్ - 2019 సెక్షన్ 178 (2).. రాజ్యాంగబద్ధతను సవాల్‌చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై సోమవారం చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం కౌంటర్ దాఖలుచేయాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 11కు వాయిదా వేసింది.

## అర్జున్‌రెడ్డి డైరెక్టర్‌నంటూ ఫోన్లు

- అవకాశం కల్పిస్తానంటూ ఓ హీరోయిన్‌కు ఆఫర్

**ఖైరతాబాద్:** అర్జున్‌రెడ్డి సినిమా డైరెక్టర్ పేరు వాడుకొని ఓ హీరోయిన్‌కు ఆఫర్ ఇచ్చిన వ్యక్తిపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. 'రాహు' చిత్రం హీరోయిన్ క్రితిగార్గ్‌కు గత నెల 28న ఓ అజ్ఞాతవ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. తాను అర్జున్‌రెడ్డి సినిమా దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అని పరిచయం చేసుకొన్న సదరు వ్యక్తి.. త్వరలో నిర్మిస్తున్న 'ది గర్ల్స్ లవ్' చిత్రంలో హీరోయిన్‌గా అవకాశం విషయాన్ని 'రాహు' చిత్ర దర్శకుడు వేల్పుల సుబ్బారావుకు తెలుపగా ఆయన దర్శకుడు సందీప్‌రెడ్డి వద్ద ఆరాతీశాడు. తాను ఎలాంటి మెయిల్ గానీ, ఫోన్‌గానీ చేయలేదని సందీప్‌రెడ్డి స్పష్టంచేశారు. దాంతో నకిలీ వ్యక్తిగా గుర్తించిన సదరు యువతి.. పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# రేవంత్.. తప్పు ఒప్పుకో

- ఇప్పటికైనా క్షమాపణలు చెప్ప
- ప్రభుత్వ విప్ బాల్కసుమన్ డిమాండ్
- ప్రజల దృష్టిని మరల్చడానికే ఆరోపణలంటూ ఆగ్రహం
- ఫాంహౌస్‌ను నాలుగేండ్ల క్రితం కేటీఆర్ లీజుకుతీసుకున్నారని వెల్లడి
- భూములను ఎన్నికల ఆఫిడవిట్‌లోనే చూపారని స్పష్టత



సోమవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్కసుమన్. చిత్రంలో ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, ఎం శ్రీనివాస్‌రెడ్డి, శంభీపూర్ రాజు, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎంపీ రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా ఆయన భూదందా తప్పును ఒప్పుకొని క్షమాపణ చెప్పాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ డిమాండ్‌చేశారు. బ్లాక్ మెయిలింగ్‌కు రేవంత్ బ్రాండ్ అంబాసిడర్ అని, తన తప్పులను కప్పిపుచ్చుకొనేందుకు, ప్రజల దృష్టిని మరల్చడానికి మంత్రి కేటీఆర్‌పై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమకారులైన కేసీఆర్, కేటీఆర్ నాయకుల జోలికి వస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కేటీఆర్ సతీమణి పేరిట ఉన్నదంటున్న భూమిని ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారని, ఫాంహౌస్‌ను నాలుగేండ్ల క్రితం లీజుకు తీసుకొన్నారని తెలిపారు. సోమవారం తెలంగాణభవన్‌లో ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, ఎం శ్రీనివాస్‌రెడ్డి, శంబీపూర్ రాజు, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావుతో కలిసి బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ బట్టకాల్చి మీద వేస్తున్నారని ఆగ్రహించారు. పేదలకు అండగా ఉండాల్సిన ప్రజాప్రతినిధి కబ్జాకోరుగా మారారన్నారు. రేవంత్‌ది నీచపు బుద్ధి, చీకటి బతుకు అని దుయ్యబట్టారు. కేసీఆర్, కేటీఆర్ నిఖార్సయిన తెలంగాణ ఉద్యమకారులని, రేవంత్‌లా తమకు దొంగబుద్ధులు లేవని చెప్పారు. ఎన్నికల ఆఫిడవిట్‌లో చూపించిన భూమికి ఫాంహౌస్‌కు సంబంధంలేదని స్పష్టంచేశారు. నాలుగేండ్ల క్రితం భూమిని ఆనుకొని ఉన్న ఫాంహౌస్‌ను లీజుకు తీసుకున్నారని వివరించారు. ఆ ప్రాంతంలో ఎవరిని అడిగినా కేటీఆర్ ఫాంహౌస్ అని చెప్తారన్నారు. అక్కడ పలుమార్లు పార్టీ ముఖ్యనాయకులతో కూడా సమావేశాలు నిర్వహించారని, కేటీఆర్ కుటుంబసభ్యులు కూడా అక్కడికి వెళ్తారని తెలిపారు. 111 జీవోను అతిక్రమించారనడం తప్పుడు ఆరోపణ అని పేర్కొన్నారు. రేవంత్ చెప్తున్న 8.09 ఎకరాల భూమిని 2014, 2018 ఎన్నికల అఫిడవిట్‌లోనే కేటీఆర్ చూపించారని గుర్తుచేశారు. రేవంత్ చూపిన స్థలం కేటీఆర్ సతీమణి పేరిట ఉన్న భూమికి 8 కిలోమీటర్ల దూరంలో ఉంటుందన్నారు. ఎదుటివారిపై బురద జల్లుకుంటూ బతకడమే రేవంత్ పని అని ధ్వజమెత్తారు.

**అక్రమాల పుట్ట పగిలింది..**

రేవంత్ అక్రమాల పుట్ట పగిలిందని బాల్క సుమన్ అన్నారు. దొంగే దొంగ అన్నట్టుగా ఆయన వ్యవహరిస్తున్నారని, వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి, దళితుల భూములను కాజేశారని ఆరోపించారు. ఇటువంటి దొంగలను ప్రజలు కనిపెట్టుకుంటూ ఉండాలని కోరారు. రేవంత్‌రెడ్డి గోపన్‌పల్లిలో అమాయకులను బెదిరించి లాక్కున్న భూముల విషయంలో వాస్తవాలు మాట్లాడాలని డిమాండ్‌చేశారు. చెరువులు, ప్రభుత్వ, దళితుల భూములను కబ్జాచేశారని, వీటిపై మాట్లాడకుండా, మిగతా అన్ని విషయాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆయన ఆరోపణల్లో రవ్వంత కూడా వాస్తవంలేదన్నారు. సమైక్యాంధ్ర నాయకుల బూట్లు నాకిన చరిత్ర రేవంత్‌దని దుయ్యబట్టారు. కొడంగల్‌లో పట్నం నరేందర్‌రెడ్డి గెలుపును రేవంత్ మరిచిపోలేకపోతున్నారని, అందుకే పట్నం గోస కార్యక్రమాన్ని పెట్టుకొన్నారని చురకలంటించారు.

## ప్రతి ఎకరాకూ కాళేశ్వరం జలాలు

- ఎస్సారెస్పీ రెండోదశ పనులపై సమీక్షలో మంత్రి జగదీశ్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు జల సంకల్పంలో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎస్సారెస్పీ ఆయకట్టులోని చివరిభూమి వరకు పుష్కలంగా సాగునీరు అందించామని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి చెప్పారు. సీఎం కృషివల్లనే సూర్యాపేటకు గోదావరిజలాలు అందాయని తెలిపారు. ఎస్సారెస్పీ రెండోదశ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు 69-71 కింద జరుగుతున్న మరమ్మతుపనులపై మంత్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో తుంగతుర్తి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్, నీటిపారుదల శాఖ ఈఎన్సీ నాగేంద్రరావు, ఎస్‌ఈ సుధీర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాల్వల మరమ్మతులు త్వరితగతిన పూర్తిచేసి వర్షాకాలంలో విడుదలచేసే గోదావరిజలాలు చివరిదాకా పోతాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరిజలాలను అందించడంతో సూర్యాపేట జిల్లాలో సాగువిస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. ఇందుకు సూర్యాపేట జిల్లా ప్రజలు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారన్నారు. సమీక్ష అనంతరం మంత్రి మాట్లాడుతూ కాళేశ్వరం జలాలు సూర్యాపేటకొస్తే సన్యాసం తీసుకుంటానని ఒక ప్రతిపక్ష నాయకుడుఅన్నారని గుర్తుచేశారు. డిమాండుకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పారు.



సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే కిశోర్

# దుబాయ్ ప్రయాణికుడికి కరోనా

మొదటిపేజీ తరువాయి...

పేర్కొన్నారు. ఆ యవకుడికి జ్వరం రావడంతో తొలుత అపోలో దవాఖానలో వైద్య సేవలు పొందారని తెలిపారు. ఎంతకూ జ్వరం తగ్గకపోవడంతో ఆదివారం సాయంత్రం గాంధీ దవాఖానకు వచ్చారని చెప్పారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో కరోనా లక్షణాలు కనిపించాయన్నారు. ఆయన రక్త నమూనాలను పుణెకు పంపగా, కేంద్ర ఆరోగ్య విభాగం కరోనా వ్యాధి ఉన్నట్టు తేల్చిందని తెలిపారు. దీంతో సీఎం కేసీఆర్ ఆదేశాలమేరకు కరోనాను ఎదుర్కొనేందుకు అప్రమత్తమయ్యామని ఈటల చెప్పారు. గాంధీ, ఫీవర్, చెస్ట్ దవాఖానల్లో 40 బెడ్ల సామర్థ్యంతో ఇదివరకే ఐసొలేషన్ వార్డులను అందుబాటులో ఉంచామని చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయిన సదరు యువకుడిని గాంధీలోని ఐసొలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నామని తెలిపారు.

**80 మందిని ట్రాక్‌లోకి..**

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి కరోనా నిర్ధారణ అయిన నేపథ్యంలో ఆయనతో గడిపిన వారందరిని ట్రాకింగ్ చేస్తున్నామని మంత్రి రాజేందర్ చెప్పారు. ఆయన తిరిగిన ప్రదేశాలు, కుటుంబసభ్యులు, వైద్యసేవలందించిన అపోలో దవాఖాన సిబ్బంది, బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు వచ్చిన తోటి ప్రయాణికులు మొత్తం 80 మందిని గుర్తించామని మంత్రి తెలిపారు. అయితే వారందరికీ వైరస్ ఉన్నట్టు కాదని, ముందుజాగ్రత్త చర్యగా వారికి వైద్య పరీక్షలు చేయిస్తామని చెప్పారు. కరోనా వైరస్ కారణంగా దేశంలో ఎవరూ చనిపోలేదని, ఆ వ్యాధి లక్షణాలు ఉంటే తక్షణం దవాఖానల్లో సంప్రదించాలని మంత్రి కోరారు.

**వ్యక్తిగత పరిశుభ్రతతో**

వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా కరోనా వైరస్ బారి నుంచి తమను తాము కాపాడుకోవచ్చని మంత్రి రాజేందర్ పేర్కొన్నారు. ఈ వైరస్ స్పర్శ, గాలివల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని, ముందుజాగ్రత్తలు పాటించాలని సూచించారు. జలుబు, దగ్గు, జ్వరం వంటివి ఉన్నవారు జన సమూహాలు ఉండే ప్రదేశాల్లో తిరుగొద్దని చెప్పారు. తెలంగాణలో ఉన్న వాతావరణ పరిస్థితుల్లో ఈ వ్యాధి విస్తరించే అవకాశం లేదని చెప్పారు. ఇక్కడ 33 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవుతుందని, ఈ కారణంగా కరోనా వైరస్ వ్యాప్తి చెందదని ఈటల వెల్లడించారు.

**అధికారులతో అత్యవసర భేటీ**

రాష్ట్రంలో కరోనా కేసు నమోదైన నేపథ్యంలో మంత్రి ఈటల రాజేందర్ సోమవారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కొవిడ్ వైరస్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో దగ్గడం, తుమ్మడం వంటివి చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకుగాను కరపత్రాలు ముద్రించి పంచాలని నిర్ణయించారు. కొత్తగా వంద పడకల సామర్థ్యంతో మిలిటరీ దవాఖానలో ఐసోలేషన్ వార్డును అందుబాటులోకి తీసుకురావాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. కరోనాపై అన్ని యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది.

**గాంధీలో ప్రత్యేక వైద్య బృందం**

కరోనా వ్యాధిగ్రస్తులకు చికిత్సనందించేందుకు గాంధీ దవాఖానలో అన్ని ఏర్పాట్లు చేశామని సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్‌కుమార్ తెలిపారు. అనుమానితులను ఉంచేందుకు మొత్తం 40పడకలు, 10వెంటిలేటర్లతో కూడిన ఐసొలేషన్ వార్డులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయిన వారి కోసం 10 పడకలతో కూడిన ఐసీయూ వార్డును ఏర్పాటు చేశామని తెలిపారు. వారికి చికిత్స అందించేందుకు కేంద్రం నుంచి ఐదుగురు వైద్యుల బృందం, గాంధీకి చెందిన మరో ఐదుగురు నిపుణులతో ప్రత్యేక వైద్య బృందాన్ని సిద్ధంగా ఉంచినట్టు చెప్పారు.

## టెస్కాబ్, మార్క్‌ఫెడ్ ఎన్నికలకు నోటిఫికేషన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్), తెలంగాణ రాష్ట్ర సహకార మార్కెటింగ్ ఫెడరేషన్ (మార్క్‌ఫెడ్) మేనేజింగ్ కమిటీ ఎన్నికల కోసం సోమవారం రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల ఐదున టెస్కాబ్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక, 10న మార్క్‌ఫెడ్ డైరెక్టర్ల ఎన్నిక, మరుసటిరోజు మార్క్‌ఫెడ్ చైర్మన్, వైస్‌చైర్మన్ కోసం ఎన్నికలు నిర్వహిస్తారు. ఐదో తేదీ ఉదయం వేళ టెస్కాబ్ చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులకు నామినేషన్లను స్వీకరించి, 11:30 నుంచి నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ చేపడుతారు. అవసరమైతే అదేరోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. టెస్కాబ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఉండే డీసీసీబీ చైర్మన్లు.. టెస్కాబ్ చైర్మన్, వైస్‌చైర్మన్‌ను ఎన్నుకొంటారు. మార్క్‌ఫెడ్ ఎన్నికలకు ఈ నెల 4న నోటిఫికేషన్ ఇచ్చి ఏడున డైరెక్టర్ పదవులకు నామినేషన్లు స్వీకరిస్తారు. 10న ఉదయం 8 నుంచి ఒంటిగంట వరకు పోలింగ్, అనంతరం ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తారు. 11న మార్క్‌ఫెడ్ చైర్మన్, వైస్‌చైర్మన్‌ను ఎన్నుకొంటారు.

# ఏడాదిలో మూడోసారి ఎన్నికలు!

ఇజ్రాయెల్‌లో విచిత్ర పరిస్థితి

**జెరూసలేం:** ఇజ్రాయెల్ ప్రజలకు ఎన్నికలంటేనే విసుగెత్తే పరిస్థితి నెలకొన్నది. ఏడాదిలోపునే మూడోసారి అక్కడ పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుపై కొనసాగుతున్న ప్రతిష్ఠంభనను తొలగించేందుకు సోమవారం మరోసారి ఎన్నికలు జరిగాయి. ఏప్రిల్ 9, సెప్టెంబర్ 17న జరిగిన గత రెండు ఎన్నికల్లో ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ సారథ్యంలోని లికుడ్‌పార్టీకి గానీ, బెన్నీ గాంట్జ్ నేతృత్వంలోని బ్లూ అండ్ వైట్ కూటమికి గానీ స్పష్టమైన మెజార్టీ దక్కలేదు. మూడోసారి జరుగుతున్న ఈ ఎన్నికల్లోనూ అదే ఫలితం పునరావృతమయ్యే అవకాశం ఉన్నది. సాయంత్రం 4 గంటల సమయానికి 47 % పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం తెలిపింది. 1999 తర్వాత ఈ స్థాయి పోలింగ్ నమోదుకావడం ఇదే తొలిసారి. నాటి ఎన్నికల్లో నెతన్యాహూ.. ఎహుద్ బరాక్ చేతిలో పరాజయం పాలవడం గమనార్హం. కాగా, మంగళవారం ఉదయానికి ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.



హైఫాలో కరోనా బాధితులకు ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం

## ఉద్యోగం పోయి.. విచక్షణ కోల్పోయి..

**మనీలా:** ఓ సెక్యూరిటీ గార్డు తన ఉద్యోగం పోవడంతో విచక్షణ కోల్పోయాడు. తుపాకీతో ఒక షాపింగ్ మాల్‌లోకి చొరబడి కాల్పులు జరిపాడు. దీంతో ఒకరికి గాయాలయ్యాయి. ఆ తర్వాత మాల్‌లోని 30 మందిని నిర్బంధించాడు. ఈ ఘటన ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో సోమవారం జరిగింది. పోలీసులు భారీగా చేరుకుని షాపింగ్ మాల్ చుట్టూ మోహరించారు. ఆ సెక్యూరిటీ గార్డును శాంతింపజేసేందుకు గంటల తరబడి వాకీటాకీల ద్వారా సంప్రదింపులు జరిపారు. చివరకు.. మీడియాతో మాట్లాడేందుకు అనుమతించాలంటూ అతడు పోలీసులకు షరతు విధించాడు. ముందుగా ఒప్పుకుంటామని చెప్పిన పోలీసులు.. అతడు బయటకు రాగానే అదుపులోకి తీసుకున్నారు. తనను వేధించి, ఉద్యోగం నుంచి తొలగించిన యాజమాన్యం క్షమాపణ చెప్పాలని కోరాడు.

## సోషల్ మీడియాకు మోదీ వీడ్కోలు?



**న్యూఢిల్లీ:** సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే ప్రధాని నరేంద్ర మోదీ.. అన్ని సామాజిక మాధ్యమాల నుంచి వైదొలుగాలని యోచిస్తున్నట్లు సోమవారం అనూహ్య ప్రకటన చేశారు. 'ఈ ఆదివారం.. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ ఖాతాలకు వీడ్కోలు చెప్పాలని భావిస్తున్నా. దీనిపై మీకు తెలియజేస్తా' అని ప్రధాని ట్విట్టర్‌లో వెల్లడించారు. ఆయన ట్వీట్ చేసిన అర గంటలోపే 14,000 మంది ఆ పోస్ట్‌ను రీట్వీట్ చేశారు. సోషల్ మీడియాలో అత్యధికమంది ఫాలోవర్లు కలిగిన రాజకీయ నేతల్లో ప్రధాని మోదీ ఒకరు. ఆయనకు ట్విట్టర్‌లో 5.33 కోట్ల మంది, ఫేస్‌బుక్‌లో 4.4 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధికమంది ఫాలోవర్లు కలిగిన రాజకీయ నేతల్లో మోదీ మొదటిస్థానంలో ఉన్నారు. ఆయనకు 3 కోట్లమందికిపైగా ఫాలోవర్లు ఉండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు 1.49 కోట్లు, ఒబామాకు 2.48 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు.

**ద్వేషాన్ని వీడండి.. సోషల్ మీడియాను కాదు: రాహుల్**

సోషల్ మీడియా నుంచి వైదొలుగాలని యోచిస్తున్నట్లు ప్రధాని మోదీ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ స్పందించారు. ద్వేషాన్ని విడనాడాలని, సామాజిక మాధ్యమాలను కాదని చురకలంటించారు. ఈ మేరకు ఆయన ట్వీట్‌చేశారు.



## బాగ్దాద్ గ్రీన్ జోన్‌లోకి దూసుకొచ్చిన రాకెట్లు

**బాగ్దాద్:** ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని అత్యంత కీలకమైన గ్రీన్‌జోన్‌లోకి సోమవారం తెల్లవారుజామున రెండు కత్యూష రాకెట్లు దూసుకొచ్చాయి. వాటిల్లో ఒకటి అమెరికా రాయబార కార్యాలయానికి సమీపంలో పడింది. ఈ ప్రాంతంలో భారీగా సైనిక బలగాలు మోహరించడంతోపాటు ప్రభుత్వ, వివిధ దేశాల రాయబార కార్యాలయాలు ఉన్నాయి. గత అక్టోబర్ నుంచి అమెరికా స్థావరాలు, కార్యాలయాలపై జరుగుతున్న దాడుల్లో ఇది 20వది.

## 'లాడెన్ ఆపరేషన్' వైద్యుడి నిరాహారదీక్ష

**ఇస్లామాబాద్:** అల్ ఖైదా అధిపతి బిన్ లాడెన్‌ను అంతమొందించడంలో 2011లో అమెరికాకు సహకరించిన పాక్ వైద్యుడు షకీల్ అఫ్రిది నిరాహారదీక్షకు దిగారు. ఉగ్రవాదులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో 2012లో అఫ్రిదిని పాక్ అరెస్ట్ చేసింది. 33 ఏండ్లు జైలు శిక్ష విధించింది. అనంతరం పదేండ్లకు కుదించింది. దాదాపు ఎనిమిదేండ్లుగా జైలులో మగ్గుతుండటం, విడుదలకు సహకరిస్తామన్న ట్రంప్ పట్టించుకోకపోవడంతో అఫ్రిదీ నిరాశకు లోనయ్యారు. తనకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ జైలులో నిరాహారదీక్షకు దిగాడు.

## ఢిల్లీ హింసాకాండపై ఐరాసకు లేఖ

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో జరిగిన హింసాకాండపై జోక్యం చేసుకోవాలని ఐక్యరాజ్యసమితిని భీమ్ ఆర్మీ అధిపతి చంద్రశేఖర్ ఆజాద్ కోరారు. ఐరాస మానవ హక్కుల సంస్థ హైకమిషనర్‌కు లేఖ రాశారు. భారత్‌లో 'తీవ్ర స్థాయిలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలపై' దర్యాప్తు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# చాపకింద నీరులా కరోనా

**మరో ఇద్దరు భారతీయులకు వైరస్ ■ ఢిల్లీలో ఒకరికి, తెలంగాణలో మరొకరికి**

**జైపూర్‌లో ఒక విదేశీయుడికి కూడా ■ ప్రపంచ వ్యాప్తంగా మూడువేలు దాటిన మృతుల సంఖ్య**

**న్యూఢిల్లీ, మార్చి 2:** ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా(కొవిడ్-19) భారత్‌ను కూడా వదలట్లేదు. తాజాగా ఇద్దరు భారతీయులకు ఈ వైరస్ సోకినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ సోమవారం ప్రకటించింది. అలాగే, మన దేశ పర్యటనకు వచ్చిన ఒక విదేశీయుడికి కూడా కరోనా సోకినట్టు గుర్తించామని రాజస్థాన్ ప్రభుత్వం పేర్కొంది. దీంతో దేశంలో ఇప్పటివరకూ ఆరు కరోనా కేసులు నమోదైనట్టు అయింది. అయితే, గతంలో ఈ వైరస్ సోకిన కేరళకు చెందిన ముగ్గురు వ్యక్తులు ప్రస్తుతం కోలుకొని, దవాఖాన నుంచి డిశ్చార్జీ అయ్యారని అధికారులు తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వైద్యుల పర్యవేక్షణలో 25,738 మంది ఉన్నారని వీరిలో 37 మందిలో వ్యాధి లక్షణాలు ఉన్నట్టు అనుమానిస్తున్నామన్నారు. కరోనా తీవ్రమవుతున్న నేపథ్యంలో అవసరముంటే తప్ప ఇరాన్, ఇటలీ, దక్షిణ కొరియా, సింగపూర్ వంటి దేశాలకు ప్రయాణించొద్దని కేంద్ర వైద్యశాఖ మంత్రి హర్షవర్ధన్ సూచించారు. కరోనాను గుర్తించడం, వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తతతో ఉన్నట్టు పేర్కొన్నారు.




### దుబాయ్ టు హైదరాబాద్..

**కరోనాకు** ప్రభావితమైన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు ఢిల్లీకి చెందిన వ్యక్తి కాగా, మరొకరు తెలంగాణకు చెందిన వ్యక్తిగా అధికారులు గుర్తించారు. ఢిల్లీకి చెందిన వ్యక్తి ఇటీవల ఇటలీకి వెళ్లి వచ్చినట్టు, తెలంగాణ వ్యక్తి దుబాయి నుంచి వచ్చినట్టు హర్షవర్ధన్ పేర్కొన్నారు. శ్వాసలో ఇబ్బంది, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు కనిపించడంతో ఆ ఇద్దరూ వైద్యుల్ని సంప్రదించారని, ఈ విధంగా వాళ్లలో కరోనా లక్షణాలు ఉన్నట్టు వెల్లడయ్యిందని తెలిపారు. వారి పరిస్థితి నిలకడగా ఉన్నదన్నారు. వైరస్ ప్రభావం ఎక్కువగా ఉన్న ఇరాన్, ఇటలీలో చిక్కుకున్న భారతీయుల్ని తీసుకురావడానికి అక్కడి ప్రభుత్వాలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. భారత పర్యటనకు వచ్చే ఇరాన్, చైనా దేశస్థులకు వీసాల జారీని నిలిపివేసినట్టు, వైరస్ తీవ్రతను బట్టి అవసరమైతే మరి కొన్ని దేశాలను కూడా ఈ జాబితాలో చేర్చే అవకాశమున్నట్టు హర్షవర్ధన్ చెప్పారు. ఇటీవల ఇరాన్ నుంచి దాదాపు 1,086 మంది దేశానికి వచ్చారని, వాళ్లందరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మరోవైపు, ఇటలీకి చెందిన ఓ పర్యాటకుడికి కరోనా సోకినట్టు నిర్ధారణ అయిందని రాజస్థాన్ ఆరోగ్య శాఖ మంత్రి రఘు శర్మ తెలిపారు.

### ఐదున్నర లక్షల మందికి పరీక్షలు


**నేపాల్,** ఇండోనేషియా, వియత్నాం, మలేషియా, చైనా, హాంకాంగ్, థాయిలాండ్, దక్షిణకొరియా, సింగపూర్, జపాన్ నుంచి వచ్చే ప్రయాణికులకు దేశవ్యాప్తంగా 21 విమానాశ్రయాల్లో కరోనా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని కేంద్రమంత్రి హర్షవర్ధన్ తెలిపారు. ఇప్పటివరకూ 5,57,431 మందికి విమానాశ్రయాల్లో, మరో 12,431 మందికి నౌకాశ్రయాల్లో పరీక్షలు జరిపామన్నారు. అలాగే ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, సిక్కిం రాష్ట్రాలకు చెందిన 10,24,992 మందికి వైరస్ పరీక్షలు జరిపినట్టు, 25,738 మంది వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్టు తెలిపారు. కరోనా అనుమానంతో 37 మంది నమూనాలను పరీక్షలకు పంపామన్నారు.

### కరోనాతో ఇరాన్ కీలక నేత మృత్యువాత



మహ్మద్ మిర్మొహమ్మది

ఇరాన్ అత్యున్నత నేత అయతుల్లా అలీ ఖమేనీ సలహామండలిలో సభ్యుడైన మహ్మద్ మిర్మొహమ్మది(71) కరోనాతో సోమవారం మృతిచెందారు. ఇరాన్ ఉపాధ్యక్షురాలు మాసోమెహ్ ఎబ్టెకర్, టాస్క్‌ఫోర్స్ అధినేత ఇరాజ్ హరిచ్చి కూడా కరోన బారినపడ్డారు. ఇప్పటి వరకు ఇరాన్‌లో 1,501 మందికి కరోనా వైరస్ సోకగా, 66 మంది మరణించారు. మరోవైపు, కరోనా కారణంగా ప్రపంచవ్యాప్తంగా మరణించినవారి సంఖ్య సోమవారం మూడు వేలు దాటింది. దీంట్లో 2,912 మంది చైనాకు చెందినవారే.




## ఆధారాలన్నీ కాలిపోయాయి!

- ప్రభుత్వ పరిహారం అందుతుందా?
- ఢిల్లీ బాధితుల ఆందోళన
- ఆదుకుంటామన్న సీఎం కేజ్రీవాల్
- ఐబీ అధికారి కుటుంబానికి రూ.కోటి పరిహారం, ఒకరికి ఉద్యోగం



పరీక్షరాసి వస్తున్న విద్యార్థులకు గులాబీ లు అందిస్తున్న పోలీసులు

**న్యూఢిల్లీ:** మత ఘర్షణలతో అట్టుడికిన ఈశాన్య ఢిల్లీ క్రమంగా కోలుకుంటున్నది. అక్కడి పరిస్థితులు సాధారణస్థితికి చేరుతున్నాయి. బాధితులకు సహాయ కార్యక్రమాలను ఢిల్లీ ప్రభుత్వం ముమ్మరం చేసింది. హింసాకాండలో సర్వం కోల్పోయిన బాధితులు ప్రభుత్వ పరిహారాన్ని ఎలా పొందాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. అల్లరిమూకలు తమ ఇండ్లకు నిప్పుపెట్టడంతో రేషన్, ఆధార్, ఓటర్, పాన్ వంటి కార్డులతోపాటు ఇతర ధ్రువీకరణ పత్రాలు కూడా కాలిపోయాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అయితే బాధితులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా వారికి అవసరమైన సహాయాన్ని, పరిహారాన్ని ప్రభుత్వం అందజేస్తుందని అధికారులు తెలిపారు. బాధితులను అన్నివిధాలుగా ఆదుకుంటామని సీఎం అరవింద్ కేజ్రీవాల్ భరోసా ఇచ్చారు. తక్షణం సహాయం అవసరమయ్యేవారి సమాచారాన్ని ఢిల్లీ రిలీఫ్ హ్యాష్‌ట్యాగ్ ద్వారా తమతో పంచుకోవాలని ట్విట్టర్‌లో కోరారు. దుండగుల దాడుల్లో ఇండ్లు, దుకాణాలు కాలిపోయినవారికి తక్షణ సాయం కింద రూ.25,000 అందజేస్తున్నట్లు వెల్లడించారు. హత్యకుగురైన ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారి అంకిత్ శర్మ కుటుంబానికి రూ.కోటి పరిహారాన్ని కేజ్రీవాల్ ప్రకటించారు. ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇస్తామన్నారు. ఢిల్లీ అల్లర్లలో 42 మంది మరణించిన సంగతి తెలిసిందే.

### పరీక్షలకు 92 శాతం హాజరు..

ఈశాన్య ఢిల్లీలో సోమవారం జరిగిన 10, 12వ తరగతుల పరీక్షలకు 92 శాతానికిపైగా విద్యార్థులు హాజరైనట్లు సీబీఎస్ఈ తెలిపింది. హింస నేపథ్యంలో పరీక్షలకు హాజరుకాలేని వారికి ప్రత్యేకంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మెడికల్, ఇంజినీరింగ్ వంటి కోర్సుల వారికి ఇబ్బంది కలుగకూడదన్న ఉద్దేశంతోనే షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

# ఉరి మళ్లీ వాయిదా

- నిర్భయ దోషుల కేసులో ఆదేశాలు జారీచేసిన ఢిల్లీ కోర్టు
- రాష్ట్రపతిని క్షమాభిక్ష కోరిన దోషి పవన్ గుప్తా
- క్యురేటివ్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** నిర్భయ కేసులో దోషుల ఉరి అమలు మరోసారి వాయిదా పడింది. దోషులను మంగళవారం ఉదయం ఉరి తీయాల్సి ఉండగా.. చివరి నిమిషంలో నిరవధిక వాయిదా పడింది. దోషుల్లో ఒకడైన పవన్ కుమార్ గుప్తా చివరి నిమిషంలో రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్‌కు సోమవారం క్షమాభిక్ష పిటిషన్ దరఖాస్తు చేశాడు. దీనిపై నిర్ణయం తీసుకునేవరకు ఉరిని నిరవధికంగా వాయిదా వేయాలని ఢిల్లీ అదనపు సెషన్స్ కోర్టు తీర్పునిచ్చింది. దోషుల ఉరి వాయిదా పడటం ఇది మూడోసారి. గతంలో జనవరి 22, ఫిబ్రవరి 1 తేదీల్లో దోషులకు డెత్ వారంట్లు జారీ అయ్యాయి. దోషులు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తుగడలు వేస్తుండటంలో ఉరి ఆలస్యం అవుతున్నది.

**నాటకీయ పరిణామాలు**

ఢిల్లీ అదనపు సెషన్స్ కోర్టులో సోమవారం నాటకీయ పరిణామాలు జరిగాయి. ఉరిని వాయిదా కోరుతూ నిర్భయ దోషులు అక్షయ్ సింగ్, పవన్ కుమార్ గుప్తా దాఖలు చేసిన పిటిషన్‌ను ఉదయం కోర్టు కొట్టివేసింది. దీంతో పవన్ క్షమాభిక్ష కోసం రాష్ట్రపతికి దరఖాస్తు చేశారని అతడి తరపు న్యాయవాది ఏపీ సింగ్ తెలిపారు. అయితే దీని పై మధ్యాహ్నం విచారణ జరుపుతామని అదనపు సెషన్స్ జడ్జి ధర్మేందర్ రాణా పేర్కొన్నా రు. మధ్యాహ్నం కోర్టు తిరిగి ప్రారంభమైన తర్వాత ఏపీ సింగ్ 'క్షమాభిక్ష పిటిషన్' అంశా న్ని జడ్జికి వివరించారు. రాష్ట్రపతి తుది నిర్ణ యం తీసుకునేవరకు ఉరి వాయిదా వేయాలన్నారు. దోషులు ఇంకా అవకాశాలన్నీ వినియోగించుకోలేదని, తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు నలుగురు దోషులను ఉరితీయొద్దని కోరారు. పవన్ పిటిషన్ రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండగా ఉరిశిక్ష అమలు చేయడం సమంజసం కాదన్నారు. అదేసమయంలో క్యురేటివ్, క్షమాభిక్ష పిటిషన్ల దాఖలులో జాప్యం చేస్తున్నారని దోషుల తరపు న్యాయవాది ఏపీ సింగ్‌పై జడ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు నిప్పుతో ఆటలాడుతున్నారు. జాగ్రతగా ఉండండి. చిన్న తప్పిదం జరిగినా ఎదుర య్యే పర్యవసానాలు మీకు తెలుసు' అని జడ్జి అన్నారు. మరోవైపు ,నిర్భయ కేసులో దోషి పవన్‌కుమార్ గుప్తా దాఖలు చేసిన క్యురేటివ్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం కొట్టివేసింది. ఉరిశిక్షను యావజ్జీవ శిక్షగా మార్చాలని పవన్ అభ్యర్థించాడు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. 'ఈ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నాం. క్యురేటివ్ పిటిషన్‌తోపాటు ఉరిని వాయిదా వేయాలన్న పిటిషన్లను కొట్టివేస్తున్నాం' అని తీర్పు చెప్పింది. దోషుల అవయవ దానానికి అవకాశం ఇవ్వాలని దాఖలు చేసిన పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు కొట్టివేసింది.

### దోషులకు అండగా వ్యవస్థ: ఆశాదేవి



**కోర్టులు** తమ సొంత తీర్పును అమలు చేయడానికి ఇంత సమయం ఎందుకు తీసుకుంటున్నాయి. తరుచూ ఉరి వాయిదా పడటం న్యాయవ్యవస్థ వైఫల్యాన్ని సూచిస్తున్నది. వ్యవస్థ మొత్తం దోషులకు అండగా నిలుస్తున్నది. దోషులను ఉరితీస్తారన్న ఆశలు క్రమంగా సన్నగిల్లుతున్నాయి. నిర్భయ ఘటన కన్నా ఘోరమైన కేసు ఇంకోటి లేదు. అయినా నేను న్యాయం కోసం పోరాడుతున్నాను. కోర్టులు వేడుక చూస్తున్నాయి. న్యాయం అందించడంలో జాప్యాన్ని ప్రపంచం గమనిస్తున్నది.

## విస్తృత ధర్మాసనానికి నో!



**ఆర్టికల్ 370 రద్దు పిటిషన్లపై సుప్రీంకోర్టు నిర్ణయం**

**న్యూఢిల్లీ:** ఆర్టికల్ 370 రద్దుపై దాఖలైన పిటిషన్లను ఏడుగురు సభ్యుల విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. తమకు ఎలాంటి కారణాలు కనిపించడం లేదని జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తెలిపింది. ఆర్టికల్ 370కి సంబంధించి ప్రేమ్‌నాథ్ కౌల్ వర్సెస్ జమ్ముకశ్మీర్ (1959), సంపత్ ప్రకాశ్ వర్సెస్ జమ్ముకశ్మీర్ (1970) కేసుల్లో సర్వోన్నత న్యాయస్థానం గతంలో వెలువరించిన తీర్పులు పరస్పరం విరుద్ధంగా ఉన్నాయని, ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలంటూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. పీపుల్స్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్ (పీయూసీఎల్) అనే పౌరహక్కుల సంస్థతోపాటు జమ్ముకశ్మీర్ హైకోర్టు బార్ అసోసియేషన్ ఈ పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై విచారణ జరిపిన కోర్టు పిటిషనర్ల వాదనలతో ఏకీభవించలేదు. ఆ రెండు కేసుల్లో ఎలాంటి వైరుధ్యాలు లేవని అభిప్రాయపడిన ధర్మాసనం, ఆ పిటిషన్లను కొట్టివేసింది.

## కమల్‌నాథ్ సర్కార్ కూల్చివేతకు కుట్ర: దిగ్విజయ్ సింగ్

**న్యూఢిల్లీ/భోపాల్:** మధ్యప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు తమ పార్టీ ఎమ్మెల్యేలను బీజేపీ ప్రలోభాలకు గురి చేస్తున్నదని ఆ రాష్ట్ర మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ ఆరోపించారు. 'సీఎం కావాలని శివరాజ్ సింగ్, డిప్యూటీ సీఎం కావాలని నరోత్తమ్ మిశ్రా కలలు కంటున్నారు. 15 ఏండ్లుగా రాష్ట్రాన్ని లూటీ చేసిన వారు.. ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో బేరసారాలు జరుపుతున్నారు. ఒక్కొక్కరికి రూ.25-35 కోట్ల మేరకు ఇస్తామంటూ ప్రలోభపెడుతున్నారు. తొలి విడుతగా రూ.5 కోట్లు, రాజ్యసభ ఎన్నికలు ముగిసిన తర్వాత రెండో విడుత, ప్రభుత్వం కూలిపోయిన తర్వాత మిగతా మొత్తం చెల్లిస్తామని చెబుతున్నారు' అని దిగ్విజయ్ సింగ్ ఆరోపించారు. అసెంబ్లీలో విపక్ష బీజేపీ నేత గోపాల్ భార్గవతోపాటు మాజీ సీఎం శివరాజ్ సింగ్ దీన్ని ఖండించారు.

## ఆఫ్ఘన్ సైనికులపై దాడులు కొనసాగిస్తాం: తాలిబన్లు

**కాబూల్:** అమెరికా-తాలిబన్ శాంతి ఒప్పందానికంటే ముందు కుదిరిన తాత్కాలిక యుద్ధ విరమణ సంధికి తాలిబన్లు ముగింపు పలికారు. ఆఫ్ఘనిస్థాన్ భద్రతా దళాలపై దాడులు కొనసాగుతాయని తాజాగా ప్రకటించారు. శాంతి ఒప్పందంలో పేర్కొన్నట్లు తాలిబన్ ఖైదీలను విడుదల చేయబోమని ఆఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ స్పష్టంచేసిన మరునాడే తాలిబన్లు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అమెరికాతో ఒప్పందం ప్రకారం విదేశీ బలగాలపై దాడులు చేయబోమని, ఆఫ్ఘన్ బలగాలపై తమ ఆపరేషన్స్ కొనసాగుతాయని తాలిబన్ ప్రతినిధి ఒకరు తెలిపారు.

# పార్లమెంటులో ఢిల్లీ రగడ

**దద్దరిల్లిన ఉభయ సభలు.. ప్రభుత్వం మొద్దు నిద్ర పోయిందన్న ప్రతిపక్షాలు**

**అమిత్ షా రాజీనామాకు డిమాండ్.. బీజేపీ, కాంగ్రెస్ సభ్యుల మధ్య తోపులాట**




అమిత్ షా రాజీనామా చేయాలంటూ పార్లమెంటు ఆవరణలో కాంగ్రెస్, ప్రతిపక్షాల నిరసన

**న్యూఢిల్లీ, మార్చి 2:** దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన హింసాకాండ సోమవారం పార్లమెంట్‌లో వేడిని పుట్టించింది. మతఘర్షణలను అదుపుచేయడంలో అధికార పక్షం విఫలమైందని, హస్తిన అగ్నిగుండంగా మారుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్ర పోయిందని ప్రతిపక్షాలు కేంద్రంపై దుమ్మెత్తిపోశాయి. కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీ, వామపక్షాలు, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే తదితర పార్టీలకు చెందిన ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రాజ్యసభ వాయిదా పడింది. మరోవైపు, ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్య కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయాల బిల్లు, 2019ను కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిశాంక్ ప్రవేశపెట్టారు. ఇంకోవైపు, కేంద్ర బడ్జెట్ 2020-21కు సంబంధించి జరిగిన పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశాలకు దాదాపు 95 మంది ఎంపీలు హాజరు కాలేదని రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు తెలిపారు. మరోవైపు ఢిల్లీ హింసాత్మక ఘటనలను ఖండిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సహా పలువురు పార్టీ ఎంపీలు సోమవారం లోక్‌సభలో నిరసన వ్యక్తం చేశారు. హింసాకాండకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీంతో బీజేపీ సభ్యులు ఆగ్రహంతో కాంగ్రెస్ ఎంపీల వైపు దూసుకొచ్చారు. ఫలితంగా ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో స్పీకర్ ఓంబిర్లా సభను వాయిదా వేశారు. మరోవైపు, ఎన్నికలను ప్రభుత్వ వ్యయంతో నిర్వహించాలన్న ప్రతిపాదనకు భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) సానుకూలంగా లేదని కేంద్రం తెలిపింది.

## ప్రభుత్వ ప్రాయోజిత హత్యాకాండ!



**కోల్‌కతా:** ఢిల్లీలో చెలరేగిన మత కార్చిచ్చు.. 'పథకం ప్రకారం జరిగిన ప్రభుత్వ ప్రాయోజిత మారణకాండ' అని పశ్చిమ బెంగాల్ సీఎం మమత ఆరోపించారు. దేశవ్యాప్తంగా 'గుజరాత్ తరహా అల్లర్లకు' బీజేపీ కుట్ర పన్నుతున్నదని ధ్వజమెత్తారు. సోమవారం కోల్‌కతాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆదివారం అమిత్‌షా చేపట్టిన ర్యాలీలో కొందరు 'గోలీ మారో' అంటూ నినాదాలు చేయడాన్ని ఖండించారు. ఇది ఢిల్లీ కాదు.. బెంగాల్ అని, పోలీసులు వదిలిపెట్టరని హెచ్చరించారు. ఢిల్లీ బాధితుల కోసం విరాళాలు సేకరించాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**'బెంగాల్‌కు గర్వకారణం.. మమత'**

వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్‌ను గెలిపించేందుకు ఒప్పందం కుదుర్చుకున్న వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ప్రచార నినాదాన్ని రూపొందించారు. 'బెంగాల్‌కు గర్వకారణం.. మమత' అన్న అర్థం వచ్చేలా'బంగ్లార్ గొర్బో మమత' నినాదానికి రూపకల్పన చేశారు.

### నాపై దాడి చేశారు

**సోమవారం** లోక్‌సభలో అధికార, విపక్ష పార్టీ సభ్యుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో బీజేపీ మహిళా ఎంపీ జాస్‌కౌర్ మీనా తనపై దాడికి పాల్పడ్డారని కాంగ్రెస్ దళిత మహిళా ఎంపీ రమ్యా హరిదాస్.. స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు, ఢిల్లీ మత ఘర్షణలపై పార్లమెంటులో చర్చించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించట్లేదని కాంగ్రెస్ ఆరోపించింది.



### వారిని బహిష్కరించండి

**తమతో** ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు అనుచితంగా ప్రవర్తించారని బీజేపీ మహిళా ఎంపీలు ఎదురుదాడికి దిగారు. వారిపై బహిష్కరణ వేటు వేసి గట్టి చర్యలు తీసుకోవాలని స్పీకర్ ఓం బిర్లాను కోరారు. కాంగ్రెస్ ఎంపీలు సభలో గూండాలుగా ప్రవర్తిస్తున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ స్మృతి ఇరానీ విమర్శించారు.

## మేఘాలయలో కొనసాగుతున్న హింసాకాండ

**షిల్లాంగ్:** మేఘాలయలో గిరిజనులు, గిరిజనేతరుల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. మాప్రేం ప్రాంతంలో ఆదివారం ఆగంతకులు 28 ఏండ్ల యువకుడిని పొడిచారు. సౌత్‌వెస్ట్ ఖాజీ హిల్స్ జిల్లాలోని ఫోర్ట్రోక్‌హ్ పట్టణంలోని నాలుగు గిరిజనేతరుల దుకాణాలకు సోమవారం తెల్లవారుజామున దుండగులు నిప్పంటించారని పోలీసులు తెలిపారు. విద్యార్థుల పరీక్షల నేపథ్యంలో ఉదయం కర్ఫ్యూను సడలించామని, అనంతరం కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.

## డ్యూటీకి ప్రాధాన్యం.. బాబును ఎత్తుకొని విధులు



**నోయిడా:** ఉత్తరప్రదేశ్‌లో ఓ మహిళా కానిస్టేబుల్ ఏడాదిన్నర వయసున్న కుమారుడ్ని ఎత్తుకొని విధులు నిర్వర్తించడం అందరినీ ఆకట్టుకున్నది. నోయిడాలో సోమవారం యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పర్యటిస్తున్న సందర్భంగా విధుల్లో ఉన్న ప్రీతిరాణి తన బాబును ఎత్తుకొనే డ్యూటీ చేశారు. 'నా భర్త ఈరోజు పరీక్ష రాసేందుకు వెళ్లారు. అందువల్ల నా కొడుకు బాధ్యతను నేను స్వయంగా చూసుకోవాల్సి వచ్చింది. డ్యూటీ కూడా ముఖ్యమే. అందుకే నా బాబును తీసుకొచ్చాను' అని ప్రీతి చెప్పారు. గౌతమ్ బుద్ధ నగర్ జిల్లాలో ఆది, సోమవారాల్లో పర్యటించిన సీఎం యోగి వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.



పౌరసత్వ సవరణ చట్టం గురించి ముస్లింలు తమ నిరసన ఉద్యమాలకు ముగింపు పలుకాలి. మేం ఎలాంటి వివక్షను అనుమతించబోం. దేశంలో ఉన్న అనిశ్చితి పోవాలి. ఈ దేశం అందరిది. హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రిస్టియన్లది. ప్రతిఒక్కరూ సమానహక్కులు కలిగి ఉంటారు.

**నితీశ్ కుమార్, బీహార్ ముఖ్యమంత్రి**

అధికారపార్టీ అదేపనిగా చేసిన 'గోలీమారో' లాంటి రెచ్చగొట్టే ప్రకటనలతోనే ఢిల్లీలో మతఘర్షణలు జరిగాయి. ఇలాంటి దేశాన్నేనా మనం కోరుకున్నది? వారు ఎవరిని చంపుతారు? భారతీయులందరినీ చంపుతారా? మంచిరోజులు అంటే ఇవేనా? దీంతో ప్రభుత్వం, హోం శాఖ తమ ప్రతిష్ఠను కోల్పోయాయి.

**అధిర్ రంజన్ చౌదరి, లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత**



**చరిత్రలో నేడు**



1575

'టుకరోయ్' యుద్ధంలో బెంగాలీ సేనలను ఓడించిన మొగల్ చక్రవర్తి అక్బర్.

1939



బ్రిటిష్ నియంతృత్వపాలనకు వ్యతిరేకంగా బొంబాయిలో నిరహార నిరసనోద్యమాన్ని చేపట్టిన మహాత్మాగాంధీ.



1971

వర్ణవివక్ష వ్యతిరేకోద్యమ నాయకురాలు విన్నీ మండేలాకు ఏడాది జైలు శిక్ష విధించిన దక్షిణాఫ్రికా ప్రభుత్వం.

ప్రస్తుత సామాజిక, ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో కులాల వారీగా జనాభా గణన ప్రాధాన్యం సంతరించుకున్నది. మరోవైపు ఓబీసీ కులాలకు రిజర్వేషన్ల గురించి జస్టిస్ రోహిణి కమిషన్ సిఫారసులు కూడా యూపీఏ-2 హయాం నుంచీ అమలుకు నోచుకోలేదు. దేశం లో నెలకొన్న ఆర్థిక మందగమన స్థితిలో రిజర్వేషన్ల గురించి గాక, ఉద్యోగ కల్పన గురించి ఆలోచించాలి. ఈ క్రమంలో పార్టీలన్నీ పేదరిక నిర్మూలనకు, ఉద్యోగ కల్పనకు కృషి చేయాలి. అప్పుడే దేశం పేదరికం, నిరుద్యోగం సమస్య నుంచి బయటపడవచ్చు.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

కరోనా వైరస్‌తో ప్రపంచ ఆర్థికవ్యవస్థకు బీటలు వారుతున్నాయి. రోజురోజుకూ విస్తరిస్తున్న కరోనా కొత్తగా నైజీరియా, న్యూజీలాండ్ దేశాలకు విస్తరించింది. భారత్ కూడా దీన్నుంచి తప్పించుకునే పరిస్థితి లేదు. ప్రపంచవ్యాప్తంగా వస్తు రవాణా తీవ్రంగా దెబ్బ తిన్నది. చైనా ఆర్థికవ్యవస్థ ఇప్పటికే కుప్పకూలింది. అమెరికాతో సహా ప్రపంచ ఆర్థికవ్యవస్థ కుదేలవుతున్నది. అమెరికా దిగ్గజ సంస్థలన్నీ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈస్థితిలో ఆర్థిక పరిష్కారాల గురించి కాకుండా కరోనా వైరస్ కట్టడికి అందరూ కృషిచేయాలి.

**ది హిందూ**



# ఆఫ్ఘన్‌లో శాంతిరేఖ

అమెరికా, తాలిబన్ల మధ్య ఒప్పందం కుదరడంతో సంక్షుభిత ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి నెలకొంటుందనే ఆశాభావం వ్యక్తమవుతున్నది. 2001లో అమెరికా యుద్ధంలోకి దిగిననాటి నుంచి ఇప్పటివరకు 3, 500 మంది అమెరికా సైనికులు మరణించారు. రెండు లక్షల కోట్ల డాలర్లు వ్యయం అయిందని అంచనా. తాలిబన్లతో పాటు సాధారణ పౌరులు అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. ఇక ప్రకృతి, సామాజిక విధ్వంసాలు అంచనాకు అతీతమైనవి. తాలిబన్లు ఇంకా బలంగా ఉండటం, రష్యా, చైనా, ఇరాన్ పరోక్షంగా వారికి తోడ్పడుతుండటం వల్ల అమెరికా ఏదో ఒక స్థాయిలో ఒప్పందం కుదుర్చుకొని యుద్ధాన్ని విరమించుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. తాలిబన్లపై ఇతరశక్తుల ప్రభావాన్ని తగ్గించడంతో పాటు కీలకమైన ఈ ప్రాంతంలో తమ పట్టును బలోపేతం చేసుకోవాలని అమెరికా కొత్త వ్యూహాన్ని ఎంచుకొని ఉంటుంది. ఆఫ్ఘనిస్థాన్‌లో పద్నాలుగు వేల మంది అమెరికా సైనికులు ఉన్నారు. ఒప్పందం సజావుగా అమలైతే పద్నాలుగు నెలల్లో దశల వారిగా తన సైన్యాన్ని అమెరికా ఉపసంహరించుకుంటుంది. అమెరికా మొత్తం ఆఫ్ఘనిస్థాన్‌ను తాలిబన్ల చేతిలో పెడుతున్నట్టు కనిపిస్తున్నప్పటికీ అమెరికా తగిన జాగ్రత్తలు తీసుకుంది. ఆఫ్ఘనిస్థాన్‌లో ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వబోమని, అమెరికాపైన, ఆ దేశ మిత్రరాజ్యాలపై దాడులు సాగించబోమని తాలిబన్లు హామీ ఇచ్చారు. అంటే ఆయాదేశాలు చేపట్టే ప్రాజెక్టులకు, ఇతర కార్యకలాపాలకు భద్రత లభిస్తుంది. ఆఫ్ఘనిస్థాన్‌లోని ఇతరపక్షాలతో చర్చలు జరపడానికి కూడా తాలిబన్లు అంగీకరించారు. ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వాన్ని గుర్తించబోమంటూ తాలిబన్లు ఇంతకాలం అధికారిక చర్చలకు కూడా అంగీకరించలేదు. ఇప్పుడు చర్చలకు అంగీకరించారంటే, భవిష్యత్తులో అధికారం పంచుకోవడానికి కూడా సిద్ధపడవచ్చు.

**అమెరికాపై, ఆ దేశ మిత్ర రాజ్యాలపైన దాడులు చేయబోమని తాలిబన్ హామీ ఇచ్చింది కనుక భారత్‌కు ఇబ్బంది ఉండకపోవచ్చు. శాంతి ఒప్పందంతో కొత్త అధ్యాయం మొదలవుతుంది. భిన్నశక్తుల మధ్య కొత్త సంబంధాలు నెలకొంటాయి. అందువల్ల పాత పద్ధతిలోనే అలోచించి ఆందోళనపడకూడదు. తాలిబన్లు కూడా చేతికి అధికారం వచ్చిన తరువాత కొంత బాధ్యతాయుతంగా వ్యవహరించక తప్పదు. ఏదిఏమైనా భారత్ అప్రమత్తంగా ఉంటూ చైనా, పాకిస్థాన్‌తోపాటు కశ్మీర్‌లోని విదేశీ ప్రేరేపిత శక్తుల కార్యకలాపాలను గమనిస్తూ ఉండడం తప్పనిసరి.**

ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా సేనలు ప్రవేశించి దాదాపు రెండు దశాబ్దాలు కావస్తున్నది. సోవియెట్ ఆక్రమణను కూడా పరిగణనలోకి తీసుకుంటే 1979 నుంచే ఆఫ్ఘనిస్థాన్ సంక్షోభం మొదలైంది. ఈ విధంగా నాలుగు దశాబ్దాలుగా ఆఫ్ఘన్ సమాజం అనేక సంక్షోభాలను చవి చూసింది. ఇప్పటికైనా శాంతి నెలకొంటుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాలిబన్ ఖైదీలను విడుదల చేయబోమని ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇది చర్చల్లో తమ పట్టు కాపాడుకోవడానికే తప్ప నిజంగా ఒప్పందంలోని అంశాలను ఉల్లంఘించడానికి కాదు. అమెరికా సైన్యం ఉండటం వల్లనే ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వం నిలబడ్డది. అందువల్ల భవిష్యత్తులో తాలిబన్లతో ఏదో స్థాయిలో ఒప్పందం కుదుర్చుకోవడానికే ఆఫ్ఘన్ ప్రభుత్వం మొగ్గు చూపుతుంది. అమెరికా మధ్యవర్తిత్వ పాత్ర నిర్వహించవచ్చు. ఎక్కడైనా యుద్ధం ముగిసి శాంతి నెలకొంటే సంతోషించవలసిందే. కానీ తాలిబన్లు కరడుగట్టిన ఉగ్రవాదులు. అమెరికా దళాలు ఉన్నప్పుడే దాదాపు గ్రామీణ ప్రాంతాన్నంతా శాసిస్తున్నారు. నగరాలను స్వాధీనం చేసుకుంటూ అమెరికా వైమానిక దాడుల వల్ల వెనక్కు తగ్గుతున్నారు. అమెరికాతో చర్చలు సాగుతున్నప్పుడు కూడా దాడులను నిలిపివేయలేదు. మానవహక్కులను ఏ మాత్రం గౌరవించని ఈ సంస్థ స్త్రీల పట్ల మత నిబంధనలను కఠినంగా అమలు చేయవచ్చు. తమ స్వేచ్ఛను హరించే శాంతి మాకు వద్దని కూడా కొందరు మహిళలు అంటున్నారు. అమెరికా సైన్యం ఉపసంహరణ తరువా త ఈ సంస్థ ఎంత పేట్రేగిపోతుందోననే భయం వ్యక్తమవుతున్నది. అందువల్ల అంతర్జాతీయ సమాజం అక్కడి భిన్న తెగలకు అధికారంలో భాగస్వామ్యం లభించే విధంగా చూడాలి. ఆఫ్ఘనిస్థాన్ సమాజంలోని భిన్నవర్గాలు తమ అస్తిత్వం కోసం చేసే పోరాటాలకు మద్దతు ఇవ్వాలి.


మన దేశానికి ఆఫ్ఘనిస్థాన్ ఒప్పందం కొంత ఆందోళనకరమైన అంశమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మన దేశం ఇప్పటివరకు ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వంతోనే సంబంధాలు పెట్టుకున్నది. అక్కడి పునర్నిర్మాణ కార్యక్రమాలలో పాల్గొంటున్నది. తాలిబన్లతో ఇప్పటివరకు చేదు అనుభవాలే తప్ప సత్సంబంధాలు లేవు. అందువల్ల రాబోయే పరిణామాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఎన్ని సందేహాలున్నా ఆఫ్ఘనిస్థాన్ ఒప్పందం పట్ల భారత్ అనుకూలంగా స్పందించింది. ఇందుకు కారణం అమెరికా నుంచి పరోక్షంగా సంకేతాలు రావడమై ఉంటుంది. అమెరికాపై, ఆ దేశ మిత్ర రాజ్యాలపైన దాడులు చేయబోమని తాలిబన్ హామీ ఇచ్చింది కనుక భారత్‌కు ఇబ్బంది ఉండకపోవచ్చు. శాంతి ఒప్పందంతో కొత్త అధ్యాయం మొదలవుతుంది. భిన్నశక్తుల మధ్య కొత్త సంబంధాలు నెలకొంటాయి. అందువల్ల పాత పద్ధతిలోనే అలోచించి ఆందోళనపడకూడదు. తాలిబన్లు కూడా చేతికి అధికారం వచ్చిన తరువాత కొంత బాధ్యతాయుతంగా వ్యవహరించక తప్పదు. ఏదిఏమైనా భారత్ అప్రమత్తంగా ఉంటూ చైనా, పాకిస్థాన్‌తోపాటు కశ్మీర్‌లోని విదేశీ ప్రేరేపిత శక్తుల కార్యకలాపాలను గమనిస్తూ ఉండడం తప్పనిసరి. ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి నెలకొన్న తరువాత భారీ ఎత్తున పునర్నిర్మాణ కార్యక్రమాలు సాగుతాయి. మౌలిక వసతులు, వ్యవసాయం, పరిశ్రమలతో పాటు విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలలో భారీగా అవకాశాలుంటాయి. భారత్ తోడ్పాటు ఆఫ్ఘనిస్థాన్‌కూ అవసరమే. అందువల్ల భారత్ మారిన పరిస్థితులకు అనుగుణంగా వేగంగా పావులు కదపాల్సిన అవసరం ఉంది.

**జనగళం**

## జీవులను బతుకనిద్దాం

ఐక్యరాజ్యసమితి మార్చి 3వ తేదీని ప్రపంచ వన్యప్రాణి దినోత్సవంగా ప్రకటించింది. దీంతో వన్యప్రాణుల దినోత్సవాన్ని ఏటా మార్చి 3న జరుపుకుంటున్నాం. అంతరించిపోతున్న జంతువులు, మొక్కలపైన అవగాహన పెంచడానికి, వాటిని రక్షించడానికి ఈరోజున ప్రత్యేకంగా కార్యక్రమం జరుపుకుంటాం.

భూమి లెక్కలేనన్ని జీవజాతులకు, వృక్ష జాలానికి నిలయం. మనం పీల్చే గాలి, తినే ఆహారం, మనం ఉపయోగించే శక్తి, ఇతర ప్రయోజనాల కోసం మొక్కలు, జంతువులపై ఆధారపడి ఉన్నాం. మనకు అవసరమైన పదార్థాలన్నీ ప్రకృతి నుంచి పొందుతున్నాం. కాని మానవుల కార్యకలాపాలు జీవ జాతులు, సహజ వనరులను జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. రాబోయే దశాబ్దాల్లో అన్ని జీవ జాతులలో నాలుగింట ఒక వంతు అంతరించిపోయే ప్రమాదం ఉన్నది. ఇలా జీవజాతులు అంతరించిపోతే ప్రకృతిలోని జీవుల మధ్య సమతుల్యత లోపించి మిగతా జీవజాతులు కూడా అంతరించే ప్రమాదం ఉన్నది. ఈ ప్రభావం మానవజాతిని కూడా ప్రమాదంలో పడేస్తుంది.



మన దేశంలో వన్యప్రాణి సంరక్షణ కోసం 1972లో చట్టం చేశారు. జనాభా పెరిగిపోవడం, అడవులు తగ్గిపోవడంతో కాలుష్యం పెరిగిపోతున్నది. దీంతో వాతావరణంలో మార్పులు జరిగి జీవజాతులు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. కాబట్టి వన్యప్రాణుల సంరక్షణ చట్టాలతో వాటిని రక్షించుకోవాలి. అయితే ప్రభుత్వం ఒక్కటే ఈ పని చేయదు. రాజ్యాంగం ప్రకారం అడవులు, నదులు, చెరువులు కుంటలు, కాలువలు చుట్టూ ఉన్న పక్షులు, జంతువుల, చెట్లను సంరక్షించడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత. జీవ వైవిధ్యంతోనే మానవ మనుగడ. లేదంటే మానవ జాతికి ప్రమాదమే. అందుకే వన్యప్రాణుల వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి.

**- నెరుపటి ఆనంద్, సైన్స్ టీచర్, ఉన్నత పాఠశాల, టేకుర్తి**

**(నేడు ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం)**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**తెలంగాణం**



**పి.వి. శ్రీనివాస్ రావు**

# నిత్యకాంతుల తెలంగాణ

**విద్యుత్ వాడకం రికార్డుస్థాయికి పెరిగిందంటే, అదే స్థాయిలో పెట్టుబడులు, వ్యవసాయరంగంలో దిగుబడులు పెరిగాయి. రాష్ట్రం అభివృద్ధి బాటలో నడువాలంటే విద్యుత్ ఇరిగేషన్ రంగాలే కీలకమని గుర్తించిన కేసీఆర్ ఈ రంగాలకు పెద్దపీట వేశారు. అందులో భాగంగానే ప్రాజెక్టులను రీ డిజైన్ చేసి కాళేశ్వరాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తున్నారు. నిరంతర విద్యుత్, నీటి సరఫరా కళ్ల ముందే కనిపిస్తున్నా ప్రతిపక్షాలు లేని అవినీతి గురించి మాట్లాడటం చూసి ప్రజలు ఈసడించుకున్నారు.**

ఉదయం పేపర్ చదువుతుంటే నాకు రెండు వార్తలు కనపడ్డయి. ఒకటి– విద్యుత్ వాడకంలో తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రికార్డులు బ్రేక్ చేసినట్లు. మరొకటి తల్లి బిడ్డ సంరక్షణలో తెలంగాణ భేష్ అంటూ.. కేంద్ర పరిశీలన బృందం ఇచ్చిన నివేదిక. ఈవార్తలు చదువుతుంటే నాకు పాత విషయాలు గుర్తుకొచ్చాయి. తెలంగాణ రావడం ఖాయం అని తెలిసి, రాష్ట్ర ఏర్పాటును అడ్డుకొనే ప్రయత్నంలో భాగంగా ప్రజలలో గందరగోళం సృష్టించాలని నాటి ముఖ్యమంత్రి కిరణకుమార్‌రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. 'రాష్ట్రం విడిపోతే తెలంగాణ ప్రాంతం అంధకారం అవుతుంది. విద్యుత్ ఉత్పత్తి ఉండదు, కొందామన్నా దొరకదు..' అంటూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చాడు. ఒక మీడియా ప్రతినిధిగా దానికి నేను హాజరైన. నేడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ వినియోగాన్ని తెలంగాణ రాష్ట్రం బ్రేక్ చేసింది. అలాగే 'తల్లి బిడ్డ సంరక్షణకు కేసీఆర్ కిట్ అద్భుతంగా పనిచేసింది' అంటూ కేంద్ర బృందం నివేదిక ఇచ్చినట్లు వచ్చిన వార్త. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు చూసిన సినిమా యాది కొచ్చింది. అందులో 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' అనే పాట గుర్తుకొచ్చింది.

పాలకుడికి విజన్ ఉండాలి. దానితోపాటు అన్నిరంగాలమీద సంపూర్ణ అవగాహన ఉండాలి. ప్రజలకు ఏమికావాలో తెలిసి ఉండాలి. దీనితో పాటు రాష్ట్రానికి తక్షణం ఏమికావాలో అర్థం చేసుకొని దానికి తగ్గట్టుగా ప్రాధాన్య క్రమాన్ని ఎంచుకోగలగాలి. అప్పుడే జనరంజకమైన పాలన అందించగలుగుతారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలకులు వాళ్లకు ఆసక్తి ఉన్న రంగాలమీదే దృష్టి పెట్టారు. కొందరు వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేస్తే, కొంతమంది పారిశ్రామికరంగాన్ని నిర్లక్ష్యం చేశారు. మరికొంత మంది సంక్షేమాన్ని విస్మరించారు. కొందరు సాగునీటిరంగాన్ని పట్టించుకోలేదు. ఇలా ఏదో ఒకదాన్ని నిర్లక్ష్యం చేశారు. ఇలా వారి పాలనలో ఏదో ఒక వెలితి కనబడేది.

కొత్తగా ఏర్పడిన రాష్ట్రం. ప్రజల్లో అనేక ఆకాంక్షలు. ఉద్యమ రథసారథి తెలంగాణ సాధకుడు కేసీఆర్‌తోనే మా ఆకాంక్షలు నెరవేరుతాయనే భావనతో ఆయనకే జనం పట్టంకట్టారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు కేసీఆర్. ఇది కత్తి మీద సామని తెలుసు. ప్రజల ఆకాంక్షలను గుర్తించిన వారిగా రాష్ట్రానికి ఏం కావాలో, ఏం చేయాలో పరిపూర్ణ అవగాహన ఉన్నవారు. దీంతో తగిన ప్రాధాన్య క్రమాన్ని ఎంచుకున్నారనడానికి ఇప్పుడు వస్తున్న ఫలితాలే నిదర్శనం. అందులో భాగమే విద్యుత్ వినియోగంలో ఉమ్మడి రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ వినియోగం 13,162 మెగావాట్లు నమోదు కాగా, కొత్త రాష్ట్రమైన తెలంగాణలో ఇప్పుడు 13,168 మెగావాట్ల రికార్డు విద్యుత్‌కు చేరింది. దీంతో ఉమ్మడి ఏపీ రికార్డ్ బ్రేక్ చేసినట్లైంది. సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే విద్యుత్, ఇరిగేషన్‌రంగాలపై దృష్టి సారించారు. విద్యుత్, ఇరిగేషన్ రంగాలను మొదటి ప్రాధాన్యంగా ఎంచుకోవడంలోనే ఆయన ముందుచూపు ఏమిటో అర్థమవుతుంది. విద్యుత్తు, నీళ్లు పుష్కలంగా ఉంటే ఉన్న పరిశ్రమలు బాగా నడుస్తాయి. కొత్త పరిశ్రమలు వస్తాయి. కొత్తగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఉపాధి అవకాశాలు పెరగడం అంటే ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగడం. కొనుగోలు శక్తి పెరగడం అంటే రాష్ట్ర సంపద పెరగడం. పెరిగిన సంపదను ప్రజలకు పంచాలంటే సంక్షేమ పథకాలు పెంచడం. అందులో భాగమే కేసీఆర్ కిట్. ఈ నేపథ్యంలోంచే మనం పేపర్లో వచ్చిన వార్తలను అర్థం చేసుకోవాలి. రాష్ట్రం ఏర్పడ్డ తొలి రోజుల్లోనే సీఎం కేసీఆర్ ఎంత ఖర్చు అయినా విద్యుత్‌ను కొనడంతో పాటు కొత్త విద్యుత్ ప్లాంట్లను నిర్మించాలన్న సంకల్పంతో అడుగులు వేశారు. అందులో భాగమే భద్రాద్రి కొత్తగూడెం, యాదాద్రి విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం. దీంతోపాటు జైపూర్ థర్మల్ ప్లాంటును త్వరగా పూర్తి చేశారు. విద్యుత్ కొనుగోలు కోసం ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం చేసుకోవడం లాంటి నిర్ణయాలు తీసుకున్నారు. దీనిపై కొందరు విపక్ష నాయకులు అవినీతి అంటూ అనవసర రాద్ధాంతం చేశారు. జనం మాత్రం పట్టించుకోలేదు. ఎందుకంటే రైతులకు, పరిశ్రమలకు విద్యుత్ కావాలి. చిరు వ్యాపారులకు, గృహ అవసరాలకు విద్యుత్ కావాలి. ఒకరకంగా చెప్పాలంటే విద్యుత్ నిత్యావసరం. అలాంటి విద్యుత్‌ను ప్రభుత్వం నిరంతరాయంగా అందిస్తుంటే అవినీతి జరిగిందంటూ కాకిగోల చేసినా జనం పట్టించుకోకుండా ఏ ఎన్నికలు వచ్చినా టీఆర్‌ఎస్‌కే పట్టం కడుతున్నారు. గతంలో వ్యవసాయానికి క్రాప్ హాలిడే, పరిశ్రమలకు ఇండస్ట్రీయల్ హాలిడేలు ఉండేవి. విద్యుత్‌రంగంపై ఆధారపడిన కాటేజ్ ఇండస్ట్రీస్‌కు, చిరువ్యాపారులకు జనరేటర్లే దిక్కు అయ్యేవి. నేడు ఆ పరిస్థితి లేదు. వ్యవసాయరంగానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను ఇస్తున్నారు. దీంతోపాటు తెలంగాణ ఇండస్ట్రియల్ పాలసీని ప్రకటించడంతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మల్టీనేషనల్ కంపెనీలు పెట్టుబడులతో తెలంగాణకు వస్తున్నాయి. ఇది ఇలా ఉంటే పారిశ్రామిక రంగంతో పాటు వ్యవసాయరంగంలో కూడా విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. రాష్ట్రంలో పారిశ్రామిక ఉత్పత్తులు పెరగడంతో పాటు రికార్డుస్థాయిలో వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడి పెరిగింది.

విద్యుత్ వాడకం రికార్డుస్థాయికి పెరిగిందంటే, అదే స్థాయిలో పెట్టుబడులు, వ్యవసాయరంగంలో దిగుబడులు పెరిగాయి. రాష్ట్రం అభివృద్ధి బాటలో నడువాలంటే విద్యుత్ ఇరిగేషన్ రంగాలే కీలకమని గుర్తించిన కేసీఆర్ ఈ రంగాలకు పెద్దపీట వేశారు. అందులో భాగంగానే ప్రాజెక్టులను రీ డిజైన్ చేసి కాళేశ్వరాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తున్నారు. నిరంతర విద్యుత్, నీటి సరఫరా కళ్ల ముందే కనిపిస్తున్నా ప్రతిపక్షాలు లేని అవినీతి గురించి మాట్లాడటం చూసి ప్రజలు ఈసడించుకున్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితాలు ఇప్పుడు మన కళ్లముందున్నాయి. ఎన్నడూ నిండని చెరువులు నిండుతున్నాయి. ఎప్పుడూ పారని భూములకు నీళ్లు పారుతున్నాయి. వేసవి సమీపిస్తున్నా కాలువల్లో, చెరువుల్లో నీళ్లు కనపడుతున్నాయి. రికార్డుస్థాయిలో విద్యుత్ వినియోగం ఎలా పెరిగిందో అదే స్థాయిలో వరి ఉత్పత్తి కూడా పెరిగింది. సాధారణంగా యాసంగి సీజన్‌లో వరి సాగు 17లక్షల ఎకరాలు కాగా, ఈ సీజన్‌లో రికార్డు స్థాయి లో 30 లక్షలకు పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 86 శాతానికి పైగా పెరుగుదల 24 గంటల పాటు నిరంతర విద్యుత్, సాగు నీరు అందించడంతోనే సాధ్యమైంది. రైతులకు పుష్కలంగా సాగు నీరు ఇచ్చిన కేసీఆర్ రైతుబంధు పేరుతో ఎకరానికి రెండు పంటలకు కలిపి 10 వేలు పెట్టుబడులు ఇవ్వడంతో రైతుకు ఏనుగంతా బలమొచ్చింది.

పారిశ్రామికరంగాన్ని, వ్యవసాయరంగాన్ని పరిగెత్తిస్తే సంపద పెరిగింది.



**పారిశ్రామికరంగాన్ని, వ్యవసాయరంగాన్ని పరిగెత్తిస్తే సంపద పెరిగింది. పెరిగిన సంపదను సంక్షేమ పథకాలతో జనాలకు పంచాలని ఆలోచన చేశారు కేసీఆర్. ఆసరా, కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు వివిధవర్గాల అభివృద్ధి కోసం పథకాలను ప్రవేశపెట్టారు. ఈ పథకాల్లో కేసీఆర్ కిట్ ఎన్నదగినదని కేంద్ర బృందం గుర్తించింది. ఈ కిట్‌తోనే తల్లి బిడ్డల సంరక్షణ పెరిగిందని కితాబిచ్చింది.**

పెరిగిన సంపదను సంక్షేమ పథకాలతో జనాలకు పంచాలని ఆలోచన చేశారు కేసీఆర్. ఆసరా, కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు వివిధవర్గాల అభివృద్ధి కోసం పథకాలను ప్రవేశపెట్టారు. ఈ పథకాల్లో కేసీఆర్ కిట్ ఎన్నదగినదని కేంద్ర బృందం గుర్తించింది. ఈ కిట్‌తోనే తల్లి బిడ్డల సంరక్షణ పెరిగిందని కితాబిచ్చింది. కేంద్రం ఇచ్చిన ప్రశంసతో పాటు అనేక అంతర్జాతీయ సామాజిక సర్వేలు, ఆర్థిక సర్వేలు, నీతి ఆయోగ్ నివేదికలు తెలంగాణ ఆర్థిక పరిస్థితి దేశ ఆర్థిక పరిస్థితి కన్నా, ఇతర రాష్ట్రాల కన్నా భేషుగ్గా ఉందని తేల్చి చెప్పాయి. రాష్ట్రంలో పేద, ధనిక అంతరం కూడా క్రమంగా తగ్గుముఖం పట్టిందని చెప్పడంతో పాటు, ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న మహా నగరాల్లో హైదరాబాద్ నెంబర్‌వన్ స్థానంలో ఉందని వారి నివేదికల్లో పొందుపరిచారు. ప్రపంచంలో సిలికాన్ వ్యాలీ, ఇండియాలో బెంగళూరు సాఫ్ట్‌వేర్ రంగాలకు కేంద్రం. కానీ నేడు ఆ స్థానాన్ని హైదరాబాద్ ఆక్రమించింది. మొన్నటి పార్లమెంటు సమావేశాలలో సమర్పించిన ఆర్థికసర్వేలో కూడా పన్ను రాబడిలో తెలంగాణ నెంబర్‌వన్ స్థానంలో ఉన్నదని చెప్పింది. పన్నుల రాబడి పెరిగిందంటే సంపద పెరిగిందనడానికి సూచికే కదా.

**(వ్యాసకర్త: ఇన్‌పుట్ ఎడిటర్,టీ న్యూస్)**

# మృత్తికా ఆరోగ్యమే పంటకు ప్రాణం

**విశ్లేషణ**



**మజ్జిగపు శ్రీనివాస్ రెడ్డి**

పంటల దిగుబడిలో ప్రధాన భూమిక భూమిదే. భూసార మే పంటలకు పెట్టుబడి. అయితే విచక్షణారహితంగా వాడుతున్న రసాయన ఎరువులతో భూములు నిస్సారమవుతున్నాయి. వినియోగదారుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. పంట భూములు పదికాలాల పాటు సారవంతంగా ఉండాలంటే వాటి సారాన్ని ముందుగానే అంచనా వేయాలి. తరచుగా తగిన మేరకు నేలకు పోషకాలు అందించాలి.

ఈ దిశగా కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సాయిల్ హెల్త్ కార్డు' పథకం సత్ఫలితాలను ఇస్తున్నది. ఐదు సంవత్సరాల కిందట మొదటి దశలో ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన ఈ పథకంలో దాదాపు 700 కోట్ల రూపాయలతో 22.48 కోట్ల మంది రైతులకు వీటిని పంచారు. దీనికి అనుగుణంగా 1229 ల్యాబ్‌లను బలోపేతం చేయడంతో పాటు 102 మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌లు, 8752 మినీ ల్యాబ్‌లు,1562 గ్రామస్థాయి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫలితంగా సంవత్సరానికి మూడు కోట్ల నమూనాలు పరీక్షించే సౌకర్యాలున్నాయి. దీనిద్వారా రైతులు తమ పొలాల మట్టిలోని పోషకాలను అంచనా వేయవచ్చు. తదనుగుణంగా సరిపోయే పంటలు వేసుకోవచ్చు. అవసరమైన మోతాదు మేరకు మాత్రమే ఎరువులు వాడుకోవచ్చు. ఫలితంగా పంటలకు సాగు ఖర్చులు తగ్గుతాయి. పంటల ఉత్పాదకత మేలుగా ఉంటుంది. వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. పెరిగిన పరీక్షా కేంద్రాల సామర్థ్యంతో మెట్టప్రాంతాలలోని భూసారాన్ని కూడా పరీక్షించవచ్చు. అవసరమైన ప్రధాన పంటలైన అపరాలు, నూనెగింజల ఉత్పత్తి పెంచుకోచ్చు. ఈ విధంగా రైతుల ఆదాయాలు రెట్టింపు కావటంలో 'సాయిల్ హెల్త్ కార్డు'లు ప్రధాన భూమిక పోషించనున్నాయి. ఇదే విషయాన్ని జాతీయ ఉత్పాదకత కౌన్సిల్ తన అధ్యయనం ద్వారా ధృవపరిచింది.19 రాష్ట్రాలలో 76 జిల్లాల్లోని 1700 మంది రైతుల పొలాలలోని మృత్తికను పరీక్షించిన ఎన్‌పీసీ సాయిల్‌హెల్త్‌కార్డులు వాడిన రైతులు ఎకరానికి సరాసరిన రూ.30వేల మేర అదనపు ఆదాయం పొందారని తెలి పింది. అదే సమయంలో ఎరువులనూ ఆదా చేసుకోవచ్చని ఆ అధ్యయనంలో తేలింది. రైతులు 10 నుంచి 50 శాతం వరకు సంప్రదాయకంగా వాడే ఎరువులను ఆదా చేయగలిగారు. ఇందుకు సాయిల్ హెల్త్‌కార్డు ఆధారిత ఎరువుల వాడకం దోహదపడింది. దీనికి అదనంగా అవసరం మేరకు మాత్రమే ఎరువులను వాడటం వల్ల ప్రతి పంటలో 20నుంచి 50 శాతం వరకు దిగుబడులు పెరిగాయి. రైతులకు ఆదాయాలు సైతం పెరిగాయి.

తెలంగాణ రాష్ట్రంలో యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం భూసార పరీక్షలు చేయించింది. రైతుల పొలాలలో వాడవలసిన ఎరువుల మోతాదును విస్తరణ అధికారులు సిఫార్సు చేయడం ఆహ్వానించదగిన పరిణామం. కేవలం ప్రభుత్వం సౌకర్యాలు కల్పించినంత మాత్రాన అన్నిపంటల భూములలోని భూసార పరీక్షలు పూర్తికావు. రైతులు సొంతంగా భూసార పరీక్షలకు ముందుకు రావాలి. ఆ ఫలితాలకు అనుగుణంగా మాత్రమే పంటలు, ఎరువులు వేసుకోవాలి. చిన్న కమతాలలోని రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి. అప్పుడే భూముల సుస్థిర వినియోగం పెరుగుతుంది. రైతుల ఆదాయాలు, వినియోగదారుల ఆరోగ్యం పెరుగుతాయి.

దేశంలో 1950వ దశకంలో ఆహారధాన్యాల ఉత్పత్తి పెంపు ప్రణాళికలో భాగంగా రసాయన ఎరువుల వాడకం మొదలైంది. మొదట్లో తక్కువ మోతాదులోనే ఎరువులు వాడేవారు. హరిత విప్లవకాలంలో ఎరువుల వినియోగం బాగా పెరిగింది. నత్రజని ఎరువుల ఉత్పత్తి, వాడకంలో భారత్‌ది ప్రపంచంలో రెండోస్థానం. భాస్వరం వినియోగంలోనూ రెండోస్థానంలో ఉన్నది. అన్నిరకాల ఎరువులు కలిపి దేశంలో 5.75 కోట్ల టన్నులు వినియోగిస్తున్నాం. ఇప్పటికే ఎక్కువ మొత్తంలో రసాయన ఎరువులు వాడుతున్న హర్యానా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలలోని భూముల ఉత్పాదకత మందగించినట్లు నివేదికలున్నాయి. 2025 నాటికి దేశంలో అవసరమయ్యే 32 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు ఉత్పత్తి చేయటానికి, పంటలకు 4.5 కోట్ల టన్నుల పోషకాలు అందించాల్సి ఉందని జాతీయ వ్యవసాయశాస్త్రాల అకాడమీ తన నివేదికలో తెలిపింది. అందులో కోటి టన్నులపైనే సేంద్రియ ఎరువులు వాడితే తప్ప భూములు పునరుజ్జీవం కావు.



**రసాయన ఎరువుల నుంచి సేంద్రియ ఎరువుల వాడకంవైపు మారితేనే భూములు సుస్థిర వినియోగంలో ఉంటాయి. సాగు ఖర్చులు తగ్గుతాయి. రసాయన ఎరువులపై పెట్టే ఖర్చు భారం తగ్గుతుంది. అంతేగాకుండా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు.**

అశాస్త్రీయంగా వాడుతున్న రసాయనఎరువులతో క్షేత్రస్థాయిలో దుష్ప్రభావాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. నేల సారం దెబ్బతిని, పంటల ఉత్పాదకత తగ్గిపోతున్నది. దేశంలో ప్రధానంగా సాగయ్యే వరి, గోధుమ పంటలలో నత్రజని, భాస్వరం, పొటాష్ 4:2:1 పాళ్లలో వాడాలి. కానీ దేశవ్యాప్తంగా అంతకంటే ఎక్కువ మోతాదుల్లో వాడుతున్నారు. అంటే ప్రధాన పోషకాలను మితిమీరి వాడుతున్నారు. దీంతో పలు సూక్ష్మపోషకాలు లోపిస్తున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి సేకరించిన రెండున్నర లక్షలకు పైగా నమూనాలు పరీక్షించినప్పుడు సగం నమూనాలో జింకులోపం కనిపించింది. 33 శాతం నమూనాల్లో బోరాన్, 10 శాతానిపైగా నమూనాల్లో ఇనుము, రాగి, మాంగనీసులు కొంతమేర లోపించినట్లు ఫలితాలు తెలుపుతున్నాయి. అంటే ప్రధాన పోషకాలనిచ్చే ఎరువులు మాత్రమే వాడుతుండటం తో కలుగుతున్న అనర్థాలివి. వీటిని తగ్గించి, ఆరోగ్యకరమైన భూములు, పోషకాలు కలిగిన ఆహార ఉత్పత్తులు అందాలంటే భూసారపరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి.

1955-56లో భారత్-అమెరికా ఒప్పందంలో భాగంగా భూసారం అంచనా, తద్వారా ఎరువుల వాడకం కోసం దేశంలో 16 భూసార పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత సాంద్ర వ్యవసాయ జిల్లా పథకం అమలులో భాగంగా ఎంపిక చేసిన జిల్లాల్లో మరో తొమ్మిది నూతన భూసార ప్రయోగశాలలు నెలకొల్పారు. అయితే దేశంలో వేలసంఖ్యలో భూసార పరీక్ష కేంద్రాలు ఉన్నప్పటికీ దాదాపు అన్నిరాష్ట్రాలలో ఆర్థిక సమస్యలు, నిర్వహణ లోపాల కారణంగా అవి నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని అన్నివిధాలా పరిపుష్టం చేసి, వినియోగంలోకి తేవాలి. మరిన్ని భూసార కేంద్రాల ఏర్పాటుకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. వాటిలో పెద్ద సంఖ్యలో నిపుణులను నియమించాలి. భూసార ఆధారిత ఎరువుల వాడకంపై రైతులకు విస్తృతస్థాయిలో అవగాహన కలిగించాలి. రసాయన ఎరువుల నుంచి సేంద్రియ ఎరువుల వాడకంవైపు మారితేనే భూములు సుస్థిర వినియోగంలో ఉంటాయి. సాగు ఖర్చులు తగ్గుతాయి. రసాయన ఎరువులపై పెట్టే ఖర్చు భారం తగ్గుతుంది. అంతేగాకుండా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు. ఇందుకుగాను రసాయన ఎరువులకు ఇస్తున్న సబ్సిడీలన్నింటినీ సేంద్రియ ఎరువులకివ్వాలి. అప్పుడే రైతులు సేంద్రియ ఎరువులు వాడుతారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూములు జీవం పోసుకుంటాయి. దేశ ఆహార స్వయంసమృద్ధికి ఆ భూములు ప్రధాన వనరులుగా, కేంద్రాలుగా నిలుస్తాయి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com



ఖమ్మం జిల్లా మధిరలో మొక్కనాటి నీరుపోస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



నిర్మల్ పట్టణంలోని సోమవార్‌పేట్‌లో మురికి కాల్వను పరిశీలిస్తున్న మంత్రి అల్లోల, కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ



మేడ్చల్ జిల్లా బోడుప్పల్‌లో మాట్లాడుతున్న మంత్రి చామకూర మల్లారెడ్డి

# పరిశుభ్ర పట్టణాలుగా..

- చురుగ్గా పట్టణ ప్రగతి పనులు
- మెండుగా ప్రజల భాగస్వామ్యం
- పాల్గొంటున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

**నమస్తే తెలంగాణనెట్‌వర్క్:** పట్టణ ప్రగతి కార్యక్రమం చురుగ్గా సాగుతున్నది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని ముందుకు నడిపిస్తున్నారు. పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపడుతుండటంతో పట్టణాలన్నీ పరిశుభ్రంగా మారుతున్నాయి. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి కూడా విశేష స్పందన లభిస్తున్నది. ఎనిమిదో రోజైన సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సాహంగా పాల్గొన్నారు.

### చెత్త బుట్టల పంపిణీ: పువ్వాడ

ఖమ్మం జిల్లా మధిర పట్టణంలో సోమవారం నిర్వహించిన పట్టణ ప్రగతిలో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. స్థానిక సుందరయ్య నగర్‌లో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన మున్సిపల్ పార్క్‌ను ప్రారంభించి మొక్కలు నాటారు. మధిర చెరువును ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ మాదిరిగా తీర్చిదిద్దుతానని మంత్రి హామీనిచ్చారు. చెత్తను సేకరించేందుకు పట్టణంలో 22 వేల బుట్టలను ప్రజలకు అందించాలన్నారు. పట్టణ ప్రగతిలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన కోరారు.

### పారిశుద్ధ్య పనుల పరిశీలన: అల్లోల

నిర్మల్ జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్, బేస్త వార్‌పేట్ వార్డుల్లో కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీతో కలిసి దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటించారు. మురికి కాల్వలు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ తీరును పరిశీలించారు. కాల్వలో పేరుకుపోయిన ప్లాస్టిక్, చెత్తను తొలగించాలని అధికారులను ఆదేశించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో సోమవారం సాయంత్రం బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, స్థానిక ఎమ్మెల్యే సుంకె రవి శంకర్, కలెక్టర్ శశాంక పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డుల్లో తిరుగుతూ స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పట్టణాల అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని మంత్రి గంగుల కోరారు.



కరీంనగర్ జిల్లా చొప్పదండిలో పర్యటిస్తున్న మంత్రి గంగుల, కలెక్టర్, ఎమ్మెల్యే రవిశంకర్

### మౌలిక వసతుల కల్పన: మల్లారెడ్డి

మేడ్చల్ జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మేయర్ బుచ్చిరెడ్డితో కలిసి కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పట్టణ ప్రగతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పట్టణాలు, నగరాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులకు సూచించారు.

## సూర్యాపేటలో ఫ్లెక్సీల తొలగింపు

సూర్యాపేట పట్టణంలో సోమవారం ఫ్లెక్సీలను తొలగించారు. విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు తొలగించారు. పట్టణ ప్రగతిలో భాగంగా పలు వార్డుల్లో కౌన్సిలర్లు, అధికారులు ఇంటింటికీ తిరిగి కాటన్ చేతి సంచులను పంపిణీ చేశారు.



సూర్యాపేటలో ఫ్లెక్సీని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

## కండ్లల్లో కారంకొట్టి అరకిలో బంగారం చోరీ

**ఖమ్మంక్రైం:** వ్యాపారి కండ్లల్లో కారం కొట్టి బంగారం, నగదుతో ఉడాయించిన ఘటన ఖమ్మంలో సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన బంగారం హోల్‌సేల్ వ్యాపారి శ్రీపాల్ బంగారం కొనుగోలు చేసేందుకు సోమవారం విజయవాడ నుంచి ఖమ్మం వచ్చాడు. కొనుగోళ్లు పూర్తయిన అనంతరం విజయవాడకు వెళ్లేందుకు రాత్రి 7.45 గంటలకు శాతవాహన రైలుకోసం గాంధీచౌక్ మధ్యగేట్ నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు ఆగంతుకులు అతడి కండ్లల్లో కారంచల్లి గాయపరిచి.. అర్ధకిలో బంగారం, రూ.లక్షనగదు, సెల్‌ఫోన్, చేతిగడియారంతో ఉడాయించారు. అతడు స్పృహలోకి వచ్చాక త్రీటౌన్, జీఆర్పీ పోలీసులకు సమాచారమిచ్చారు. గాయాలతోఉన్న శ్రీపాల్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వదవాఖానకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

# కన్నతండ్రే కడతేర్చాడు

### కూతురిని పోషించలేకే ఘాతుకం
### రాధిక హత్యకేసులో వీడిన మిస్టరీ.. వివరాలు వెల్లడించిన సీపీ

**కరీంనగర్ క్రైం:** కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఇంటర్ విద్యార్థిని హత్య కేసులో తండ్రే హంతకుడని పోలీసులు నిర్ధారించారు. కూతురి వైద్యానికి ఖర్చు పెట్టలేక, పెండ్లికి కట్నం ఇచ్చుకోలేకే ఈ ఘాతుకానికి ఒడిగడినట్టు తండ్రి పేర్కొనడం విస్మయానికి గురిచేసింది. నిందితుడిని ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకొని సోమవారం మీడియా ఎదుట హాజరుపరిచారు. సీపీ కమలాసన్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో గతనెల 10న ఇంటర్ విద్యార్థిని ముత్త రాధిక(19) దారుణ హత్యకు గురైంది. ఈ ఘటనపై రాధిక తండ్రి కొమురయ్య పలువురిపై అనుమానం వ్యక్తం చేశాడు. హత్య చేసిన వ్యక్తి మూడు తులాల బంగారం, రూ.99 వేల నగదు ఎత్తుకెళ్లాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఎనిమిది బృందాలుగా ఏర్పడి వివిధ కోణాల్లో విచారణ జరిపారు. సుమారు 390 మందిని విచారించగా ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో హైదరాబాద్ ఫోరెన్సిక్ బృందాన్ని రంగంలోకి దింపి, మరోసారి ఆధారాల కోసం ప్రయత్నించారు. ఫోరెన్సిక్ బృందం జరిపిన దర్యాప్తులో పలు ఆధారాలు లభ్యమయ్యాయి. రాధిక తండ్రి కొమురయ్య బనియన్, దుప్పటిపై ఉన్న రక్తపు మరకలు, ఇంట్లో రాధిక హత్య జరిగినప్పటి రక్తపు మరకలు సేకరించి దర్యాప్తుచేశారు. రాధిక రక్తంలోని డీఎన్‌ఏ కొమురయ్య బనియన్‌పై లభ్యమైన రక్తపు మరకల డీఎన్‌ఏ ఒకటేనని నిర్ధారించుకున్నారు. సాంకేతికంగా కేసు నిర్ధారణ అయ్యేందుకు అవసరమైన ఆధారాలన్నీ సేకరించిన పోలీసులు, ఆదివారం బాలిక తండ్రిని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా హత్య చేసింది తానేనని అంగీకరించాడు.



రాధిక(ఫైల్)

### ఆర్థిక భారం మోయలేక..

హత్యకు గల కారణాలను కొమురయ్య వివరించిన తీరు పోలీసులను విస్మయానికి గురిచేసింది. రాధిక దివ్యాంగురాలు కావడంతో ఆమె ఆరోగ్యం కోసం డబ్బు ఖర్చు చేసిన కొమురయ్య ఆర్థికంగా నష్టపోయాడు. ఆమె వైకల్యం నుంచి బయటపడినా తరుచూ అనారోగ్యానికి గురవుతుండటంతో వైద్యం చేయించేందుకు డబ్బు అవసరం పడుతుందనీ, పెండ్లి చేసి పంపించినా కట్నం ఇవ్వాల్సి వస్తుందని భావించి ఎవరికీ అనుమానం రాకుండా తానే హత్య చేసినట్టు అంగీకరించాడు. హతుడి వాంగ్మూలం నమోదు చేసిన పోలీసులు సంబంధిత ఆధారాలు సేకరించారు. హత్యజరిగిన సమయంలో బంగారం, నగదును తానే దాచిపెట్టినట్టు కొమురయ్య అంగీకరించడంతో వాటిని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచారు. కేసులో దర్యాప్తు పూర్తయిందని, నిందితుడికి శిక్ష పడేందుకు అవసరమయ్యే అన్ని ఆధారాలను కోర్టుకు సమర్పిస్తామని సీపీ కమలాసన్‌రెడ్డి వెల్లడించారు.



కామారెడ్డి జిల్లా బాన్సువాడలో లబ్ధిదారుకు ఇంటి తాళాలు అందిస్తున్న స్పీకర్ పోచారం

## 'డబుల్' ఇండ్లతో నిరుపేదల కల సాకారం

### స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

**బాన్సువాడ రూరల్ /వర్ని:** గూడులేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ శివారులో ఐదువందల డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నిర్మించగా మొదటి విడుత కింద 163 ఇండ్లను జిల్లా కలెక్టర్ శరత్‌తో కలిసి సోమవారం లబ్ధిదారులకు కేటాయించారు. అంతకుముందు నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలోని వర్ని సొసైటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో స్పీకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం మాట్లాడుతూ.. 70 ఏండ్లలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా సీఎం కేసీఆర్ డబుల్‌బెడ్‌రూం ఇండ్లను అందజేసి పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు.

## గోవర్ధనగిరిధారిగా శ్రీలక్ష్మీనరసింహుడు



యాదాద్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆరో రోజైన సోమవారం శ్రీలక్ష్మీనరసింహుడు.. గోవర్ధనగిరిధారిగా భక్తులకు కనువిందు చేశారు. ఈ సందర్భంగా పల్లకీసేవలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. - యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తేతెలంగాణ

## ఎస్సారెస్పీకి చేరిన బాబ్లీ నీరు



మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయగా.. సోమవారం సాయంత్రానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 0.6 టీఎంసీల నీరు వచ్చి చేరింది. కాగా ఇక్కడి నుంచి 7,988 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతున్నది. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా, సోమవారం సాయంత్రానికి 1,079.80 అడుగుల (51.860 టీఎంసీల)కు చేరుకున్నది. - మెండోరా



## వైకల్యాన్ని జయించి శిఖరానికేగి..

అంగవైకల్యం అతడి లక్ష్యం ముందు తలవంచింది. ఓ కాలు, చెయ్యిలేకున్నా పట్టువదలని విక్రమార్కుడిలా ఆస్ట్రేలియా ఖండంలోనే అత్యంత ఎత్తైన మౌంట్ కోసియాస్కో శిఖరాన్ని అధిరోహించాడో వ్యక్తి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పీపల్‌పహాడ్‌కు చెందిన చిదుగళ్ల శేఖర్‌గౌడ్ ఫిబ్రవరి 28న మౌంట్ కొస్సియుస్కోను ఎక్కి ఈ అరుదైన ఘనత సాధించాడు. - చౌటుప్పల్ రూరల్


# కళేబరాలతో నూనె, దాణా

- అర్ధరాత్రి నుంచి ఐదింటి వరకు తయారీ
- కొత్తూరు పారిశ్రామికవాడలో పరిశ్రమ సీజ్

**కొత్తూరు:** రంగారెడ్డి జిల్లా కొత్తూరు పారిశ్రామిక వాడలో జంతు కళేబరాలతో నూనె, దాణా తయారుచేస్తున్న పరిశ్రమను అధికారులు సీజ్ చేశారు. జంతు కళేబరాలు, ఇతర వ్యర్థాలను రవాణా చేసే వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పరిశ్రమలో పనిచేస్తున్న ఏడుగురు కార్మికులను అరెస్టుచేశారు. కొత్తూరు మండలం తిమ్మాపూర్ చౌరస్తాలోని శివాలయం సమీపంలో పాతకేడియా ఆయిల్ మిల్ గోదాంను ఆరునెలల క్రితం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హరిప్రసాద్, నాగేశ్వర్‌రావు లీజుకు తీసుకున్నారు. హరి ప్రొటీన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో పరిశ్రమను స్థాపించారు. 20రోజులుగా అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున ఐదుగంటల వరకు పరిశ్రమ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో తీవ్రమైన దుర్వాసన వస్తుండటంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దుర్వాసన ఎక్కడినుంచి వస్తుందనే విషయాన్ని పసికట్టిన గ్రామస్థులు.. పరిశ్రమలోకి వెళ్లి చూడగా జంతు కళేబరాలు కనిపించాయి. వారు సోమవారం అధికారులకు ఫిర్యాదుచేశారు. తాసిల్దార్ శేరి వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో జ్యోతి, ఎంపీవో శ్రీనివాస్, ఏఎస్సై అబ్దుల్లా పరిశ్రమకు చేరుకొని వివరాలు సేకరించారు. కల్తీ నూనెలు, దాణా తయారవుతున్న ఆ పరిశ్రమను సీజ్‌చేశారు. పరిశ్రమ నిర్వాహకులు, లేబర్ కాంట్రాక్టర్ పరారీలో ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**జంతు కళేబరాలు, చికెన్ వ్యర్థాలు సేకరించి..**

విజయవాడ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని కబేళాల నుంచి జంతు కళేబరాలు, చికెన్ సెంటర్లలోని వ్యర్థాలను సేకరించి పరిశ్రమకు తీసుకొస్తారు. వ్యర్థాలను రోలింగ్ మెషిన్‌లో వేస్తారు. ఒకవైపు నూనెను, మరోవైపు కళేబరాలు, వ్యర్థాల పొడిని బయటకు తీస్తారు. ఈ పొడిని చేపలు, కోళ్లకు దాణాగా వాడుతారు. తక్కువ ధరకు నూనెను హోటళ్లకు సరఫరా చేస్తారు. వ్యర్థాలను ఇలా పొడిచేసే క్రమంలో భరించలేని దుర్వాసన వస్తుంది.



కల్తీనూనె, దాణా తయారీచేస్తున్న పరిశ్రమ



సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## స్వతంత్రంగా వ్యవహరించాలి

### మహిళా ప్రజాప్రతినిధులకు మంత్రులు ఎర్రబెల్లి, శ్రీనివాస్‌గౌడ్ సూచన

**నారాయణపేటప్రతినిధి,నమస్తేతెలంగాణ:** మహిళా ప్రజాప్రతినిధుల పరిపాలనా వ్యవహారాల్లో వారి భర్తలు, కుటుంబసభ్యులు జోక్యం చేసుకోవద్దని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. సోమవారం నారాయణపేటలోని జీపీ శెట్టి ఫంక్షన్‌హాలులో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పంచాయతీరాజ్ సమ్మేళనంలో మంత్రులు ప్రసంగించారు. రాష్ట్రాన్ని త్వరితగతిన అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. అంతకుముందు ఎక్లాస్‌పూర్‌లో ఏకోపార్క్ నిర్మాణానికి, సింగారం వద్ద అటవీ శాఖ గృహ నిర్మాణ సముదాయానికి మంత్రులు శంకుస్థాపనచేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# స్కల్ బ్రేకర్.. ఖబడ్దార్

- వైరల్‌గా మారుతున్న గేమ్‌తో జాగ్రత్త
- కఠిన చర్యలు తీసుకుంటామని సైబరాబాద్ కమిషనర్ హెచ్చరిక

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** సామాజికమాధ్యమాలు నేటి యువతకు ఎంత వినోదాత్మకంగా ఉంటున్నాయో అంతే ముప్పును కూడా కొనితెస్తున్నాయి. స్కల్‌బ్రేకర్ పేరిట వాట్సప్, ఫేస్‌బుక్‌లో ఇటీవల వైరల్‌అయిన ఓగేమ్‌తో విద్యార్థులు, యువత తమ ప్రాణాలమీదకి తెచ్చుకుంటున్నారు. చాలామందికి నడుము లేదా కాళ్లు విరుగుతుండగా, తలపగిలి ప్రాణాలు పోగొట్టుకున్నవారున్నారు. కుటుంబాల్లో కలవరం రేపుతున్న ఈ గేమ్‌పై నిత్యం నజర్ పెట్టాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ పిల్లల తల్లిదండ్రులకు, పాఠశాల ప్రిన్సిపాళ్లకు, కాలేజీ యాజమాన్యాలకు సూచించారు.

**స్కల్ బ్రేకర్ అంటే..**

ఈ చాలెంజ్‌లో ముగ్గురు వ్యక్తులు వరుసగా నిలబడతారు. మధ్యలో ఉన్న వ్యక్తి గాల్లోకి ఎగిరినప్పుడు పక్కనఉండే ఇద్దరు తమ కాళ్లతో అతని కాళ్లను కొట్టడానికి ప్రయత్నిస్తారు. ఎగిరిన వ్యక్తి తన్నులను తప్పించుకోవాలి. తప్పించుకోలేకపోతే కింద పడటం ఖాయం. ఆ సమయంలో తలకు, నడుముకు గాయాలయ్యే ప్రమాదం ఉంటుంది. నడుముకు తగిలే గాయాలతో అంగవైకల్యం, తలకుతగిలే గాయాలతో మెదడు నరాలు దెబ్బతిని శరీరం శాశ్వతంగా మొద్దుబారడం లేదా ప్రాణాలు పోయే అవకాశం ఉంటుంది.




స్కల్‌బ్రేకర్ చాలెంజ్‌లోని ఓ ఫీట్ ఇలా..

**ఆ వీడియోలు చేస్తే కఠినచర్యలు: సీపీ**

పిల్లలు ఇటువంటి ఆటలు ఆడకుండా తల్లిదండ్రులు, స్కూళ్లు, కాలేజీల యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సైబరాబాద్ పోలీస్‌కమిషనర్ సజ్జనార్ కోరారు. ఎవరైనా ఆ ఆటలాడి వీడియోలు తీసినా, వాటిని సోషల్‌మీడియాలో పోస్ట్ చేసినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి వీడియోలు ఎవరిదృష్టికైనా వస్తే వెంటనే 100కు ఫోన్ చేయాలని లేదా 9490617444కు వాట్సప్ ద్వారా సమాచారమివ్వాలని కోరారు.

## పస్రాలో ఫొటో జర్నలిస్టు దారుణ హత్య

**గోవిందరావుపేట:** ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రా గ్రామంలో వరంగల్‌కు చెందిన ఫొటో జర్నలిస్టు బొమ్మినేని సునీల్‌రెడ్డి(40) దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. హన్మకొండకు చెందిన దేవేందర్‌రెడ్డి పస్రాలోని బెంగళూరు బేకరి యజమాని దయాకు రూ.6 లక్షలు అప్పుగా ఇచ్చాడు. డబ్బులు చెల్లించాలని ఎన్నిసార్లు కోరిన దయా సమాధానం ఇవ్వకపోవడంతో సోమవారం దేవేందర్‌రెడ్డి తన స్నేహితుడైన సునీల్ రెడ్డిని పస్రాకు తీసుకువచ్చాడు. దయా వద్దకు వెళ్లిన తన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా తనకు వెంకన్న అనే చిట్టి వ్యాపారి డబ్బులు ఇవ్వాలని చెప్పడంతో దయాతోపాటు సునీల్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి కలిసి వెళ్లారు. తాను చిట్టి డబ్బులు కొన్ని దయాకు ఇచ్చానని, ఇంకా ఏమైనా బకాయి ఉంటే బిడ్డ పెండ్లి తర్వాత ఇస్తానని వెంకన్న చెప్పడంతో ఈ ముగ్గురు తిరిగి బేకరీకి చేరుకున్నారు. ఈ క్రమంలో బేకరీలో దేవేందర్‌రెడ్డి–దయా మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఒక్కసారిగా దయా దేవేందర్‌రెడ్డిపై కత్తితో దాడి చేసి గాయపర్చినట్టు తెలుస్తున్నది. అనంతరం దయా తన బేకరీ ముందు ఉన్న సునీల్‌రెడ్డిని మాట్లాడుదామని ఇంట్లోకి తీసుకెళ్లి గొంతుకోయడంతో అతడు అక్కడిక్కడే మృతి చెందగా దేవేందర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని దవాఖానకు తరలించారు. సంఘటన స్థలాన్ని ములుగు ఏఎస్పీ సాయిచైతన్య సందర్శించారు. పస్రా సీఐ అనుముల శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సునీల్‌రెడ్డి (ఫైల్)

# కార్పొరేట్ బాకీలు వచ్చేనా!

**రూ.10.52 లక్షల కోట్ల రుణాలపై ఆర్థిక మందగమనం ప్రభావం**

**డిఫాల్ట్‌కు అవకాశాలు: ఇండియా రేటింగ్స్**




**ముంబై, మార్చి 2:** దేశ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్న మందగమనం.. ఏకంగా పదిన్నర లక్షల కోట్ల రూపాయల కార్పొరేట్ రుణాలకు ఎసరు పెడుతున్నది. మార్కెట్‌లో నెలకొన్న సుదీర్ఘ ఆర్థిక ఇబ్బందులు రాబోయే మూడేండ్లకుపైగా కాలంలో సుమారు రూ.10.52 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలను రిస్కులో పెడుతున్నాయని ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్ తమ నివేదికలో తెలిపింది. మొత్తం కార్పొరేట్ రుణాల్లో ఇది 16 శాతం కావడం గమనార్హం. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో జీడీపీ గణాంకాలు ఏడేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ 4.7 శాతంగా నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించే పరిస్థితుల్లో కార్పొరేట్లు లేకుండా పోతున్నారని స్పష్టమవుతున్నది. ఆర్థిక ప్రతికూల పరిస్థితులు వ్యాపారావకాశాలను తీవ్రంగా దెబ్బ తీస్తుండగా, తీసుకున్న అప్పుల్ని చెల్లించలేక కార్పొరేట్లు చేతులు ఎత్తేస్తున్నది చూస్తూనే ఉన్నాం. మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) ఇప్పటికే బ్యాంకింగ్ రంగ ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక మందగమన పరిస్థితులు బ్యాంకింగ్ వ్యవస్థకు మరింత ముప్పు తెచ్చి పెట్టేలా ఉన్నాయి. నిర్మాణ, విద్యుత్, ఆటో, ఆటో అనుబంధ రంగాలు, టెలికం, మౌలిక తదితర 11 రంగాల్లో ఆస్తుల విలువ, రుణాల మంజూరుకున్న అనుకూల-ప్రతికూల పరిస్థితులను ఇండియా రేటింగ్స్ విశ్లేషించింది. దాదాపు 25 శాతం రుణాలు వసూలు కావడం కష్టమేనని గుర్తించినట్లు చెప్పింది. దీనివల్ల అదనంగా రూ.2.54 లక్షల కోట్ల రుణాలు ఇబ్బందుల్లో పడుతున్నాయని స్పష్టం చేసింది. అయితే ఆర్థిక పరిస్థితులు చక్కబడితే కొంతలో కొంత నయమని పేర్కొన్నది. నిధుల కొరతను ఎదుర్కొంటున్న రియల్టీ, పవర్, టెలికం, మౌలిక రంగాల్లో ఇప్పటికే చాలా సంస్థలు తీసుకున్న అప్పులను చెల్లించలేక దివాలా తీస్తుండగా, మరికొన్ని రుణ పునర్వ్యవస్థీకరణకు వెళ్తున్న విషయం తెలిసిందే.

### రికవరీకి ఐబీసీనే ఉత్తమం

బాకీల వసూలుకు దివాలా చట్టమే (ఐబీసీ) ఉత్తమ మార్గమని ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబీబీఐ) చీఫ్ ఎంఎస్ సాహూ అన్నారు. రుణదాతలు గరిష్ఠంగా వివిధ కేసుల్లో రూ.1.6 లక్షల కోట్ల వసూళ్లు చేసినట్లు గుర్తుచేశారు. గతేడాది డిసెంబర్ నాటికి రిజల్యూషన్ ప్లాన్ల ద్వారా 190 కంపెనీలు బయటపడ్డాయని తెలిపారు. 2016లో ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ కోడ్ (ఐబీసీ) అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే.

# పాతాళంలోకి..!




## తయారీ రంగం కుదేలు

**చైనాలో** కరోనా సృష్టిస్తున్న బీభత్సం.. భారతీయ తయారీ రంగాన్ని కుదేలు చేస్తున్నది. దేశ జీడీపీలో సేవా రంగం తర్వాత తయారీ రంగానిదే అగ్రభాగం. భారత ఉత్పాదక రంగానికి మూల వనరుగా చైనానే ఉన్నది. కీలక రంగాలన్నింటికి ఇక్కడి నుంచే ముడి సరుకు అందుతున్నది. కానీ కరోనా తీవ్రతకు చైనా కర్మాగారాలన్నీ మూతబడ్డాయి. దీంతో అక్కడి నుంచి వచ్చే విడిభాగాల సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా భారత్‌లో తయారీ మందగిస్తున్నది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్స్ రంగాలపై ఈ ప్రభావం ఎక్కువగా పడుతున్నది. మిగతా రంగాలపైనా కరోనా ఛాయలు కనిపిస్తుండగా, ఇది జీడీపీని కుంగదీస్తున్నదని యూబీఎస్ తెలిపింది. 'భారత ఆర్థిక వ్యవస్థపై కరోనా ప్రభావాన్ని అంచనా వేస్తున్నాం. 0.2 శాతం మేర ప్రభావితం కావచ్చన్నది ప్రాథమిక అంచనా' అని యూబీఎస్ వ్యాఖ్యానించింది.

## వృద్ధిరేటుకు కరోనా కష్టాలు

ఈ జనవరి-మార్చి జీడీపీపై ప్రభావం

మరింత తగ్గొచ్చంటున్న యూబీఎస్ సెక్యూరిటీస్

**2019-20 జీడీపీ గణాంకాలు**

| త్రైమాసికం | అంచనా | సవరణ అంచనా |
|---|---|---|
| ఏప్రిల్-జూన్ | 5 శాతం | 5.6 శాతం |
| జూలై-సెప్టెంబర్ | 4.5 శాతం | 5.1 శాతం |
| అక్టోబర్-డిసెంబర్ | 4.7 శాతం | -- |

**ముంబై, మార్చి 2:**

మూలిగే నక్కమీద తాటి పండు పడ్డ చందంగా తయారవుతున్నది దేశ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి. అసలే మందగమనంతో సతమతమవుతున్న భారత జీడీపీని ఇప్పుడు కరోనా వైరస్ కాటేస్తున్నది మరి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20)లో గడిచిన మూడు త్రైమాసికాల్లోనూ వృద్ధిరేటు క్రమేణా క్షీణించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా క్యూ3 (అక్టోబర్-డిసెంబర్) జీడీపీ ఏడేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ 4.7 శాతానికే పరిమితమైన సంగతీ విదితమే. ఈ క్రమంలో ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో వృద్ధిరేటు మరింత పడిపోయే వీలుందని, అంటువ్యాధి ప్రభావంతో 0.20 శాతం దిగజారే వీలుందని సోమవారం యూబీఎస్ సెక్యూరిటీస్ తమ తాజా నివేదికలో అంచనా వేసింది. ఈ క్రమంలో మొత్తం ఈ ఆర్థిక సంవత్సరానికిగాను వేసిన అంచనాలూ తలకిందులయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దశాబ్దకాలం కనిష్ఠ స్థాయిలో 5 శాతంగా నమోదు కావచ్చని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. కానీ కరోనా దెబ్బకు ఇంకా తగ్గిపోవచ్చని జాతీయ, అంతర్జాతీయ నిపుణుల అంచనా.

### ఈసారి 4.9 శాతమే: ఫిచ్

ఈ ఆర్థిక సంవత్సరం భారత జీడీపీ 4.9 శాతంగానే ఉండొచ్చని ఫిచ్ సొల్యూషన్స్ అంచనా వేసింది. దేశీయ మార్కెట్‌లో పడిపోయిన డిమాండ్, కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో చైనా నుంచి ముడి సరుకు సరఫరా ఇబ్బందుల మధ్య గత అంచనాలను సోమవారం సవరించింది. ఇంతకుముందు 5.1 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21) అంచనాలకూ ఫిచ్ కోత పెట్టింది. 5.9 శాతం నుంచి 5.4 శాతానికి కుదించింది. మరోవైపు యూబీఎస్ సైతం 5.7 శాతం నుంచి 5.6 శాతానికి దించింది.

### కేంద్ర బడ్జెట్ తుస్సు

మందగమనంలో ఉన్న దేశ జీడీపీకి కేంద్ర బడ్జెట్ ఊతమివ్వలేకపోయిందని ఫిచ్ పెదవి విరిచింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అయితే ఈ బడ్జెట్.. వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ఉత్సాహం నింపలేకపోయిందని, దీనివల్లే వృద్ధిరేటుకు కోత పెట్టాల్సి వస్తుందని ఫిచ్ చెప్పింది. బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు సంక్షోభంలో చిక్కుకున్నాయని, ఈ ప్రభావం పరిశ్రమపై పడుతున్నదని, ఇందుకు బడ్జెట్ పరిష్కారం చూపలేకపోయిందని విమర్శించింది.

### ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెను నష్టం

**కరోనా** వైరస్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే గడగడలాడిస్తున్నది. చైనాలో పుట్టిన ఈ మహమ్మారి.. ఇతర దేశాలకూ వేగంగా విస్తరిస్తుండటంతో ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలూ ప్రభావితమవుతున్నాయి. ఈ క్రమంలో ప్రపంచ జీడీపీ ఈ ఏడాది 2.4 శాతానికి పరిమితం కావచ్చని గ్లోబల్ ఏజెన్సీ ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) అంచనా వేసింది. వైరస్ అదుపులోకి రాకపోతే 1.5 శాతానికి పతనమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. 2008 నాటి ప్రపంచ ఆర్థిక మాంద్యం కంటే కరోనా సృష్టిస్తున్న బీభత్సం ఎక్కువని చెప్పింది.



# పసిడి మరింత ప్రియం

**రూ.391 పెరిగిన తులం ధర**

**రూ.713 అధికమైన కిలో వెండి**

**న్యూఢిల్లీ, మార్చి 2:** గత కొన్ని రోజులుగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడం, దేశీయంగా పెళ్లిళ్ల సీజన్ కూడా తోడవడంతో ధరలు అమాంతం పుంజుకున్నాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.391 ఎగబాకి రూ.42,616 పలికింది. పసిడితో వెండి మరింత పుంజుకున్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి లభించిన కొనుగోళ్ల మద్దతుతో కిలో వెండి రూ.713 పెరిగి రూ.46,213 పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు అమాంతం పెరుగడం వల్లనే దేశీయంగా అధికమయ్యాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ఉన్నతాధికారి తపన్ పటేల్ తెలిపారు. న్యూయార్క్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,604 డాలర్లకు, వెండి 17 డాలర్లకు చేరుకున్నాయి. గతవారంలో 1,585 డాలర్లుగా ఉన్నాయి.

# స్టార్టప్‌లకు ప్రోత్సాహం

ఐఐటీ హైదరాబాద్‌తో ఎన్ఎండీసీ ఒప్పందం

**హైదరాబాద్,నమస్తే తెలంగాణ:** జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ(ఎన్ఎండీసీ) స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి ముందుకొచ్చింది. వచ్చే ఐదేండ్లలో కనీసంగా 15 స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి రూ.10 కోట్లతో ప్రత్యేక ఫండ్‌ను ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా సోమవారం ఎన్ఎండీసీ కార్యాలయంలో ఐ- టీఐసీ, ఐఐటీ హైదరాబాద్ , ఎన్ఎండీసీల స్టార్టప్ ఎకో సిస్టంను అభివృద్ధి చేసే ఒప్పందంపై ఎన్ఎండీసీ సీఎండీ బైజేంద్ర కుమార్ సమక్షంలో సంతకం చేశారు. ఈ ఒప్పందంపై ఎన్ఎండీసీ నుంచి డైరెక్టర్ పీకే శత్పథి, ఐఐటీ డైరెక్టర్ బీఎస్ మూర్తిలు సంతకం చేశారు. దీని ద్వారా ఐదు సంవత్సరాల్లో 15 స్టార్టప్‌లకు ప్రోత్సాహకం అందించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్టార్టప్ ఇండియా కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఎన్ఎండీసీ సీఎండీ తెలిపారు.

# ద్విచక్ర విక్రయాలు డౌన్

**న్యూఢిల్లీ, మార్చి 2:** ప్రముఖ ద్విచక్ర వాహనాలకు అమ్మకాల్లో ఎదురుదెబ్బలు తగిలాయి. గత నెలలో హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, టీవీఎస్ మోటర్ల విక్రయాలు రెండంకెల స్థాయిలో పడిపోయాయి. బీఎస్-6 ప్రమాణాలకు అనుగుణంగా వాహనాలను తయారు చేయడం, మరోవైపు కరోనా వైరస్‌తో విడిభాగాల సరఫరాలో నెలకొన్న జాప్యం అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపాయి. మరోవైపు సుజుకీ మోటర్‌సైకిల్, రాయల్ ఎన్‌ఫీల్డ్ విక్రయాల్లో వృద్ధిని నమోదు చేసుకున్నాయి. ఫిబ్రవరి నెలలో హీరో మోటోకార్ప్ 4,98,242 యూనిట్ల వాహనాలను మాత్రమే విక్రయించింది. ఏడాది క్రితం ఇదే నెలలో విక్రయించిన 6,17,215 యూనిట్లతో పోలిస్తే 19.27 శాతం తగ్గాయి. వీటిలో మోటర్‌సైకిల్ సేల్స్ ఏడాది ప్రాతిపదికన 14.23 శాతం తగ్గి 4,79,310కి జారుకోగా, స్కూటర్ సేల్స్ 67.54 శాతం తగ్గి 18,932లకు పరిమితమయ్యాయి. కరోనా వైరస్‌తో టీవీఎస్ మొత్తం వాహన అమ్మకాలు 15 శాతం పడిపోయాయి. వీటిలో ద్విచక్ర వాహన విక్రయాలు 17.4 శాతం తగ్గుముఖం పట్టగా, త్రిచక్ర వాహన సేల్స్ మాత్రం 26 శాతం పెరిగాయి. వీటితోపాటు బజాజ్ ఆటో అమ్మకాలు కూడా ఏడాది ప్రాతిపదికన 10 శాతం తగ్గి 3,54,913లకు పడిపోయాయి. వీటిలో దేశీయ అమ్మకాలు 24 శాతం పడిపోయి 1,68,747లకు జారుకున్నాయి. ప్రీమియం బైకుల తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ కేవలం ఒక్క శాతం వృద్ధితో 63,536ల అమ్మకాలు జరిపింది.

## ఎన్పీఆర్ లేఖ ఆప్షన్ మాత్రమే

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎస్బీఐ ఖాతాదారులను కేవైసీ అప్‌డేషన్‌లో భాగంగా సమర్పించాలని కోరిన గుర్తింపుపత్రాల్లో ఎన్పీఆర్ లేఖ అనేది ఒక ఆప్షన్ మాత్రమేనని హైకోర్టు స్పష్టంచేసింది. ఎన్పీఆర్ లేఖ కాకుండా ఇతర పత్రాలైన డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్, ఉపాధి హామీ కార్డు తదితరాల్లో ఏదైనా ఒకటి సమర్పిస్తే సరిపోతుందని తెలిపింది. ఎన్పీఆర్ లేఖ తప్పనిసరి అని ఎస్బీఐ తన నోటీసులో పేర్కొనలేదని తెలిపింది. ఎన్పీఆర్ లేఖ అనే ఆప్షన్ వదిలేసినా ఏమీకాదని, బ్యాంకు అకౌంట్లు నిలిచిపోవని పేర్కొన్నది. ఎస్బీఐ నోటీసును పిటిషనర్ తప్పుగా అర్థం చేసుకున్నారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎన్పీఆర్ ప్రక్రియే ప్రారంభం కానప్పుడు ఎన్పీఆర్ నమోదు లేఖ ఎక్కడి నుంచి వస్తుందని ధర్మాసనం ప్రశ్నించింది. ఎన్పీఆర్ లేఖకు సంబంధించి పిటిషన్ ఇచ్చిన నోటీసుకు అనుమానాలు నివృత్తిచేసేలా వివరణ ఇవ్వాలని ఎస్బీఐకి హైకోర్టు ఆదేశాలు జారీచేస్తూ.. పిటిషన్ విచారణను ముగించింది.

# 'వివాద్ సే విశ్వాస్' భేష్

## సమయం, డబ్బు రెండూ ఆదా

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ, మార్చి 2:** 'వివాద్ సే విశ్వాస్' పథకంతో సమయం, డబ్బు రెండూ ఆదా అవుతాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఈ ప్రత్యక్ష పన్ను వివాదాల పరిష్కార పథకాన్ని గత నెల 1న పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రకటన సందర్భంగా పరిచయం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ పథకంతో ఎన్నో లాభాలున్నాయని, ఈ పథకాన్ని ఎంచుకుంటే పన్ను కేసుల్లో పోరాడుతున్నవారికి సమయం, డబ్బూ రెండూ మిగిలే వీలుందన్నారు. సోమవారం లోక్‌సభలో 'వివాద్ సే విశ్వాస్' బిల్లు 2020ని ప్రవేశపెడుతూ 'పన్ను వివాదాలను ఎదుర్కొంటున్నవారికి ఈ పథకం ఓ పరిష్కార మార్గం. కేసులను పరిష్కరించుకోవడానికి సమయం, డబ్బు వృథా చేసుకోవాల్సిన అవసరం లేదు' అని నిర్మల అన్నారు. లిటిగేషన్లను తగ్గించాలనే తమ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్న ఆమె.. పరోక్ష పన్ను వివాదాల కోసమూ ఈ తరహా ఓ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు గుర్తుచేశారు. కమిషనర్ (అప్పీల్స్), ఐటీఏటీ, హైకోర్టులు, సుప్రీం కోర్టు, రుణ రికవరీ ట్రిబ్యునళ్ల వంటి వివిధ అప్పీలేట్ ఫోరమ్స్ వద్ద గరిష్ఠంగా రూ.9.32 లక్షల కోట్ల విలువైన 4.83 లక్షల ప్రత్యక్ష పన్ను కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా, 'వివాద్ సే విశ్వాస్' పథకం కింద ఈ నెలాఖరుకల్లా వివాదంలో ఉన్న పన్ను మొత్తాన్ని చెల్లించినట్లైతే దానిపై వడ్డీ, జరిమానాలను పూర్తిగా రద్దు చేసుకోవచ్చు. జూన్ 30దాకా ఈ పథకం అందుబాటులో ఉండనున్నది. ఇదిలావుంటే ఈ బిల్లును ప్రవేశపెడుతున్న సమయంలో ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. ఢిల్లీ అల్లర్లకు బాధ్యత వహిస్తూ హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ డిమాండ్ చేశారు.

### 6.35 కోట్ల ఐటీ రిటర్నులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20)లో ఫిబ్రవరి ప్రథమార్ధం నాటికి ఎలక్ట్రానిక్ వేదికల ద్వారా గరిష్ఠంగా 6.35 కోట్ల ఆదాయం పన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలైయ్యాయి. ఈ మేరకు ఓ లిఖితపూర్వక సమాధానంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ సోమవారం లోక్‌సభలో తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం 6.28 కోట్లుగానే ఉన్నట్లు చెప్పారు.

# ప్రారంభ లాభాలు ఆవిరి

**ముంబై, మార్చి 2:**

కరోనా కేసులతో చివరి గంటలో అమ్మకాలు ● సెన్సెక్స్ 153, నిఫ్టీ 69 పాయింట్ల నష్టం

ఉదయం 9.15 గంటలు..యథాతథంగా స్టాక్ మార్కెట్లు ప్రారంభమయ్యాయి. ప్రారంభమైన నిమిషంలోనే 750 పాయింట్లకు పైగా దూసుకుపోవడంతో మదుపరుల సంపద అమాంతం రూ.2.5 లక్షల కోట్లకు పైగా పెరిగింది. మధ్యాహ్నం వరకు జోరుగా కొనసాగిన సూచీలకు ఆ తర్వాత అనుకొని షాక్ తగిలింది. చైనాను పట్టిపీడిస్తున్న కరోనా వైరస్ భారత్‌కు కూడా అంటుకుందన్న వార్తలు మదుపరులను ఆందోళనకు గురిచేసింది. ఫలితంగా అప్పటి వరకు కొనుగోళ్లకు మొగ్గుచూపిన దలాల్‌స్ట్రీట్ వర్గాలు ఆ తర్వాత అమ్మకాలకు పాల్పడ్డారు. గత వారంలో ఏకంగా 3 వేల పాయింట్లకు పైగా నష్టపోయిన సూచీలు ఈవారం ప్రారంభంలోనే కరోనా వైరస్ భారీ లాభాలకు బ్రేక్‌వేసింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు కూడా తోడవడంతో ఈ పతనానికి ఆజ్యంపోసింది. ఒక దశలో 785 పాయింట్లకు పైగా లాభపడిన సూచీలు చివరి గంటలో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో నష్టాల్లో కూరుకుపోయింది. వరుసగా ఏడో రోజు బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 153.27 పాయింట్లు పతనం చెంది 38,144.02 వద్ద ముగిసింది. 400 పాయింట్ల స్థాయిలో కదలాడిన జాతీయ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ చివరకు 69 పాయింట్లు కోల్పోయి 11,132.75 వద్ద స్థిరపడింది. గత శుక్రవారం సెన్సెక్స్ 1,448.37 పాయింట్లు లేదా 3.64 శాతం, నిఫ్టీ 431.55 పాయింట్లు లేదా 3.71 శాతం నష్టపోయిన విషయం తెలిసిందే.



### కరోనా ముంచింది..

భారత్‌లో రెండు కరోనా వైరస్ కేసులు నిర్ధారణ అయినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించడం మార్కెట్లో ప్రకంపనాలు సృష్టించింది. అప్పటి వరకు భారీ లాభాల్లో కొనసాగిన సూచీలు ఒక్కసారిగా కుదుపునకు గురయ్యాయని జియోజిట్ ఫైనాన్షియల్ అధినేత వినోద్ తెలిపారు. రంగాలవారీగా చూస్తే మెటల్, చమురు అండ్ గ్యాస్, బేసిక్ మేటిరియరల్, యుటిలిటీ, ఎనర్జీ, టెలికం రంగ షేర్లు రెండు శాతానికి పైగా పతనమవగా.... టెక్, ఐటీ రంగ షేర్లు మాత్రం మదుపరులను ఆకట్టుకున్నాయి. ఎస్బీఐ, టాటా స్టీల్, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, ఓఎన్‌జీసీ, ఇండస్ఇండ్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, స్పైస్‌జెట్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, షేర్లు నష్టపోగా,మరోవైపు హెచ్‌సీఎల్ టెక్, నెస్లె ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్‌ల షేర్లు లాభాల్లో ముగిశాయి. అలాగే గత నెలకుగాను తయారీ రంగ గణాంకాలు 55.3 నుంచి 54.5కి తగ్గినట్లు పీఎంఐ ఇండెక్స్ వెల్లడించడం కూడా మార్కెట్ల పతనానికి పరోక్షంగా కారణమయ్యాయి.

### రూపాయి ఢమాల్

రూపాయికి మరిన్ని చిల్లులు పడ్డాయి. ప్రారంభంలో లాభపడిన మారకం విలువ చివరకు భారీగా నష్టపోయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 52 పైసలు పడిపోయి 72.76 వద్ద ముగిసింది. 72.78 కనిష్ఠ స్థాయికి జారుకున్న రూపాయి విలువ చివరకు 72.76 వద్ద ముగిసింది. తీవ్ర ఒడిదుడుకులకు లోనైన రూపాయి విలువ ఆసియాలోని కరెన్సీల్లో ఒక్కటే నష్టపోయిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ హెడ్ వీకే శర్మ తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
e- ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
e-NIT No.135 TO 138/SE/R&B/ Elec/Hyd/2019-20 తేది: 29-02-2020
పనుల సంఖ్య(4) పనుల పేరు: హైకోర్టు, హైదరాబాద్ పరిధిలో 1) లిఫ్టుల యొక్క విస్తృత స్థాయి నిర్వహణ మరియు నెలవారీ సర్వీసింగ్, 2)HTVCB'ల యొక్క పునస్థాపన, 3) బైబ్యాక్ ప్రాతిపదికన నూతన 250KVA DG సెట్ ఏర్పాటు మరియు 4) అద్దె ప్రాతిపదికన అయిదుగురు నైపుణ్యం గల ఎలక్ట్రీషియన్స్ మరియు అయిదుగురు హెల్పర్స్‌ను నియమించుట ద్వారా ఇరవై నాలుగు గంటల సేవల ఏర్పాటు. మొత్తం ECV సుమారుగా: 86.02 లక్షలు. టెండర్ స్వీకరణకు చివరి తేది మరియు సమయం: 06-03-2020న మ||1.00 గం||. తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్: www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చు. సంప్ర ఫోన్ నం: 9440818170.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, R&B ఎలక్ట్రికల్ సర్కిల్, హైదరాబాద్
DIPR R.O.No. 2567-DP/CL/ Advt/1/2019-20, Dt: 02/03/2020.

# రూ:20కి 150 కి.మీ

**రాష్ట్ర మార్కెట్‌లోకి రివోల్ట్ ఈవీ బైకు**

**హైదరాబాద్, మార్చి 2:** రాష్ట్ర మార్కెట్లోకి ఎలక్ట్రిక్ బైకులను విడుదల చేసింది రివోల్ట్ ఇంటెల్లి కార్ప్. రెండు రకాల్లో విడుదల చేసిన ఈ బైకుల్లో ఆర్వీ400 ధర రూ.1,03,999(నెలకు రూ. 3,999 చొప్పున 38 నెలలపాటు), మరో మోడల్ ఆర్వీ 300 రూ. 84,999(నెలకు రూ.2,999 చొప్పు న 36 నెలలపాటు)గా నిర్ణయించింది. ఇదివరకే ఢిల్లీ, పుణె ల్లో విడుదల చేసిన ఈరెండు రకాల బైకులకు వినియోగదారుల నుంచి విశే ష స్పందన లభించిందని, హైదరాబాద్‌లో ఉన్న కస్టమర్లను ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడి మార్కెట్లోకి ప్రవేశించినట్లు రివో ల్ట్ ఫౌండర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ బైకును కొనుగోలు చేసిన వారు రిజిస్ట్రేషన్/ఆర్టీవో, బీ మా, స్మార్ట్‌కార్డ్‌కోసం అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫేమ్-2 కింద ఇచ్చే సబ్సిడీ తగ్గించిన తర్వాతనే ఈ ధరను నిర్ణయించింది. గంటకు 85 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఈ బైకు బ్యాటరీని ఒక్కసారి రీచార్జి చేస్తే 150 కిలోమీటర్ల దూరం ప్రయాణించనున్నదన్నారు. 4.5 గంటల్లో ఈ బైకు బ్యాటరీ పూర్తిగా చార్జికానున్నది. నోయిడాలో ఉన్న ప్లాంట్లో ఈ బైకులను తయారు చేస్తున్నట్లు, ప్రస్తుతానికి ఈ బైకులకు అత్యధికంగా డిమాండ్ ఉండటంతో వెయింటింగ్ పీరియడ్ ఐదు నెలలు ఉండగా, దీనిని త్వరలో మూడు నెలలకు తగ్గించనున్నట్లు ఆయన ప్రకటించారు.



**హైదరాబాద్ మార్కెట్లోకి ఆర్వీ400 బైకును విడుదల చేస్తున్న రివోల్ట్ ఫౌండర్ రాహుల్ శర్మ. చిత్రంలో డీఐజీ శివ కుమార్, తదితరులు.**

# బేరాలు పోతున్నాయ్

నిరసనలు, అల్లర్లతో వ్యాపారాలు ప్రభావితం

కోకాకోలా సీఈవో జేమ్స్ ఆందోళన

**ముంబై, మార్చి 2:** నిరసనలు, అల్లర్లు వ్యాపారాలను వివిధ స్థాయిల్లో దెబ్బ తీస్తున్నాయని గ్లోబల్ బేవరేజెస్ దిగ్గజం కోకాకోలా చైర్మన్, సీఈవో జేమ్స్ క్విన్సీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సోమవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఇటీవలి కాలంలో భారత్‌లోని పరిస్థితులు, ప్రస్తుతం పలుచోట్ల జరుగుతున్న ఆందోళనలపట్ల స్పందించారు. సమాజంలో ఎక్కడ ఎలాంటి అంతరాయాలు ఏర్పడినా.. వాటి ప్రభావం వ్యాపారాలపై ఏదో ఒక రకంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం భారతీయ మార్కెట్ తమకు ఐదో అతిపెద్ద మార్కెట్ అన్న ఆయన వచ్చే ఐదేండ్లలో అమ్మకాలను రెండింతలు చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. 1 బిలియన్ కేస్ యూనిట్ అమ్మకాల మార్కును 2019లో అధిగమించామని, ఈ ఘనత సాధనకు 21 ఏండ్లు పట్టిందన్నారు.

# కాస్ట్యూమ్స్ డిజైనింగ్‌లో దిట్ట

**కర్ణాటక మంత్రి శ్రీరాములు కుమార్తె రక్షిత పెండ్లి త్వరలో జరగనున్నది. ఈ పెండ్లి బడ్జెట్ ఎంతో తెలుసా? రూ.500 కోట్లట. అంత గ్రాండ్‌గా జరుగుతున్న ఈ పెండ్లికి కాస్ట్యూమ్స్ డిజైన్ చేసేది మాత్రం ఈమెనే. పేరు సానియా సర్దారియా. పెండ్లిళ్లూ, ఫంక్షన్లే కాదు.. సినిమాలకూ కాస్ట్యూమ్స్ డిజైన్ చేస్తుంటుంది సానియా.**





కన్నడ సినీ ఇండస్ట్రీలో పరిచయం అక్కర్లేని పేరు సానియా సర్దారియాది. సినీ చరిత్రలో ఓ మైలు రాయిగా నిలిచిపోయిన 'కేజీఎఫ్-1' సినిమాకు కాస్ట్యూమ్స్ డిజైన్ చేసింది సానియానే. ఇప్పుడు రెండో పార్ట్‌కు కూడా ఆమే డిజైనర్‌గా వ్యవహరిస్తున్నది. 'సానియా చేయిపడితే హీరో డ్రెస్‌తో పాటు.. సినిమా కూడా సూపర్ హిట్టు' అనే పేరు తెచ్చుకున్నది. కన్నడలో కొత్త హీరోలు మొదలుకొని.. స్టార్ హీరోల సినిమాలకూ కాస్ట్యూమ్స్ డిజైన్ చేస్తుంటుంది సానియా. అందుకే ఇంతపెద్ద పెండ్లి కాంట్రాక్ట్ సానియాకు ఇచ్చారు. ఈమె భర్త ఇమ్రాన్ సర్దారియా. కన్నడ ఇండస్ట్రీలో కొరియోగ్రాఫర్‌గా కెరీర్‌ను మొదలుపెట్టి దర్శకుడిగా రాణిస్తున్నాడు. కన్నడ సూపర్‌స్టార్ 'యశ్' కుటుంబానికి సానియా చాలా దగ్గర. యశ్ ఇంట్లో జరిగే ఏ శుభకార్యమైనా సానియా కాస్ట్యూమ్స్ బాధ్యత చూసుకోవాల్సిందే. కాస్ట్యూమ్స్, మేకప్‌పై సానియాకు బాగా పట్టుంది. దీపికా పదుకొణె పెండ్లికి మేకప్ బాధ్యతలు చూసుకుంది సానియా. అందుకే పట్టుబట్టి మరీ మంత్రి శ్రీరాములు తన కూతురు పెండ్లి దుస్తులను ప్రత్యేకంగా సానియాతో డిజైన్ చేయిస్తున్నారు. ఈనెల 5న బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ఈ పెండ్లి జరగనున్నది. 'వెడ్డింగ్ జర్నల్స్ ఆఫ్ ఇండియా' ఫేం జయరామన్ పిళ్లై ఫొటోగ్రఫీ చేయనున్నారు. ఈ పెండ్లికి బాలీవుడ్, శాండల్‌వుడ్ నటీనటులతో పాటు పార్టీలకు అతీతంగా ప్రముఖ రాజకీయ నాయకులూ హాజరుకానున్నారు. యునెస్కో గుర్తించిన చారిత్రక కట్టడాల జాబితాలోని హంపి విట్టల ఆలయ సెట్టింగ్‌ను కల్యాణ మండపంగా ఏర్పాటు చేశారు. గాలి జనార్దన్ రెడ్డి అనుచరుడైన శ్రీరాములు సైతం కుమార్తె వివాహాన్ని దాదాపు అంతే ఘనంగా నిర్వహించనున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

# శిబులాల్ బంగారుబాట

**కేరళకు** చెందిన కుమారి శిబులాల్‌ది పేద కుటుంబం. చదువుకోవడానికి ఎన్నో బాధలు పడింది. సరిగా పంటలు పండక ఆమె తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆమెను చదివించేందుకు తల్లిదండ్రులు సొంత ఇంటిని అమ్మేశారు. అప్పుడే శిబులాల్ బాగా చదివి డబ్బు సంపాదించాలనుకున్నది. అందుకోసం పట్టుదలతో చదివి కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం సంపాదించింది. దీంతో శిబులాల్ కుటుంబం పడిన కష్టాలు తొలగిపోయాయి. ఆర్థిక సమస్యలకు, సమాజంలో ఉన్నతంగా బతకడానికి విద్య ఒక్కటే మార్గమని గ్రహించింది. 'పేదరికం ఎంతోమందిని చదువుకోకుండా ఆపేసింది. అటువంటి బాధలు మరెవరూ పడకూడదు. చదువు లేకపోతే భవిష్యత్‌లో ఏమీ సాధించలేం. నేనూ అటువంటి సమస్యలను పడ్డా, స్కాలర్‌షిప్‌తోనే నా చదువును పూర్తి చేశా' అని శిబులాల్ అంటున్నది. చదువు విలువేంటో తెలుసుకున్న ఆమె పేద పిల్లలకు ఉపకారవేతనాలు అందించాలనుకున్నది. అందుకోసం మొదట 'సరోజినీ దామోదరన్ ఫౌండేషన్' పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది. ఆ తర్వాత విద్యాధాన్, విద్యారక్షక్, అద్వైత్ ఫౌండేషన్, అంకుర్ ఫౌండేషన్‌లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా శిబులాల్ వేలాదిమంది పేద చిన్నారులకు ఆర్థిక సాయం అందిస్తూ వారి ఉజ్వలమైన భవితకు బాటలు వేస్తున్నది.


**వ్యవయసాయాధారిత కుటుంబంలో పుట్టిన ఆమెకు చదువు పట్ల ఎంతో ఆసక్తి ఉండేది. చదువుకోవడానికి మరెవరూ తనలా ఇబ్బందులు పడకూడదనుకున్నది. అటువంటివారికి తన వంతు సాయం అందిస్తూ వేలాదిమంది పిల్లలను ఉన్నత చదువులవైపు నడిపిస్తున్నది.**



WWW. NTNEWS.COM
/nt.zindagi
నమస్తే తెలంగాణ
మంగళవారం 3 మార్చి 2020

# జిందగీ

వరల్డ్ హియరింగ్ డే



**సర్వేంద్రియాలు పనిచేస్తేనే సృష్టి మాధుర్యాన్ని ఆస్వాదించగలం. వాటిల్లో ఏ ఒక్కటి పని చేయకపోయినా.. ఆ బాధ వర్ణనాతీతం. ప్రత్యేకించి వినికిడి శక్తి లేకపోతే గొంతు మూగబోతుంది. వెరసి.. పసితనం నుంచి వృద్ధాప్యం వరకూ జీవితమంతా నిశ్శబ్దమే. తమలోని భావాన్ని వ్యక్తం చేయడం వారికి బతుకంతా భారమే. అలాంటి వారికి ఆశ్రయమిచ్చి, అన్నం పెట్టి, మాటలు నేర్పించి, చదువు చెప్పించి, ఉపాధి మార్గం చూపిస్తూ.. జీవితంలో వారిని ఉన్నతంగా బతికేలా చేస్తున్నది 'ఆశ్రయ్-ఆకృతి' స్వచ్ఛంద సంస్థ. నేడు 'వరల్డ్ హియరింగ్ డే'. ఈ సందర్భంగా బధిరులు నిశ్శబ్దాన్ని ఛేదించేలా ప్రోత్సహిస్తున్న ఆ సంస్థ గురించి ప్రత్యేక కథనం.**









# నిశ్శబ్దాన్ని ఛేదించారు!

శ్రీనగర్ కాలనీ.. ఆంధ్రాబ్యాంక్ వెనుక రోడ్డుపక్కనే 'ఆశ్రయ్-ఆకృతి' ఎన్జీఓ. లోనికి అడుగుపెడితే ఓ తరగతి గదిలో.. ఎనిమిదిమంది పిల్లలను కంటికి రెప్పలా కాపాడే ఓ మాతృమూర్తి కనిపించింది. అలాంటి తల్లులు ఇక్కడ పదుల సంఖ్యలో ఉన్నారు. స్పర్శ తప్ప.. పలుకడం తెలియని పసిహృదయాలకు అమ్మభాష, వారికి ఇష్టమైన డ్రాయింగ్, క్రాఫ్టింగ్ నేర్పిస్తున్నారు. మరో క్లాస్ రూమ్‌లో పెద్ద తెరపై 'వర్షం పుట్టుక, నీటి ఉపయోగాల'పై డిజిటల్ క్లాసులు చెబుతున్నదో టీచర్.

ఇంకో గదిలో తాను క్రియేట్ చేసిన యానిమేషన్‌ను చూపిస్తున్నాడు విద్యార్థి శివ. మాటలతో చెప్పలేని భావాలను యానిమేషన్‌లో ఎంతో చక్కగా చూపించాడు.

పదో తరగతి విద్యార్థుల ముఖాల్లో ఆనందం తాండవిస్తున్నది. మమ్మల్ని చూసిన వారంతా విజయసంకేతం చూపిస్తున్నారు. 'మేమంతా ఈసారి పది పాస్ అవుతాం' అని వచ్చీరాని మాటల్లో చెప్పింది లక్ష్మి.

ఆ పక్కనే యానిమేషన్ ట్రైనింగ్ సెంటర్. అంతా ఇంటర్, డిగ్రీ చదువుతున్న బధిర విద్యార్థులే. నిమిషాల్లోనే గ్రాఫిక్స్ చేస్తున్నారు. వారి వాలకం చూస్తుంటే కంప్యూటర్‌లోని సాఫ్ట్‌వేర్లను ఓ ఆట ఆడుకుంటున్నట్లు కనిపించింది.

తప్పులు చేస్తే సరిదిద్దే ట్యూటర్స్, అమ్మలా లాలించి, బుజ్జగించి పాఠాలు చెప్పే టీచర్లు, కంటికి రెప్పలా కాపాడే సిబ్బంది. మొత్తంగా అదొక చారిటీ అయినా.. ఓ కార్పొరేట్ వ్యవస్థలా కనిపించింది. స్వచ్ఛంద సంస్థల్లోనూ ఇన్ని మెరుగైన సౌకర్యాలుంటాయా?' అనిపించింది.

**ఆశ్రయ్ — ఆకృతి** అనే స్వచ్ఛంద సంస్థను మూగ, చెవిటి చిన్నారుల కోసం 1996లో ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ఫౌండర్ డీపీకే బాబు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి.. ఐదేండ్లలోపు వినికిడి లోపం ఉన్న చిన్నారులను చేరదీస్తున్నారు. వారు కూడా సాధారణ జీవితం గడిపేలా తీర్చిదిద్దుతున్నారు. నాడు బధిర పిల్లల విద్యాబోధన కోసమే ఏర్పడిన ఈ 'ఆశ్రయ్ – ఆకృతి'.. నేడు వారికి మెరుగైన విద్య, వైద్యం, సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాలపై అవిరళంగా కృషి చేస్తున్నది. 'మొబైల్ హియరింగ్ క్లినిక్'ల ద్వారా తెలుగు రాష్ట్రాల్లోని అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఈఎన్‌టీ క్యాంప్‌లను ఏర్పాటు చేసి బాధిత చిన్నారులను గుర్తిస్తున్నది. అలా గుర్తించిన వారిలో ఐదేండ్లలోపు చిన్నారులకు ఉచితంగా బేరా టెస్ట్, ఆడియోలాజికల్ ఎవాల్యుయేషన్ టెస్ట్‌లు చేస్తున్నారు. 90 శాతం వినికిడి లోపిస్తే కాంక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీని సైతం ఉచితంగా చేయిస్తున్నారు. ఇక ఐదేండ్లు నిండిన పిల్లలకు అత్యాధునిక సదుపాయాలు కలిగిన 'హియరింగ్ మెషీన్'లు ఇచ్చి చదువు చెప్పిస్తున్నది. వినికిడి లోపం ఉన్న చిన్నారులకు విద్యాహక్కు చట్టం ద్వారా ప్రత్యేకంగా టీచర్లను నియమిస్తున్నది ఈ ఎన్జీఓ. దీనిని ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ అంటారు. ఈ ఎన్జీఓతో కొందరు వైద్యులు, ఆడియోలజిస్టులు కలిసి పనిచేస్తున్నారు.

### నిరంతర యజ్ఞం


ఆశ్రయ్ – ఆకృతి సంస్థకు స్పెషల్ ఎడ్యుకేషన్ పాఠశాలలు ఐదు ఉన్నాయి. అవి శ్రీనగర్‌కాలనీ, సంజీవరెడ్డి నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, కడప (ఏపీ)లో ఉన్నాయి. వీటిల్లో ఇంక్లూజివ్ పాఠశాలలు కుత్బుల్లాపూర్ డివిజన్‌లో ఐదు ఉన్నాయి. ఈ స్పెషల్ ఎడ్యుకేషన్ పాఠశాలల్లో పదో తరగతి చదివాక వారు డిప్లొమా, ఇంటర్ నుంచి ఉన్నత విద్యనభ్యసించే వరకూ ఈ సంస్థ సహాయం అందిస్తుంటుంది. మొబైల్ క్లినిక్‌ల ద్వారా గుర్తించిన పిల్లలను చేర్చుకుంటున్నారు. ఇలా వినికిడి సమస్యను రూపుమాపే ఓ యజ్ఞం ఇక్కడ కొనసాగుతున్నది. పేద, నిరుపేద పిల్లలకు ఉచిత హాస్టల్ (బాయ్స్, గర్ల్స్ వేర్వేరుగా) సదుపాయం కూడా కల్పిస్తున్నారు. ఈ సంస్థ ద్వారా ఉన్నత చదువులు చదివి మల్టీమీడియా, యానిమేషన్ రంగాల్లో నైపుణ్యం సంపాదిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్‌లలో ఉద్యోగాలు పొందిన వారు 250 మందికిపైగానే ఉన్నారు.



**దాతలే మా బలం..**

'అమ్మా' అని నోరారా పిలిస్తే ఆ తల్లిదండ్రులకు చెప్పలేని సంతోషం. ఈ పిలుపు కోసమే ఎంతోమంది తపన పడుతుంటారు. కానీ పిల్లలు మాట్లాడలేని, వినలేని స్థితిలో ఉంటే వారి బాధ వర్ణణాతీతం. దాన్ని దూరం చేయడం కోసమే మేం పనిచేస్తున్నాం. మా ఆశయానికి ఎంతోమంది దాతలు విరాళాలు ఇస్తున్నారు. మా పాఠశాలల్లో సిబ్బంది మా లక్ష్యానికి బాటలు వేస్తున్నారు. ఎర్లీ ఇంటర్వేషన్, స్పీచ్‌థెరపీ, ఆడిటరీ ట్రైనింగ్, ఆడిటరీ వెర్బల్ థెరపీ, ఓరల్ మెథడ్ ఆఫ్ టీచింగ్, పిక్చర్స్, కంప్యూటర్ ఎడ్యుకేషన్ ద్వారా వారిని తీర్చిదిద్దుతున్నారు టీచర్లు.

**- డీపీకే బాబు, ఆశ్రయ్—ఆకృతి ఫౌండర్**



### ఐదుగురితో మొదలై..

ఆశ్రయ్ – ఆకృతి సంస్థ 1996లో ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమై నేడు 650 మందితో కొనసాగుతున్నది. ఈ 24 యేండ్లలో వందలాది మంది విద్యార్థులు ఈ సంస్థ ద్వారా లబ్ధి పొందారు. అన్ని బ్రాంచ్‌లలో కలిపి 250 మందికిపైగా సిబ్బంది పనిచేస్తున్నారు. డబ్ల్యూహెచ్ఓ వరల్డ్ హియరింగ్ ఫోరమ్‌లో మెంబర్‌గానూ ఉన్నది ఆశ్రయ్ – ఆకృతి సంస్థ. 2017లో 'ఉత్తమ ఎన్జీఓ, బెస్ట్ ఇనిస్టిట్యూషన్'గా తెలంగాణ ప్రభుత్వం తరపున పురస్కారాలు అందుకున్నది. ప్రపంచ వికలాంగుల, వినికిడి దినోత్సవాల సందర్భంగా పలు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. బధిర విద్యార్థుల్లో మానసిక స్థైర్యం పెంపొందేలా కరాటే, మార్షల్ ఆర్ట్స్, అడ్వెంచర్స్‌పైన శిక్షణ ఇస్తున్నారు. పలు సాంస్కృతిక పోటీలు ఏర్పాటు చేస్తూ వారిలోని ప్రతిభను వెలికితీస్తున్నారు. ఇక్కడ పిల్లలు తయారు చేసే వస్తువులు, బొమ్మలు, అందమైన పెయింటింగ్స్ కూడా అమ్మకానికి పెడుతున్నారు. ఈ ఎన్జీఓకు మీరూ సహాయం చేయాలనుకుంటే www. ashrayakruti.org వెబ్‌సైట్‌ను చూడండి.

... డప్పు రవి

జి.చిన్నయాదగిరి గౌడ్

# పొదుపుమార్గాలు




**ప్రతి నెలా సంపాదించిన ఆదాయంలో ఎంతోకొంత కూడబెట్టాలి. అలా కూడబెడితేనే అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడుతుంది. ఆదాయానికి తగ్గట్టుగానే ఖర్చులూ ఉంటాయి. వాటికి ఖర్చు చేయగా మిగిలిన దానినే పొదుపుగా పరిగణిస్తాం. పొదుపుకోసం చాలా రకాల ఉపాయాలు ఉన్నాయి.**

- సంపద సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకుంటే పొదుపు ఒక్కటే సరిపోదు. అదనంగా ఏమైనా చేయాలి.
- పెట్టుబడులు పెట్టడం ద్వారా కూడా ఆదాయాన్ని పెంచుకోవచ్చు. కొంత కాలం పాటుడబ్బును ఆర్థిక సాధనాల్లో పెడితే వృద్ధిని సాధించవచ్చు.
- వస్తు, సేవల ధరలు రోజు రోజుకూ పెరుగుతూ ఉంటాయి. కాబట్టి అందుకు తగిన విధంగా ఆదాయ వనరులను పెంచుకోవాలి.
- ఇటువంటి ఆదాయ మార్గాల్లో మ్యూచువల్ ఫండ్స్ కీలకమైనవిగా భావిస్తారు.
- వీటిలో ఈక్విటీ, డెట్ ఫండ్లు వంటి రకరకాల మ్యూచువల్ ఫండ్స్ అందుబాటులో ఉన్నాయి.

# ఫ్లవర్‌వాజ్ ఇలా...

- ఫ్లవర్‌వాజ్‌లో పువ్వులు అలంకరించేటప్పుడు, పువ్వులతో పాటు మధ్యమధ్యలో ఆకులు కూడా పెట్టాలి. ఆకులు నీళ్లలో మునగకూడదు. పూల మొక్కకు చెందిన ఆకులే కాకుండా వేరే రకం ఆకులు పెడితే అందంగా ఉంటుంది.
- బాగా వికసించిన ముదురురంగు పువ్వులను మధ్యలో పెట్టి, అరవిరిసిన పువ్వులు చుట్టూరా పెట్టాలి. ఇలా చేస్తే అవి కూడా విచ్చుకుంటాయి.
- ఎరుపు, నేరేడు రంగు, ముదురు రంగు పువ్వులు ఒకేచోట కాకుండా మ్యాచింగ్ ఉండేలా చూడాలి. పువ్వుల రంగులు ఆ గది రంగుకి మ్యాచ్ అయ్యేలా పెట్టాలి.



# డాక్టర్ నుంచి త్రీస్టార్ మాధురిగా..


**లెఫ్టినెంట్ జనరల్ హోదాకు మరో మహిళ ఎంపికైంది. భారత సైన్యంలో ఈ ఉద్యోగోన్నతి పొందిన మూడో మహిళగా ఆమె నిలిచారు. మాధురి, ఆమె భర్త త్రీస్టార్ ఉన్న తొలి దంపతులుగా గుర్తింపు పొందుతున్నారు.**

మేజర్ జనరల్ మాధురి కనిత్కర్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌గా నియమితులయ్యారు. లెఫ్టినెంట్ జనరల్ అయిన ఆమె భర్త రాజీవ్.. వీరితోపాటు ఆమె... వీరిద్దరూ సాయుధ దళాలలో ర్యాంకు సాధించిన మొదటి జంటగా గుర్తింపు పొందారు. ఆమె సర్జన్ వైస్ అడ్మిరల్, భారత నావికాదళం, సైన్యంలో మాజీ 3-స్టార్ ఫ్లాగ్ ఆఫీసర్‌గా పనిచేశారు. రాజీవ్ కనిత్కర్ ఇటీవల ఆర్మీ నుంచి రిటైర్ అయ్యారు. భారతీయ ఆర్మీ వైద్యులకు లెఫ్టినెంట్ జనరల్ పదవికి మొదటి మహిళా డాక్టర్ మాధురి. ఒకప్పుడు పూణె సాయుధ దళాల వైద్య కళాశాల డీన్‌గా ఉన్న డాక్టర్‌కనిత్కర్ 37 ఏండ్లు ఆర్మీలో పనిచేశారు. సర్జన్ వైస్ అడ్మిరల్ అయిన పునితా అరోరా, లెఫ్టినెంట్ జనరల్ పదవిని నిర్వహించిన మొదటి మహిళ. పద్మావతి బందోపాధ్యాయ లెఫ్టినెంట్ జనరల్ అయిన రెండవ మహిళ. మాధురి కర్ణాటకలోని ధార్వార్‌లో 1960లో జన్మించింది. తండ్రి పేరు చంద్రకాంత్ గోపాల్‌రావ్, తల్లి హేమలత చంద్రకాంత్. 1982లో పూణెలోని సాయుధ దళాల వైద్య కళాశాల నుంచి డిగ్రీ పట్టా పొందింది. అదే సంవత్సరంలో నవంబర్ 16న రాజీవ్ వసంత్ కనిత్కర్‌తో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. 1991లో బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి పీడియాట్రిక్స్‌లో డాక్టర్ ఆఫ్ మెడిసిన్ డిగ్రీతో పట్టభద్రురాలైంది. 1982-2005 వరకు మాధురి కనిత్కర్ భారత మిలటరీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా పనిచేసింది. 2001 నుంచి ఆమె పూణెలోని ఆర్మీ మెడికల్ కాలేజీ, కమాండ్ హాస్పిటల్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేసింది.



# సహజ అందం.. రెట్టింపు

**అందం రెట్టింపు కోసం సహజంగా లభించే పదార్థాలు బాగా పని చేస్తాయి. శరీరకాంతిని పెంచడంలో ఇవి ప్రధానపాత్ర పోషిస్తాయి. దీనికోసం వివిధ రకాల పదార్థాలతో అందాన్ని ఎలా పెంచుకోవచ్చంటే?**



### పసుపు- పాలు



రెండు స్పూన్ల పాలు, అర స్పూన్ పసుపును బాగా కలపాలి. దాంట్లో దూదిని ముంచి దాన్ని ముఖంపై మర్దన చేయాలి. మెడపై కూడా మర్దన చేయాలి. రాత్రంతా దాన్ని అలాగే ఉంచండి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో కడిగేయండి. మార్పు మీకే తెలుస్తుంది.


### టమాట-పొప్పడి



ఒక టమాట, పొప్పడి ముక్కను బాగా కలపండి. ఆ మిశ్రమాన్ని ముఖానికి రాయండి. పదిహేను నిమిషాల తర్వాత చల్లని నీటితో తీసేయండి. దీనిలో పాలు కూడా కలుపుకోవచ్చు. దీని ద్వారా శరీరం నిగారిస్తుంది.

### శనగ పిండి- పసుపు


శనగ పిండి, పసుపును మిక్స్ చేయండి. దాంట్లో రోజ్ వాటర్ కలిపి పేస్ట్‌లా తయారు చేయండి. దాన్ని ముఖంపై అప్లయ్ చేసి 20 నిమిషాలు వదిలేయండి. తర్వాత నీటితో కడిగేయండి. ముఖం కాంతివంతం అవుతుంది.



### తేనె-నిమ్మ

రెండు స్పూన్ల నిమ్మరసం, ఒక స్పూన్ తేనెను కాటన్ బాల్‌తో కలపండి. అదే కాటన్ బాల్‌తో ముఖంపై మర్దన చేయండి. 15 నిమిషాల తర్వాత నీటితో కడిగేయండి. ఇలా రోజూ చేయడం ద్వారా చర్మం మెరుస్తుంది.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
మంగళవారం 3 మార్చి 2020



'వకీల్‌సాబ్' చిత్రంలో పవన్‌కల్యాణ్

# వకీల్‌సాబ్ పోరాటం

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి 'వకీల్‌సాబ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. దీనితో పాటు సినిమాలోని పవన్‌కల్యాణ్ ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు. హిందీలో విజయవంతమైన 'పింక్' చిత్రానికి రీమేక్ ఇది. శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, బేవ్యూవ్ ప్రాజెక్ట్స్ పతాకాలపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. బోనీకపూర్ సమర్పకుడు. ఫస్ట్‌లుక్‌లో చేతిలో పుస్తకం పట్టుకొని దీర్ఘాలోచనలో కనిపిస్తున్నారు పవన్‌కల్యాణ్. ఈ చిత్రంలో ఆయన న్యాయవాది పాత్రలో కనిపించబోతున్నారు. ముగ్గురమ్మాయిలపై అన్యాయంగా మోపబడ్డ ఓ హత్యాయత్నంపై వాదించి వారిని గెలిపించే లాయర్ ఇతివృత్తంతో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. మే 15న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: పీఎస్ వినోద్, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవన్, మాటలు: తిరు, సంగీతం: తమన్, సహనిర్మాత: హర్షిత్ రెడ్డి.

# నీ కన్ను నీలిసముద్రం



సుకుమార్, వైష్ణవ్‌తేజ్, కొరటాల శివ, బుచ్చిబాబు

'చిన్నతనంలో నన్ను 'సీతాకోకచిలక' సినిమా ఎంతగానో ప్రభావితం చేసింది. అలాంటి ఫీల్ 'ఉప్పెన'లో ఉంది. ఈ వేసవిలో ఇలాంటి చల్లనైన, చక్కని సినిమా మరొకటి రాదని నా ప్రగాఢ నమ్మకం. దర్శకుడు బుచ్చిబాబు కథ చెప్పినప్పుడే సినిమా ఏ స్థాయిలో ఉండబోతుందో అర్థమైపోయింది' అన్నారు కొరటాల శివ. 'ఉప్పెన' చిత్రంలోని 'నీ కన్ను నీలి సముద్రం..నా మనసేమో అందుట్లో పడవ ప్రయాణం..నీ నవ్వు ముత్యాల హారం..నన్ను తీరానికి లాగేటి దారం..' అనే గీతాన్ని ఆయన సోమవారం ఆవిష్కరించారు. శ్రీమణి రాసిన ఈ పాటను జావెద్ అలీ ఆలపించారు. దేవిశ్రీప్రసాద్ స్వరకర్త. వైష్ణవ్‌తేజ్, కృతిశెట్టి జంటగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా ప్రముఖ దర్శకుడు సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సానా నిర్దేశకుడిగా పరిచయమవుతున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సందర్భంగా కొరటాల శివ మాట్లాడుతూ 'దేవిశ్రీప్రసాద్ సంగీతం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వైష్ణవ్‌తేజ్ స్క్రీన్‌ప్రజెన్స్ అద్భుతంగా ఉంది. అతనికి మంచి భవిష్యత్తు ఉంటుందని కోరుకుంటున్నా. చిత్ర బృందానికి నా శుభాకాంక్షలు' అన్నారు. ఈ చిత్రంలో తమిళ హీరో విజయ్‌సేతుపతి కీలక పాత్రలో నటిస్తున్నారు. ఏప్రిల్ 2న చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. సాయిచంద్, బ్రహ్మాజీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శాందత్ సైనుద్దీన్, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: అనిల్ వై, అశోక్ బి, సీఈఓ: చెర్రీ, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, కథ, దర్శకత్వం: బుచ్చిబాబు సానా.



పూజాహెగ్డే

# 2021లో సీక్వెల్



విష్వక్‌సేన్, నాని

'నిజాయితీగా యూనిక్ కంటెంట్‌తో నవ తరంలోని ప్రతిభను నమ్మి ఈ సినిమా చేశాను. ఈ చిత్రాన్ని కమర్షియల్‌గా హిట్ చేసి తెలుగు ప్రేక్షకులు రివార్డు ఇచ్చారు ' అని అన్నారు హీరో నాని. ఆయన సమర్పణలో రూపొందిన చిత్రం 'హిట్'. విష్వక్‌సేన్, రుహానీశర్మ జంటగా నటించారు. శైలేష్ కొలను దర్శకుడు. ప్రశాంతి తిపిరినేని నిర్మించారు. ఇటీవల ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. సోమవారం హైదరాబాద్‌లో చిత్రబృందం విజయోత్సవ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ 'నిర్మాతగా టెన్షన్‌తో సినిమాను మొదలుపెట్టాను. మంచి సినిమా చేశాననే గర్వంతో త్వరలో 'టక్ జగదీష్' సినిమా కోసం రాజమండ్రి ప్రయాణమవుతున్నాను. 2021లో ఈ సినిమాకు సీక్వెల్ రానుంది' అని తెలిపారు. కమర్షియల్ సినిమాలతో పాటు వైవిధ్యమైన కథాంశాలకు సమప్రాధాన్యతనిస్తూ కెరీర్‌ను కొనసాగిస్తానని, తన సినీ ప్రయాణంలో అతిపెద్ద విజయమిదని విష్వక్‌సేన్ అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమాను నిర్మించి నన్ను దర్శకుడిగా చిత్రసీమలో నిలబెట్టిన నానికి ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియడం లేదు. ఆయన గర్వంగా ఫీలయ్యే మంచి సినిమా చేశాను. విక్రమ్ పాత్రలో విష్వక్‌సేన్‌ను తప్ప మరొకరిని ఊహించుకోలేకపోయాను. నేను రాసిన పాత్రకు పరిపూర్ణంగా న్యాయం చేశాడు. భవిష్యత్తులో కథాబలమున్న మంచి సినిమాలు చేస్తానని మాటిస్తున్నాను' అన్నారు. ప్రేక్షకుల ఆదరణే వినూత్న కథాంశాలతో సినిమాలు చేయడానికి ప్రోత్సాహాన్ని అందిస్తున్నదని ప్రశాంత్ తిపిరినేని చెప్పింది. ఈ కార్యక్రమంలో వివేక్‌సాగర్, మణికందన్ పాల్గొన్నారు.

# కేసీఆర్ ఆదేశాలతో కలిసి పనిచేస్తున్నాం!



ఆనందప్రసాద్, బ్రహ్మాజీ, సంజయ్, చిరంజీవి, నిత్యాశెట్టి, చందు, విశ్వాంత్

'చిన్న సినిమాలకు థియేటర్ల సమస్య ఉంది. అందుకు పరిష్కారం వెతకాలి. వీటితో పాటు ఇండస్ట్రీ ఉన్నతి కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలో అనే అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌గారి ఆదేశాల మేరకు నేను, నాగార్జున, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కలిసి ప్రయత్నాలు చేస్తున్నాం' అన్నారు అగ్ర కథానాయకుడు చిరంజీవి. ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన 'ఓ పిట్టకథ' సినిమా ప్రీరిలీజ్ వేడుక ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. విశ్వాంత్, సంజయ్‌రావు, నిత్యాశెట్టి, బ్రహ్మాజీ ప్రధాన పాత్రల్లో నటించారు. చందు ముద్దు దర్శకుడు. వి.ఆనందప్రసాద్ నిర్మాత. ఈ నెల 6న విడుదలకానుంది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ''శంకర్‌దాదా ఎంబీబీఎస్' టైమ్‌లో మా సెట్‌లో కార్‌వ్యాన్ ఉండేది కాదు. ఇప్పుడదొక విలాస వస్తువుగా మారిపోయింది. ఇందులో మార్పురావాలి. ప్రతి ఆర్టిస్టు షూటింగ్ టైమ్‌లో సెట్‌లోనే ఉండాలి. అవసరమైతే తప్ప కార్‌వ్యాన్‌ను వాడుకోవద్దు. హీరోహీరోయిన్లతో పాటు ఆర్టిస్టులందరూ సెట్‌లో ఉంటేనే బాధ్యతగా ఉంటుంది. సెట్‌లో ఉండి పనిచేస్తే సినిమా పనిరోజులు కూడా తగ్గిపోతాయి. మనకు జీవితాన్నిచ్చి.. అన్నం పెట్టిన పరిశ్రమను పరిరక్షించుకోవాలి. అందుకే ప్రతి ఒక్కరూ అర్థాకలితో ఉండాలని నేను చెబుతుంటా. అప్పుడే మరింత అంకితభావంతో పరిశ్రమలో ఎలా ఎదగాలో అని ఆలోచిస్తాం. కడుపునిండిన వ్యవహారంలా ఎవరూ ఉండకూడదు. 'ఓ పిట్టకథ' పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు. 'కొత్త వాళ్లతో ఈ సినిమా చేశాం. మమ్మల్ని ఆశీర్వదించడానికి వచ్చిన చిరంజీవిగారికి కృతజ్ఞతలు. తెలుగు చిత్రసీమలో సమస్యల పరిష్కారానికి చిరంజీవిగారు ఓ పెద్దదిక్కులా కృషి చేస్తున్నారు' అని నిర్మాత వి.ఆనందప్రసాద్ చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'వినూత్నమైన కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశాం. ఇలాంటి సినిమాల్ని ఆదరిస్తే కొత్త కథలు మరిన్ని వచ్చే అవకాశం ఉంటుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో సునీల్, బ్రహ్మాజీ, సందీప్‌కిషన్, ఆనంద్ దేవరకొండ, సత్యదేవ్, అనసూయ, సాగర్‌చంద్ర, వర్ష, ఉత్తేజ్ తదితరులు పాల్గొన్నారు.

తమిళ చిత్రం 'ముగమూడి'తో 2012లో కథానాయికగా అరంగేట్రం చేసింది పూజా హెగ్డే. మిస్కిన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం పరాజయం పాలవ్వడంతో కోలీవుడ్‌లో మరో అవకాశాన్ని దక్కించుకోలేకపోయింది ఈ కన్నడ సోయగం. దాదాపు ఎనిమిదేళ్ల విరామం తర్వాత పూజాహెగ్డే తమిళంలో పునరాగమనం చేయబోతున్నట్లు

# ఎనిమిదేళ్ల తర్వాత

వార్తలు వినిపిస్తున్నాయి. తమిళ అగ్రకథానాయకుడు విజయ్ హీరోగా సుధా కొంగర దర్శకత్వంలో ఓ సినిమాను తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రయోగాత్మక కథాంశంతో రూపొందనున్న ఈ చిత్రంలో విజయ్‌కి జోడీగా పూజాహెగ్డేను కథానాయికగా తీసుకునే యోచనలో చిత్రబృందం ఉన్నట్లు తెలిసింది. ఇటీవలే దర్శకనిర్మాతలు పూజాహెగ్డేను సంప్రదించినట్లు సమాచారం. కథ నచ్చడంతో ఆమె ఈసినిమా చేయడానికి సుముఖతను వ్యక్తంచేసిందని చెబుతున్నారు. తెలుగులో 'అల వైకుంఠపురములో' చిత్రంతో కెరీర్‌లోఅతిపెద్ద విజయాన్ని అందుకున్న పూజాహెగ్డే ప్రస్తుతం ప్రభాస్ సినిమాతో పాటు అఖిల్ సరసన 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్'లో నటిస్తున్నది. హిందీలో సల్మాన్‌ఖాన్‌తో ఓ సినిమా చేయబోతున్నది.

# 'కార్తికేయ-2' మొదలైంది

'చందు మొండేటితో నా కలయికలో యానిమల్ హిప్నాటిజం అనే కొత్త కాన్సెప్ట్‌ను తెలుగు తెరకు పరిచయం చేస్తూ రూపొందిన 'కార్తికేయ' చిత్రం పెద్ద విజయాన్ని సాధించింది. ఆరేళ్ల తర్వాత మా ఇద్దరి కాంబినేషన్‌లో 'కార్తికేయ-2' రూపొందుతుండటం ఉత్కంఠగా అనిపిస్తోంది' అని అన్నారు నిఖిల్. ఆయన కథానాయకుడిగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కార్తికేయ-2'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకాలపై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. సోమవారం తిరుపతిలో శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధానంలో చిత్ర పూజా కార్యక్రమాల్ని నిర్వహించారు. నిఖిల్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి తిరుపతి శాసనసభ్యుడు భూమన కరుణాకర్‌రెడ్డి కెమెరా స్విచ్ఛాన్ చేయగా, ఆయన తనయుడు అభినయ్‌రెడ్డి క్లాప్‌నిచ్చారు. నిఖిల్ మాట్లాడుతూ 'భారతీయ సంప్రదాయాలను అద్భుతమైన రీతిలో ఆవిష్కరించే చిత్రమిది. ఉగాది తర్వాత రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అని చెప్పారు. 'కార్తికేయ' మాదిరిగానే సీక్వెల్ తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించాలని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ ఆకాంక్షించారు. నిర్మాతలు మాట్లాడుతూ ' 5118 ఏళ్ల క్రితం నాటి యుగానికి చెందిన అనంత జ్ఞాన సంపదకు సంబంధించిన రహస్యాన్ని ఓ యువకుడు ఎలా అన్వేషించాడన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. ఆద్యంతం థ్రిల్‌ను పంచుతుంది. తాజాగా విడుదల చేసిన టైటిల్ లోగో, కాన్సెప్ట్ వీడియోకు చక్కటి స్పందన లభిస్తున్నది' అని తెలిపారు. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.



నిఖిల్

# లాయర్‌గా జ్యోతిక


సెకండ్ ఇన్నింగ్స్‌లో మహిళా ప్రధాన ఇతివృత్తాల్లో నటిస్తూ ప్రశంసల్ని అందుకుంటున్నది జ్యోతిక. తాజాగా ఆమె లాయర్‌గా ప్రయోగాత్మక పాత్రలో కనిపించబోతున్నది. ఆమె కథానాయికగా తమిళంలో 'పోన్‌మగల్ వంధాల్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతున్నది. జ్యోతిక భర్త హీరో సూర్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జె.జె. ఫ్రెడ్‌రిక్ దర్శకత్వం వహిస్తున్నారు. జ్యోతిక ఫస్ట్‌లుక్‌ను



సోమవారం ట్విట్టర్ ద్వారా హీరో సూర్య విడుదలచేశారు. లాయర్ దుస్తుల్లో శక్తివంతంగా ఈ పోస్టర్‌లో జ్యోతిక కనిపిస్తున్నది. ఆమె వెనుక క్రైమ్ వార్తలకు సంబంధించిన పేపర్ కటింగ్స్ ఉండటం ఆసక్తిని పంచుతున్నది. థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కె. భాగ్యరాజా, పార్తిబన్ కీలక పాత్రల్ని పోషిస్తున్నారు. ఈనెల 27న ఈ చిత్రం విడుదలకానుంది.

# 60ఏళ్ల వృద్ధుడిగా నటించా!

**'1978-2008 మధ్యకాలంలో సాగే పీరియాడిక్ చిత్రమిది. ఓ జానపదకళాకారుడు రౌడీగా మారడానికి దారితీసిన పరిస్థితులేమిటన్నది ఆసక్తిని పంచుతాయి' అని అన్నారు రక్షిత్. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'పలాస 1978'. కరుణకుమార్ దర్శకుడు. తమ్మారెడ్డి భరద్వాజ సమర్పణలో ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. ఈ నెల 6న విడుదలకానుంది. సోమవారం హైదరాబాద్‌లో రక్షిత్ పాత్రికేయులతో ముచ్చటించారు.**



రక్షిత్

''లండన్‌బాబులు' తర్వాత రెగ్యులర్ లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లు కాకుండా వైవిధ్యమైన కథాంశంతో సినిమా చేయాలని నిర్ణయించుకున్నా. ఆ ఆలోచనతోనే అంగీకరించిన చిత్రమిది. పలాసకు చెందిన మోహన్‌రావు అనే జానపద కళాకారుడిగా కనిపిస్తాను. 18 ఏళ్ల యువకుడి నుంచి 60 ఏళ్ల వృద్ధుడిగా నాలుగు భిన్న షేడ్స్‌లో నా పాత్ర ఛాలెంజింగ్‌గా ఉంటుంది. వృద్ధుడి పాత్ర కోసం దాదాపు 15 కిలోల బరువు తగ్గాను. తీవ్రమైన ఉద్వేగాలతో కూడిన ఈ పాత్రకు న్యాయం చేయగలనా లేదా అని తొలుత భయపడ్డాను. సరిగా నటించకపోతే విమర్శలు వస్తాయనిపించింది. ఈ పాత్ర కోసం శ్రీకాకుళం యాస, డప్పు కొట్టడం నేర్చుకోవడంతో పాటు అలనాటి వేషభాషలు, సామాజిక పరిస్థితుల్ని ఆకళింపు చేసుకొని నటించాను. నటుడిగా ఈ సినిమా నాకు మంచి పేరు తీసుకొస్తుందనే నమ్మకముంది.

**సుకుమార్ ప్రశంసించారు..**

దర్శకుడు సుకుమార్ ఈ సినిమా చూసి 'హీరోలంతా ఈర్ష్య పడే పాత్ర చేశావు. లైఫ్ టైమ్ గుర్తుండిపోయే సినిమా అవుతుంది' అని మెచ్చుకున్నారు. ఆయన ప్రశంస మాలో నమ్మకాన్ని పెంచింది. సుకుమార్‌తో పాటు అల్లు అరవింద్, నాగశౌర్య, మారుతి సహా ఇండస్ట్రీలోని చాలా మంది సినిమా బాగుందని అన్నారు. ఏ సినిమాకు రిఫరెన్స్ కాదు. అసురన్, గ్యాంగ్ ఆఫ్ వస్సీపూర్ మాదిరిగా రస్టిక్‌గా ఉంటుంది. 1980 నాటి శైలిని వాస్తవిక కోణంలో ప్రతిబింబిస్తూ పక్కా కమర్షియల్ హంగులతో దర్శకుడు కరుణకుమార్ ఈ సినిమాను తెరకెక్కించారు. తదుపరి సినిమాకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. రెండు కథలు విన్నాను.

# తండ్రీకొడుకుల కథ



రాహుల్, గోపీచంద్

'నాకు యాక్షన్ ఇమేజ్ రావడానికి విజయ్ మాస్టర్ దోహదపడ్డారు. ఆయన మాటను నేనెప్పుడూ కాదనను. విజయ్ మాస్టర్ తనయుడు రాహుల్ హీరోగా మంచి పేరు తెచ్చుకోవాలి' అని అన్నారు కథానాయకుడు గోపీచంద్. రాహుల్ విజయ్, రాజేంద్రప్రసాద్, ప్రియా వడ్లమాని, మధుబాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కాలేజ్‌కుమార్'. హరి సంతోష్ దర్శకుడు. ఎల్.పద్మనాభ నిర్మించారు. ఈ నెల 6న విడుదలకానుంది. ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి హీరో గోపీచంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 'ట్రైలర్‌లో రాహుల్, రాజేంద్రప్రసాద్ కెమిస్ట్రీ బాగుంది. రాజేంద్రప్రసాద్ సెట్స్‌లో ఉంటే యాక్టింగ్ డిక్షనరీ ఉన్నట్లే' అని చెప్పారు. 'ఏ ఆర్టిస్ట్ అయినా నటిస్తున్నంత కాలం సంతోషంగా ఉంటాడు. అవకాశాలు వస్తున్నాయి కాబట్టే నేను ఉత్సాహంగా ఉండగలుగుతున్నాను. ఇన్నేళ్లుగా అందరిని నవ్వించే అవకాశం దొరకడం పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నా. తండ్రిని చదివించే ఓ కొడుకు కథ ఇది. సీరియస్ అంశాన్ని వినోదాత్మక పంథాలో చెప్పిన విధానం బాగుంటుంది' అని రాజేంద్రప్రసాద్ అన్నారు. చదవడం గొప్పా, చదివించడం గొప్పా అనే పాయింట్‌తో తండ్రీకొడుకుల మధ్య ఏర్పడే సంఘర్షణ ప్రధానంగా సాగుతుందని, తన కెరీర్‌లో మర్చిపోలేని చిత్రమవుతుందని రాహుల్ విజయ్ పేర్కొన్నారు. మధ్య తరగతి అనుబంధాల్ని వాస్తవిక కోణంలో ఆవిష్కరించే చిత్రమిదని హీరోయిన్ ప్రియా వడ్లమాని చెప్పింది. దర్శకుడు మాట్లాడుతూ మంచి కథను చెప్పడానికి భాషాభేదాలతో సంబంధం లేదని నమ్మి ఈ సినిమా చేశాను. సార్వజనీన కథాంశంతో అలరిస్తుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో రామ్‌లక్ష్మణ్, విజయ్‌మాస్టర్, మధుబాల తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
జీవనరేఖ
[ కరీంనగర్ ]
మంగళవారం 3 మార్చి 2020

కిడ్నీలో ఏర్పడే రాళ్ల దగ్గరి నుంచి క్యాన్సర్ల దాకా.., చిన్నపిల్లల్లో వచ్చే కిడ్నీ సమస్యల నుంచి ట్రాన్స్‌ప్లాంటేషన్ దాకా.. కిడ్నీ, దాని అనుబంధ అవయవాలకు సంబంధించిన సమస్యలకు ఒకప్పుడైతే ఓపెన్ సర్జరీ ఉండేది. కాని పెద్ద కోత లేకుండానే కిడ్నీ సంబంధిత సమస్యలకు ఇప్పుడు సర్జరీలు చేస్తున్నారు. ఓపెన్ సర్జరీకి ప్రత్యామ్నాయంగా వచ్చిన లాపరోస్కోపిక్ సర్జరీల కన్నా సౌకర్యవంతమైన, మెరుగైన ఫలితాలను ఇచ్చే రోబోటిక్ సర్జరీలు ఇప్పుడు ఎక్కువ ప్రాచుర్యంలోకి వచ్చాయి.



# కిడ్నీ సమస్యలకు కొత్త చికిత్సలు





## చిన్నారుల్లో కిడ్నీ సమస్యలకు..

1 యుపిజెఒ – యురెట్రో పెల్విక్ జంక్షన్ అబ్‌స్ట్రక్షన్ ఉన్నపుడు పైలోప్లాస్టీ చేస్తారు. దీన్ని లాపరోస్కోపీ, రోబోటిక్ ద్వారా చేస్తారు. 3 నుంచి 6 నెలల వయసు అయితే ఓపెన్ సర్జరీ చేస్తారు. అంతకన్నా ఎక్కువ ఏజ్ అయితే లాపరోస్కోపీ, రోబోటిక్ చేస్తారు.

2 రిఫ్లక్స్ సమస్య బ్లాడర్ దగ్గర వాల్వులో లోపం వల్ల వస్తుంది. ఇలాంటప్పుడు యురెటిక్ రీఇంప్లాంటేషన్ సర్జరీ చేస్తారు. ఇది రోబోతో కూడా చేయవచ్చు.

3 కొందరు పిల్లల్లో మూత్రం వచ్చే రంధ్రం వేరే చోట ఉంటుంది. దీన్ని హైపోస్పాడియాస్ అంటారు. దీనికి కూడా చికిత్స ఇప్పుడు సులువైంది.


4 పీయువీ – పోస్టీరియర్ యురెత్రల్ వాల్వ్ సమస్యకు కూడా చికిత్స అందుబాటులో ఉంది.

5 విల్మ్స్ ట్యూమర్ ఉన్నప్పుడు, ఏ కారణం వల్లనైనా కిడ్నీ పాడైతే చిన్న పిల్లల్లో కూడా కిడ్నీ మార్పిడి చేస్తారు.

**మన శరీరంలోని** మలినాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ, శరీరం ఎప్పుడూ పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉండడానికి దోహదం చేసేవి కిడ్నీలు. ఇవి రోజుకు దాదాపు 2 వందల లీటర్ల రక్తాన్ని శుద్ధి చేస్తాయి. ఈ శుద్ధి ప్రక్రియ ఆగిపోతే శరీరం అంతా అస్తవ్యస్తం అయిపోతుంది. విషపదార్థాలతో నిండిపోతుంది. ఫలితంగా అన్ని అవయవాలూ ప్రభావితమై చివరికి మరణానికి దారితీస్తుంది. అందుకే కిడ్నీలకు వచ్చే జబ్బులను అశ్రద్ధ చేయవద్దు. సాధారణంగా కిడ్నీలో రాళ్ల సమస్య ఎక్కువగా కనిపిస్తుంటుంది. నీళ్లు ఎక్కువగా తాగకపోవడం కొందరిలో కారణమైతే, ఏ కారణం లేకుండా కూడా కొందరిలో రాళ్లు ఏర్పడుతాయి.

### రాళ్లు తీసే కొత్త పద్ధతులు

కిడ్నీలో రాళ్లు ఏర్పడటాన్ని నెఫ్రోలిథియాసిస్ లేదా రీనల్ కాలిక్యులై అంటారు. మనదేశంలో దాదాపు 15కోట్ల మంది ఈ సమస్యతో బాధపడుతున్నట్టు అంచనా. ప్రతి వెయ్యిమందిలో ఇద్దరు ఈ వ్యాధికి గురవుతున్నారు. పరిసరాల ప్రభావం, ఆహారపు అలవాట్లు ఈ వ్యాధికి దారితీస్తున్నాయి. దీనికి వంశపారంపర్య కారణాలు కూడా ఉన్నాయి. కొన్ని పదార్థాలు చేరడం వల్ల కూడా మూత్రం చిక్కబడి స్ఫటికాలుగా ఏర్పడుతాయి. ఇవే రాళ్లుగా కనిపిస్తాయి. ఈ రాళ్లు 5 మిల్లీమీటర్ల లోపు పరిమాణంలో ఉంటే మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతాయి. ఇలాంటప్పుడు నీళ్లు ఎక్కువగా తాగమని సూచిస్తారు. సైజు ఎక్కువగా ఉంటే మాత్రం మూత్రనాళానికి అడ్డుపడి సమస్య పెద్దదవుతుంది. ఇలాంటప్పుడు సర్జరీ అవసరం అవుతుంది.



కిడ్నీలో ఏర్పడిన రాళ్లను తీసేయాలంటే ఇంతకుముందు ఓపెన్ సర్జరీ ఉండేది. 25 ఏళ్ల క్రితం కీ హోల్ సర్జరీ వచ్చింది. ఇప్పుడు కూడా ఈ సర్జరీ మంచి ఫలితాలనే ఇస్తున్నది. ఈ సర్జరీలో కిడ్నీ వెనుక ఒక రంధ్రం పెడతారు. యూరినరీ ప్యాసేజ్ ద్వారా వెళ్లి కిడ్నీలోని రాళ్లను తొలగిస్తారు. ఇటీవలి కాలంలో అందుబాటులోకి వచ్చిన సర్జరీ పీసీఎన్‌ఎల్ – పర్క్యుటేనియస్ నెఫ్రో లిథోటమీ. ఇది ఎండోస్కోపిక్ సర్జరీ. ఈ సర్జరీలో రంధ్రం ద్వారా ఎండోస్కోప్ పంపించి రాయిని బ్రేక్ చేస్తారు.

మినీ పర్క్, సూపర్ పర్క్ అనేవి పీసీఎన్‌ఎల్‌లో వచ్చిన కొత్త టెక్నిక్స్.

మినీపర్క్ – ఈ ప్రక్రియలో రంధ్రం సైజు చాలా చిన్నగా ఉంటుంది. 13 ఫ్రెంచ్ కన్నా తక్కువ ఉంటుంది.


సూపర్ పర్క్ – ఈ పద్ధతిలో చేసే సర్జరీకి వాడే పరికరానికే సక్షన్ డివైజ్ ఉంటుంది. రాయిని పగులగొట్టిన చేసిన తరువాత దాన్ని బయటకు తీసే ప్రాసెస్ లేకుండా బ్రేక్ చేయగానే అదే పరికరం దాన్ని సక్ చేసేస్తుంది.

### రెట్రోగ్రేడ్ ఇంట్రారీనల్ సర్జరీ (ఆర్ఐఆర్ఎస్)

దీన్ని కిడ్నీలో ఏర్పడిన రాళ్లు తొలగించడానికి, ట్యూమర్ తీసేయడానికి చేస్తారు. స్కోప్ చివరి భాగం వివిధ రకాల డైరెక్షన్లలో వంగుతుంది. దాంతో రాయిని బ్రేక్ చేయడం సులువు అవుతుంది. పంక్చర్ అక్కర్లేదు. యూరిన్ ప్యాసేజ్ ద్వారా, మూత్రనాళం గుండా కిడ్నీలోకి వెళ్లి రాయిని చిన్న చిన్న ముక్కలుగా పగులగొడతారు. పగిలిన రాయి పొడి (డస్ట్) అంతా యూరిన్ ద్వారా బయటకు వచ్చేస్తుంది. దీన్ని ప్రత్యేకంగా సక్ చేసి తీయనవసరం లేదు. రాయిని పగులగొట్టడానికి లేజర్ పంపిస్తారు ఉపయోగిస్తారు. ఇది పదేళ్లుగా అందుబాటులో ఉంది. 5 ఏళ్ల నుంచి మన దగ్గర చేస్తున్నారు.

### ప్రొస్టేట్ సమస్యలు

సాధారణంగా పెద్ద వయసు వాళ్లలో వయసు రీత్యా వచ్చే సమస్యల్లో భాగంగా ప్రొస్టేట్ గ్రంథి వాచిపోతుంది. దీన్ని బినైన్ ఎన్‌లార్జ్‌మెంట్ అంటారు. అరవయ్యేళ్ల వయసు వచ్చేసరికి దాదాపు సగం మందిపురుషులు ప్రొస్టేట్ గ్రంథి వాయడం వల్ల బాధపడుతుంటారు. ఎనభయ్యేళ్లు దాటేనాటికి దాదాపు 90 శాతం మంది ఈ సమస్యతో బాధపడుతూ కనిపిస్తారు. క్యాన్సర్ వల్ల కూడా ప్రొస్టేట్‌లో గడ్డ ఏర్పడి దాని సైజు పెరుగుతుంది.




ప్రొస్టేట్ గ్రంథి యురెత్రా చుట్టూ అతుక్కుని ఉంటుంది. మూత్రాశయం (బ్లాడర్) నుంచి మూత్రాన్ని బయటకు తెచ్చే నాళం యురెత్రా. ప్రొస్టేట్ సైజు పెరిగినప్పుడు అది యురెత్రాపై ఒత్తిడి కలిగిస్తుంది. దాంతో పదే పదే మూత్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. మూత్ర విసర్జన మొదలవడమే కష్టంగా, సన్నని ధారగా అవుతుంటుంది.

బినైన్ ఎన్‌లార్జ్‌మెంట్ అయినట్టయితే టియుఆర్‌పి – ట్రాన్స్ యురెత్రల్ రిసెక్షన్ ఆఫ్ ప్రొస్టేట్ ద్వారా చికిత్స చేస్తారు. ఈ ప్రక్రియలో గడ్డను చిన్న చిన్న ముక్కలుగా చేసి సక్ చేసి ఎండోస్కోపీతో తీసేస్తారు .

లేజర్ ద్వారా కూడా పెద్దగా అయిన ప్రొస్టేట్‌కు చికిత్స అందిస్తారు. హెచ్‌ఒఎల్‌ఇపి – హోల్మియం లేజర్ ఎన్యూక్లియేషన్ ఆఫ్ ప్రొస్టేట్ సహాయంతో ట్రీట్ చేస్తారు. ప్రొస్టేట్‌ను మొత్తం తొలగిస్తే అది విడిపోయి బ్లాడర్‌లోకి వెళ్తుంది. మార్సులేటర్ అనే పరికరం ద్వారా దాన్ని బ్లాడర్ నుంచి తొలగిస్తారు. యాంటి ప్లేట్‌లెట్ మందులు, బ్లడ్ థిన్నర్ మందులు తీసుకునేవాళ్లకు ఇది చేస్తారు. గుండెజబ్బులున్నవాళ్లకు ప్రొస్టేట్ సమస్య ఉంటే లేజర్ ద్వారా చేసే ఈ చికిత్స మంచి పరిష్కారం.

### క్యాన్సర్లు

- కిడ్నీ, బ్లాడర్, ప్రొస్టేట్, వృషణాలు, పెనిస్‌లలో ఎక్కడ క్యాన్సర్ ఉన్నా మంచి చికిత్సలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి.
- కిడ్నీ, బ్లాడర్, ప్రొస్టేట్ క్యాన్సర్లకు లాపరోస్కోపిక్ సర్జరీ ద్వారా గానీ, రెట్రో పెరిటోనియోస్కోపిక్ సర్జరీ ద్వారా గానీ చికిత్స చేస్తారు. వీటికన్నా మెరుగైన ఫలితాలు రోబోటిక్ సర్జరీ ఇస్తున్నది.
- కిడ్నీ చుట్టూ ఉండే ఖాళీ ప్రదేశాన్ని రెట్రో పెరిటోనియమ్ అంటారు. పొట్టకు పక్కవైపున 3 రంధ్రాలు పెట్టి రెట్రోపెరిటోనియమ్ స్పేస్ ద్వారా లోపలికి వెళ్లి సర్జరీ చేస్తే రెట్రోపెరిటోనియోస్కోపిక్ సర్జరీ అంటారు. ఈ సర్జరీ చేసిన తరువాత 24 గంటల్లో డిశ్చార్జి చేస్తారు.
- లాపరోస్కోపిక్ సర్జరీ అంటే పొట్ట భాగంలో రంధ్రాలు పెట్టి, వాటి గుండా వెళ్లి కిడ్నీలకు సర్జరీ చేస్తారు.
- కిడ్నీ భాగాన్ని తీసేయడాన్ని నెఫ్రెక్టమీ అంటారు. రాడికల్ నెఫ్రెక్టమీ అంటే మొత్తం కిడ్నీ తీసేస్తారు. పార్షియల్ నెఫ్రెక్టమీ అంటే కిడ్నీలో ట్యూమర్ ఏర్పడిన భాగాన్ని మాత్రమే తీసేస్తారు. ట్యూమర్ చిన్నగా ఉంటే పార్షియల్ నెఫ్రెక్టమీ, పెద్దగా ఉంటే మొత్తం కిడ్నీని తీసేస్తారు.

### ట్రాన్స్‌ప్లాంటేషన్

- కిడ్నీ మార్పిడి సర్జరీలో కూడా ఆధునిక పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఓపెన్ సర్జరీ చేయనవసరం లేదు. కిడ్నీ మార్పిడిలో అటు దాతకు, ఇటు గ్రహీతకు ఇద్దరికీ సర్జరీ అవసరం అవుతుంది.



## రీకన్‌స్ట్రక్టివ్ యూరాలజీ

కిడ్నీ సంబంధిత నిర్మాణాలు డ్యామేజీ అయితే వాటిని పునర్నిర్మించడం ఇప్పుడు సాధ్యమే. ఇలాంటి సర్జరీలు కూడా ఇప్పుడు చాలా సులభతరం అయ్యాయి. యురెత్రా కుంచించుకుపోవడం (యురెత్రల్ స్ట్రిక్చర్). మూత్రనాళం కుంచించుకుపోవడం (యురెటరల్ స్ట్రిక్చర్) సమస్యలున్నప్పుడు వాటిని రిపేర్ చేయడం కష్టం. అందువల్ల రీకన్‌స్ట్రక్ట్ చేస్తారు. సాధారణంగా ఏవైనా గాయాలు, దెబ్బల వల్ల ఇలాంటి సమస్యలు వస్తాయి. ఇలా డ్యామేజి అయినవాటికి ఇంతకుముందైతే ఓపెన్ సర్జరీ ఉండేది. ఇప్పుడు మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీలు చేస్తున్నారు. ఈ నాళాల్లో ఏర్పడిన బ్లాక్ చిన్నదే అయితే అక్కడి వరకు కట్ చేసి, ఆ పాడైన భాగాన్ని తీసేసి, మిగిలిన రెండు చివరలను తిరిగి అతికిస్తారు. డ్యామేజి పెద్దదైతే చిన్న పేగు లేదా అపెండిక్స్ నుంచి కొంత భాగాన్ని తీసుకుని గ్యాప్‌ని పూరిస్తారు. యురెత్రాలో సమస్య ఉన్నప్పుడు ఎనాస్టోమోసిక్ యురెత్రోప్లాస్టీ చేస్తారు. చెంపలు, బక్కల్ మ్యూకోసా నుంచి గ్రాఫ్ట్ తీసుకుంటారు.

- లాపరోస్కోపిక్ డోనర్ సర్జరీ ద్వారా దాత నుంచి కిడ్నీ సేకరిస్తారు. ఈ నెఫ్రెక్టమీ 1995లో మొదటి కేసు చేశారు. ఇంకో పద్ధతి రెట్రో పెరిటోనియోస్కోపిక్ డోనర్ నెఫ్రెక్టమీ. అంటే లాపరోస్కోపీలో పొట్ట నుంచి వెళితే, పక్క భాగం నుంచి రెట్రోపెరిటోనియమ్ స్పేస్‌లోకి వెళ్లి కిడ్నీ తీయడం. ఈ సర్జరీ తరువాతి రోజు డిశ్చార్జి చేస్తారు.
- లాపరోస్కోపీ ద్వారా పొట్ట నుంచి కిడ్నీ దగ్గరికి వెళ్తే వేరే అవయవాలకు గాయం అయ్యేందుకు ఆస్కారం ఉంటుంది. కాని రెట్రోపెరిటోనియల్‌గా వెళ్తే అలాంటి సమస్య ఉండదు.



- ఇకపోతే కిడ్నీని స్వీకరించే గ్రహీతకు కూడా 60లలో ఓపెన్ సర్జరీయే చేసేవాళ్లు. ఆ తరువాత లాపరోస్కోపిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ వచ్చింది. ఇప్పుడు రోబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేస్తున్నారు.
- లావుగా ఉన్నవాళ్లకు పెద్ద ఇన్‌సిషన్ అంటే 15 నుంచి 20 సెంటీమీటర్ల కోత పెట్టాల్సి వస్తుంది. దీనివల్ల ఇన్‌ఫెక్షన్ల అవకాశం ఎక్కువగా ఉంటుంది. రక్తం ఎక్కువగా పోతుంది. ఇలాంటి వాళ్లకు రోబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ మంచిది. నాలుగు రంధ్రాలు పెడితే చాలు. కిడ్నీ అమర్చడానికి 5 నుంచి 6 సెంటీమీటర్ల కోత చాలు. ఈ సర్జరీ చాలా కచ్చితత్వంతో చేయవచ్చు. సైడ్ ఎఫెక్టులు తక్కువ.

## రోబోటిక్ సర్జరీ

లాపరోస్కోపీ, ఎండోస్కోపీల ద్వారా లోపలి అవయవాలను స్పష్టంగా చూడవచ్చు. అవయవాలను 2 డైమెన్షనల్‌గా చూపిస్తాయి. అయితే వీటికన్నా మరింత స్పష్టంగా చూపించేది రోబోటిక్స్. రోబోకి 3 డైమెన్షనల్ విజన్ ఉంటుంది. అందువల్ల అవయవాలను మరింత స్పష్టంగా చూడవచ్చు. మూడు కోణాల్లో గమనించవచ్చు.

రోబో పరికరం స్ట్రెయిట్‌గా ఉండకుండా అటూ ఇటూ 360 డిగ్రీల కోణంలో తిరగగలుగుతుంది. కాబట్టి కట్ చేయడానికి సులువు అవుతుంది. సంక్లిష్టమైన భాగాల్లోకి కూడా వెళ్లి కట్ చేయడం ఈజీ అవుతుంది. కుట్లు వేయడానికి కూడా కచ్చితత్వంతో వేయవచ్చు. చేతితో కుట్లు వేస్తున్నప్పుడు కొంచె అటూ ఇటూ కదిలే అవకాశం ఉంది. వణికే అవకాశం ఉంది. కాని రోబోటిక్ చేతులతో అలాంటి సమస్య లేదు. కాబట్టి వయసులో పెద్దవాళ్లు కూడా ఏ ఆటంకం లేకుండా చేయవచ్చు. సంక్లిష్టమైన భాగాల్లో కూడా ఇది సరిగ్గా, కచ్చితత్వంతో సర్జరీ చేయగలదు. బ్లాడర్‌కి కూడా రోబో ద్వారా చేస్తారు.



### రోబోటిక్ సర్జరీ ప్రయోజనాలు

- రోబోటిక్ సర్జరీలో పెద్ద కోత ఉండదు. ఇది మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ
- పెద్ద కోత ఉండకపోవడం వల్ల అధిక రక్తస్రావం ఉండదు.
- ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం కూడా తక్కువ. ఈ సర్జరీ వల్ల ఎలాంటి దుష్ప్రభావాలూ ఉండవు.
- సర్జరీ తొందరగా అయిపోతుంది. పూర్తి కచ్చితత్వంతో సర్జరీ చేయవచ్చు.
- రోబో ద్వారా చేసే సర్జరీ ద్వారా 3 డైమెన్షనల్ గా లోపలి అవయవాలను చూడవచ్చు. అంతేకాదు.. దీనిలోని కెమెరా పదొంతులు ఎక్కువ మాగ్నిఫికేషన్‌తో అవయవాలను చూపిస్తుంది. అందువల్ల మరింత స్పష్టంగా చూడవచ్చు. కాబట్టి పొరపాట్లు జరిగేందుకు ఆస్కారం ఉండదు.

**డాక్టర్ బిపిన్ చంద్రపాల్**
సీనియర్ యూరాలజిస్ట్,
రోబో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్
యశోద హాస్పిటల్స్
సికింద్రాబాద్
8121022333



---


# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సైంటిస్ట్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

## పాలీసెట్

రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిటెక్నికల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలీసెట్) నోటిఫికేషన్ విడుదలైంది.

- **ఎగ్జామ్ పేరు:** పాలీసెట్–2020
- దీని ద్వారా ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్, పీజేటీఎస్ఏయూ అందించే అగ్రికల్చరల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు.
- **అర్హత:** పదో తరగతి/ తత్సమాన ఉత్తీర్ణత.
- **ఎంపిక:** ప్రవేశ పరీక్ష ద్వారా
- **పరీక్షతేదీ:** ఏప్రిల్ 17




- **దరఖాస్తు:** ఆన్‌లైన్.
- **దరఖాస్తు ఫీజు:** రూ.400 (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250)
- **చివరితేదీ:** ఏప్రిల్ 4
- **వెబ్‌సైట్:** https://www.sbtet.telangana.gov.in

## బీఐఎస్‌లో 150 ఖాళీలు

- మొత్తం ఖాళీలు – 150
- **విభాగాలవారీగా ఖాళీలు:** మెకానికల్ ఇంజినీరింగ్–48, మెటలర్జికల్ ఇంజినీరింగ్–25, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్–7, సివిల్ ఇంజినీరింగ్–19, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్–5, సీఎస్ఈ–11, ఫుడ్ టెక్నాలజీ–14, కెమికల్ ఇంజినీరింగ్–16 ఉన్నాయి.




- **అర్హతలు:** సంబంధిత విభాగాల్లో డిగ్రీ, గేట్ 2018/2019 లేదా 2020లో వ్యాలిడ్ స్కోర్ సాధించి ఉండాలి.
- **వయస్సు:** 31 మార్చి 2020 నాటికి 30 ఏండ్లు మించరాదు.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **చివరితేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** https://bis.gov.in

## ఐఐటీఎంలో


పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీరియాలజీ (ఐఐటీఎం)లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 36
- **పోస్టులు:** డైరెక్టర్, ప్రాజెక్ట్ సైంటిస్ట్, కంప్యూటర్ అప్లికేషన్ సపోర్ట్ సైంటిస్ట్.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 29
- **వెబ్‌సైట్:** https://www.tropmet.res.in

## లాసెట్ -2020

ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే లాసెట్, పీజీలాసెట్ నోటిఫికేషన్ విడుదలైంది.

- తెలంగాణ స్టేట్ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీఎస్‌లాసెట్/ టీఎస్‌పీజీఎల్‌సెట్) – 2020
- రాష్ట్రంలోని విశ్వవిద్యాలయం, అనుబంధ కాలేజీల్లో లా కోర్సుల్లో ప్రవేశాలకు లాసెట్‌ను నిర్వహిస్తారు.
- **కోర్సులు:** ఎల్‌ఎల్‌బీ (మూడేండ్లు/ ఐదేండ్లు)
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత.
- **కోర్సు:** ఎల్‌ఎల్‌ఎం (రెండేండ్లు)
- **అర్హతలు:** ఎల్‌ఎల్‌బీ/ బీఎల్ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** ప్రవేశపరీక్ష ద్వారా.
- **పరీక్షతేదీ:** మే 27
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తు ఫీజు:** డిగ్రీ కోర్సుకు రూ.800, పీజీ కోర్సుకు రూ.1000/–
- **చివరితేదీ:** ఏప్రిల్ 6
- **వెబ్‌సైట్:** https://lawcet.tsche.ac.in



## ధోనీ ప్రాక్టీస్ షురూ

**చెన్నై:** ఈ సీజన్ ఐపీఎల్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ప్రాక్టీస్ మొదలెట్టాడు. సోమవారం ఇక్కడి ఎంఏ చిదంబరం స్టేడియంలో తొలి ప్రాక్టీస్ సెషన్‌లో టీమ్‌ఇండియా మాజీ సారథి బ్యాటుపట్టాడు. చాలా కాలం తర్వాత మహీ సన్నాహకానికి దిగడంతో అభిమానులు పెద్ద సంఖ్యలో స్టేడియానికి వచ్చారు. హిట్టింగ్‌తో ఫ్యాన్స్‌ను ధోనీ అలరించాడు. అతడితో పాటు అంబటి రాయుడు, మురళీ విజయ్, మరి కొందరు ప్లేయర్లు ప్రాక్టీస్ చేశారు.

## కష్టాల్లో కర్ణాటక

రెండో ఇన్నింగ్స్‌లో 98/3
రంజీట్రోఫీ సెమీస్

**కోల్‌కతా:** ప్రతిష్ఠాత్మక రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో కర్ణాటక జట్టు కష్టాల్లో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన కర్ణాటక బ్యాట్స్‌మెన్ రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే తడబాటు కొనసాగించారు. ఫలితంగా 352 పరుగుల లక్ష్యఛేదనలో మూడో రోజు ఆట ముగిసే సమయానికి కర్ణాటక రెండో ఇన్నింగ్స్‌లో 98/3తో నిలిచింది. టీమ్‌ఇండియా ఆటగాడు లోకేశ్ రాహుల్ (0) మరోసారి విఫలం కాగా.. కరుణ్ నాయర్ (6), సమర్థ్ (27) ఆకట్టుకోలేకపోయారు. చేతిలో 7 వికెట్లు ఉన్న కర్ణాటక లక్ష్యానికి 254 పరుగుల దూరంలో నిలిచింది. దేవదత్ పడిక్కల్ (50), మనీశ్ పాండే (11) క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టిన ఇషాన్ పొరెల్ (1/19).. రాహుల్‌ను బోల్తా కొట్టించాడు. గుజరాత్‌తో జరుగుతున్న మరో సెమీఫైనల్లో సౌరాష్ట్ర రెండో ఇన్నింగ్స్‌లో 66/5తో నిలిచింది. మరో ఐదు వికెట్లు ఉన్న సౌరాష్ట్ర ప్రస్తుతం 118 పరుగుల ఆధిక్యంలో ఉంది.


పొరెల్ (1/19)

## తస్నీమ్, మాన్సికి కాంస్యాలు



**న్యూఢిల్లీ:** భారత యువ షట్లర్లు తస్నీమ్ మీర్, మాన్సి సింగ్ అంతర్జాతీయ టోర్నీలో సత్తాచాటారు. నెదర్లాండ్స్ వేదికగా జరిగిన డచ్ జూనియర్ ఇంటర్నేషనల్ టోర్నీలో కాంస్య పతకాలు సాధించారు. బీడబ్ల్యూఎఫ్ గ్రాండ్ ప్రి టోర్నమెంట్ బాలికల సింగిల్స్‌లో భారత ప్లేయర్లు రెండు కాంస్యాలు సాధించడం ఇదే తొలిసారి. సోమవారం జరిగిన సెమీఫైనల్లో తస్నీమ్ 19-21, 10-22తో మూడో సీడ్ సో యుల్ లీ (కొరియా) చేతిలో ఓడగా.. మాన్సి 11-21, 16-21తో సైఫీ రిజ్కా (ఇండోనేషియా) చేతిలో పరాజయం పాలైంది. మరోవైపు కెన్యా ఇంటర్నేషనల్ టోర్నీలో భారత వర్ధమాన ప్లేయర్లు ఆకర్షి, అనుపమా వరుసగా స్వర్ణ, రజత పతకాలు సాధించారు.

## అజ్లాన్‌షా కప్ వాయిదా

**న్యూఢిల్లీ:** అంతకంతకు ప్రమాదకరంగా మారుతున్న కరోనా వైరస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా క్రీడాటోర్నీలు వాయిదా పడుతూనే ఉన్నాయి. ఇప్పటికే పలు టోర్నీలు వైరస్‌తో షెడ్యూలను మార్చుకోగా, తాజాగా అజ్లాన్‌షా కప్ ఈ జాబితాలో చేరింది. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం మలేషియా వేదికగా వచ్చే నెల 11 నుంచి టోర్నీ మొదలు కావాల్సి ఉంది. అయితే ఆటగాళ్లు, అధికారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని టోర్నీని వాయిదా వేస్తున్నట్లు నిర్వాహక కమిటీ ఛైర్మన్ హాజీ అబిద్ రహిమ్ బిన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. అయితే రీషెడ్యూల్ చేస్తూ సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 3 మధ్య టోర్నీని నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

# కూలీ ఇంట పతకాల పంట

## మెడల్స్‌తో మెరుస్తున్న పాలమూరు బిడ్డ

### స్టిపుల్ చేజ్‌లో మహేశ్వరి జాతీయ రికార్డులు



పాలమూరులోని మారుమూల గ్రామం నుంచి వచ్చిన ఆ అమ్మాయి జాతీయస్థాయి టోర్నీల్లో పతకాల పంట పండిస్తున్నది. కష్టాల అడ్డంకులను అధిగమిస్తూ రికార్డులు తిరగరాస్తున్నది. ప్రతీటోర్నీకి ప్రదర్శనను మెరుగుపరుచుకుంటూ మేటి అథ్లెట్‌గా ఎదుగుతున్నది. ఆ తెలంగాణ యువకెరటమే ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో రజతం సాధించిన మహేశ్వరి. తల్లిదండ్రులు కూలిపనులు చేస్తూ పడుతున్న కష్టాలను పరుగుతో దూరం చేయాలని చిన్నతనంలోనే మహేశ్వరి నిశ్చయించుకుంది. కఠోర శ్రమ చేసింది. నాగపురి రమేశ్ ప్రోత్సాహం, సాయ్–గోపిచంద్ మైత్ర ప్రాజెక్టులో శిక్షణ పొందుతూ మరింత రాటుదేలుతున్నది. జాతీయ టోర్నీల్లో లెక్కకు మిక్కిలి పతకాలు సాధిస్తూ.. ఒలింపిక్స్‌లో పాల్గొనడమే లక్ష్యమని చెప్తున్న మహేశ్వరిపై ప్రత్యేక కథనం..


తల్లిదండ్రులతో మహేశ్వరి

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

దినసరి కూలీ ఇంట పుట్టిన తెలంగాణ యువ అథ్లెట్ జి.మహేశ్వరి జాతీయస్థాయి పోటీల్లో అద్భుత ప్రదర్శనలతో పతకాల పంట పండిస్తున్నది. జీవితంలో ఎన్నో కష్టాలను దాటుకొచ్చిన ఆ పాలమూరు విద్యార్థిని ట్రాక్‌పై చిరుతలా పరుగెత్తుతున్నది. జాతీయ అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేశ్ చేయూతతో మూడేండ్ల క్రితం ట్రాక్‌పై అడుగుపెట్టిన మహేశ్వరి ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోలేదు. జాతీయస్థాయిలో పతకాలను కైవసం చేసుకుంటూ తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతున్నది. కఠినతరమైన స్టిపుల్‌చేజ్‌లో నేషనల్ రికార్డులను తిరగరాస్తూ మేటి అథ్లెట్‌గా రూపొందుతున్నది. ప్రభుత్వం ఉద్యోగం ఇప్పిస్తే పేదరికంలో ఉన్న తన కుటుంబానికి భరోసా దొరుకుతుందని, 2024 ఒలింపిక్సే లక్ష్యంగా కష్టపడుతున్నానని చెబుతున్నది. ప్రస్తుతం షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న మహేశ్వరి.. తాజాగా జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో పాలమూరు విశ్వవిద్యాలయం తరపున రజత పతకం(3వేల మీటర్ల స్టిపుల్‌చేజ్) కైవసం చేసుకుంది.

### కష్టాల కడలి.. కఠోర శ్రమ..

మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని ఎల్కిచెర్ల గ్రామం మహేశ్వరి సొంతూరు. ఆమె తల్లి లక్ష్మమ్మ, తండ్రి నరసింహులు ఇద్దరూ దినసరి కూలీలే. నలుగురు సంతానంలో మహేశ్వరి వయసులో పెద్ద. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం. ఈ పరిస్థితుల్లో చదువుకుంటూనే ఖాళీ సమయాల్లో తల్లిదండ్రులతో కలిసి మహేశ్వరి కూడా పనులకు వెళ్లేది. ఆ సమయంలో కష్టాల కడలిని దాటాలన్న ఆకాంక్షతో పరుగును ప్రారంభించింది. పాఠశాలకు క్రమం తప్పకుండా వెళ్తూనే ఉదయం, సాయంత్రం తీవ్రంగా ప్రాక్టీస్ చేసేది. ఒక్కోసారి రాత్రి 9గంటల వరకు కూడా శ్రమించేది. దీంతో ఆమె పరుగులో వేగం పెరిగింది. పాఠశాల స్థాయిలోనే అద్భుత ప్రతిభ కనబరుస్తున్న మహేశ్వరిని మహబూబ్ నగర్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ గుర్తించారు.

### ఉద్యోగం కల్పిస్తే బాగుంటది

ప్రభుత్వ ఉద్యోగం వస్తే పేదరికంలో ఉన్న మా కుటుంబం కష్టాలు కొంతైనా తీరతాయి. అలాగే గచ్చిబౌలి స్టేడియంలో ప్రత్యేక ట్రాక్, జిమ్ లేకపోవడంతో పూర్తి స్థాయిలో ప్రాక్టీస్ చేయలేకున్నాం. ఆ సదుపాయాలు కల్పిస్తే మెరుగ్గా రాణించే అవకాశముంటుంది. రమేశ్ సర్ ప్రోత్సాహంతోనే ఈస్థాయికి రాగలిగా. 2024 ఒలింపిక్స్‌లో బరిలోకి దిగాలన్నదే నా లక్ష్యం.

**-మహేశ్వరి**

### రమేశ్ ప్రోత్సాహంతో..



మహేశ్వరి పరుగు వేగాన్ని చూసిన రాజేంద్ర ఆమెను జాతీయ అథ్లెటిక్స్ కోచ్, ద్రోణాచార్య అవార్డీ నాగపురి రమేశ్ వద్దకు తీసుకెళ్లారు. దీంతో మహేశ్వరి కెరీర్ మరో మలుపు తీసుకుంది. ఆమె అథ్లెటిక్స్ పయనం మొదలైంది. మహేశ్వరిని హైదరాబాద్‌కు పంపేందుకు తల్లిదండ్రులకు స్థోమత లేదు. ఆ సమయంలో రమేశ్ అన్ని ఖర్చులను భరించి ఆమె అథ్లెట్‌గా మారేందుకు ప్రోత్సహించారు. ఆ తర్వాత సాయ్ వసతి గృహంలో చోటు దక్కడంతో మహేశ్వరి వెనుదిరిగి చూసుకోలేదు. అలాగే సాయ్ – గోపీచంద్ మైత్ర ప్రాజెక్టు కింద శిక్షణ తీసుకుంటూ మరింత మెరుగవుతున్నది. వివిధ టోర్నీల్లో పాల్గొనేందుకు మహేశ్వరికి సాయ్ – గోపీచంద్ మైత్ర విమాన ప్రయాణ ఖర్చులతో పాటు మరింత తోడ్పాటునందిస్తున్నది.

### తొలి పోటీ నుంచే..

తొలిసారిగా 2017లో సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో మహేశ్వరి జాతీయస్థాయి పోటీలో అడుగుపెట్టింది. ఆ టోర్నీలో మహిళల 800మీటర్ల పరుగు బరిలోకి దిగిన తెలంగాణ అమ్మాయి సత్తాచాటింది. రెండోస్థానంలో నిలిచి రజతాన్ని కైవసం చేసుకొని.. పతకాల ప్రస్థానాన్ని ప్రారంభించింది. అనంతరం కొన్ని టోర్నీల తర్వాత కోచ్ నాగపురి రమేశ్ సలహాతో స్టిపుల్ చేజ్‌కు మారిన మహేశ్వరి మరింత మెరుగ్గా రాణించడం ప్రారంభించింది.



### సాధించిన పతకాలు

**2018:**
- జూనియర్ ఫెడరేషన్ కప్‌లో రజత పతకం
- 52వ జాతీయ క్రాస్‌కంట్రీలో రజత పతకం

**2019:**
- 35వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం
- 17వ జూనియర్ ఫెడరేషన్ కప్‌లో పసిడి పతకం
- 31వ జాతీయ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్(2000మీ)లో స్వర్ణ పతకం
- 31వ జాతీయ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్(1500మీ)లో రజత పతకం

**2020:**
- ఖేల్‌ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో రజత పతకం

# కోహ్లీకి కోపమొచ్చింది

తన కెప్టెన్సీలో తొలి వైట్‌వాష్ ఎదుర్కొన్న కోహ్లీ.. మ్యాచ్ అనంతరం పరుష వ్యాఖ్యలతో మరింత అపఖ్యాతి మూటగట్టుకున్నాడు. ఓటమి అనంతరం మీడియా సమావేశానికి హాజరైన కోహ్లీ.. ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సరైన బదులివ్వకుండా అతడిపై విరుచుకుపడ్డాడు. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ సందర్భంగా బ్యాట్స్‌మెన్ ఔటైన సమయంలో కోహ్లీ నోటిపై వేలు పెట్టుకుంటూ అసభ్య పదజాలంతో దూషించిన వీడియో వైరల్ అవడంపై విలేఖరి ప్రశ్నించగా.. 'మీరేమనుకుంటున్నారు. ఆ ప్రశ్నకు జవాబు మిమ్మల్నే అడుగుతున్నా.. అక్కడేం జరిగిందో మీకు తెలుసా? అసంపూర్తి సమాచారంతో ప్రశ్నలు అడగకూడదు. ఈ అంశంపై రిఫరీతో మాట్లాడా. వారెలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు'అని కోహ్లీ బదులిచ్చాడు.

### 'దిఖాదూంగా'

రెండో ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ బ్యాటింగ్ చేస్తుండగా.. ఫీల్డ్‌లో ఉన్న కోహ్లీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'వీళ్లు మనదేశానికి వచ్చినప్పుడు చూపిస్తా'(జబ్ భారత్‌మే ఏ లోగ్ ఆయేంగే.. తబ్ దిఖాదూంగా) అని కోహ్లీ అన్న మాటలు వికెట్ మైక్‌లో రికార్డయ్యాయి.




**1** కోహ్లీ కెప్టెన్సీలో భారత్ టెస్టు సిరీస్ వైట్‌వాష్‌కు గురికావడం ఇదే తొలిసారి.

**3** విరాట్ సారథ్యంలో టీమ్‌ఇండియాకు ఇది మూడో టెస్టు సిరీస్ పరాజయం. ఇంతకుముందు దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ చేతిలో ఓడింది.

# 0-2

**అద్భుతాలు జరుగలేదు. ఆశ్చర్యకర ఫలితం రాలేదు.**

**అంతా ఊహించినట్లుగానే మనవాళ్లు వైఫల్యాల బాట కొనసాగించారు. మూడోరోజు లోయర్‌ఆర్డర్ బ్యాట్స్‌మెన్ పట్టుమని పది ఓవర్లు ఆడకముందే ఆలౌటయ్యారు. ఫలితంగా ప్రత్యర్థి ముందు స్వల్ప లక్ష్యం నిలువగా.. న్యూజిలాండ్ ఓపెనర్లు విజృంభించి తొలి వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం నమోదు చేయడంతో రెండో టెస్టులో కివీస్ అలవోకగా గెలుపొందింది. మూడో రోజుల్లోనే భారత్‌ను మడతెట్టేసిన బ్లాక్‌క్యాప్స్.. ప్రపంచ నంబర్‌వన్ టెస్టు టీమ్‌కు ఎనిమిదేండ్ల తర్వాత వైట్‌వాష్ రుచి చూపించారు. కెప్టెన్సీ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి కోహ్లీ సారథ్యంలో టీమ్‌ఇండియాకు ఇదే తొలి వైట్‌వాష్ కాగా.. టెస్టు చాంపియన్‌షిప్‌లో ఎదురులేకుండా సాగుతున్న కోహ్లీసేనను.. న్యూజిలాండ్ నేలకు దించింది.**

## కివీస్ చేతిలో భారత్ వైట్‌వాష్.. రెండో టెస్టులో భారీ ఓటమి



**క్రైస్ట్‌చర్చ్:** తొలి టెస్టుతో పోల్చుకుంటే.. కాస్త మెరుగైన ప్రదర్శన చేసినా.. బ్యాట్స్‌మెన్ బాధ్యతారాహిత్యంతో టీమ్‌ఇండియా రెండో టెస్టులో 7 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. టాపార్డర్ విఫలమైన చోట.. మిడిల్ మ్యాజిక్ చేస్తుందనుకుంటే.. అలాంటి అద్భుతాలేమీ జరుగలేదు. ఓవరాల్‌గా ఈ పర్యటనలో టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత్.. ఆ తర్వాత జరిగిన వన్డే, టెస్టు సిరీస్‌ల్లో వైట్‌వాష్‌కు గురికావడం గమనార్హం. ఓవర్‌నైట్ స్కోరు 90/6తో సోమవారం మూడోరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్.. మరో పది ఓవర్లు ఆడి 34 రన్స్ జతచేసి 124 పరుగుల వద్ద ఆలౌటైంది. బౌల్ట్‌కు 4, సౌథీకి మూడు వికెట్లు దక్కాయి. అనంతరం 132 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్ మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి టార్గెట్ చేజ్ చేసింది. ఓపెనర్లు లాథమ్ (52; 10 ఫోర్లు), బ్లండెల్ (55; 8 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధశతకాలతో చెలరేగారు. భారత బౌలర్లలో బుమ్రాకు రెండు వికెట్లు దక్కాయి. జెమీసన్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', సౌథీకి 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్'అవార్డులు దక్కాయి. ఈ విజయంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో 120 పాయింట్లు ఖాతాలో వేసుకున్న న్యూజిలాండ్ (180) మూడో స్థానానికి చేరగా.. టీమ్‌ఇండియా (360) అగ్రస్థానంలో కొనసాగుతున్నది.

న్యూజిలాండ్ పేసర్లు చక్కటి ప్రదర్శన కనబరిచారు. తొలి టెస్టులో మా ఆట స్థాయికి తగ్గట్లు లేకపోయింది. ఇక్కడ బాగా ఆడినా మా పొరపాట్ల వల్లే ఓడిపోయాం. మా బౌలర్లు మాత్రం ఆకట్టుకున్నారు. బ్యాటింగ్ వైఫల్యంతో బౌలర్ల శ్రమ వృథా అయింది. ఈ పరాజయానికి ఏ ఒక్కరినో బాధ్యులను చేయడం సరికాదు.

**- కోహ్లీ, భారత కెప్టెన్**

### స్కోరు బోర్డు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 242, న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 242, భారత్ రెండో ఇన్నింగ్స్: పృథ్వీ షా (సి) లాథమ్ (బి) సౌథీ 14, మయాంక్ (ఎల్బీ) బౌల్ట్ 3, పుజారా (బి) బౌల్ట్ 24, కోహ్లీ (ఎల్బీ) గ్రాండ్‌హోమ్ 14, రహానే (బి) వాగ్నర్ 9, ఉమేశ్ (బి) బౌల్ట్ 1, విహారి (సి) వాట్లింగ్ (బి) సౌథీ 9, పంత్ (సి) వాట్లింగ్ (బి) బౌల్ట్ 4, జడేజా (నాటౌట్) 16, షమీ (సి) బ్లండెల్ (బి) సౌథీ 5, బుమ్రా (రనౌట్) 4, **ఎక్స్‌ట్రాలు:** 21, **మొత్తం:** 124 ఆలౌట్. **వికెట్లపతనం:** 1-8, 2-26, 3-51, 4-72, 5-84, 6-89, 7-97, 8-97, 9-108, 10-124, **బౌలింగ్:** సౌథీ 11-2-36-3, బౌల్ట్ 14-4-28-4, జెమీసన్ 8-4-18-0, గ్రాండ్‌హోమ్ 5-3-3-1, వాగ్నర్ 8-1-18-1. **న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్:** లాథమ్ (సి) పంత్ (బి) ఉమేశ్ 52, బ్లండెల్ (బి) బుమ్రా 55, విలియమ్సన్ (సి) రహానే (బి) బుమ్రా 5, టేలర్ (నాటౌట్) 5, నికోల్స్ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు:** 10, **మొత్తం:** 132/3. **వికెట్లపతనం:** 1-103, 2-112, 3-121, **బౌలింగ్:** బుమ్రా 13-2-39-2, ఉమేశ్ 14-3-45-1, షమీ 3-1-11-0, జడేజా 5-0-24-0, కోహ్లీ 1-0-4-0.

# స్వయంకృతమే..

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

భారత అత్యుత్తమ పర్యాటక జట్టు ఇదే అని పదే పదే జబ్బలు చరుచుకునే విరాట్ కోహ్లీ, రవిశాస్త్రి ద్వయానికి న్యూజిలాండ్ పర్యటనలో ఒకటికి రెండుసార్లు వైట్‌వాష్ ఎదురైంది. టీ20 సిరీస్‌లో ఆతిథ్య జట్టును క్లీన్‌స్వీప్ చేసి కొత్త చరిత్ర సృష్టించిన టీమ్ ఇండియాకు.. ఆ తర్వాత వన్డే, టెస్టు సిరీస్‌ల్లో ఘోర పరాభవాలు ఎదురయ్యాయి. తొలి టెస్టు ఓటమి అనంతరం శాస్త్రి మాట్లాడుతూ.. 'అప్పుడప్పుడు ఇలాంటి అపజయాలు ఎదురైతేనే ఆటగాళ్లు అప్రమత్తంగా ఉంటారు' అని అన్నాడు. కానీ మనవాళ్లు ఏమాత్రం అప్రమత్తత కనబర్చకుండా వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఆకట్టుకోలేకపోయారు.
క్రైస్ట్‌చర్చ్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో అర్ధశతకం సాధించిన విహారి మాట్లాడుతూ.. 'పిచ్ పెద్దగా ప్రమాదకరంగా లేదు. భయపెట్టే వికెట్ మాత్రం కాదు. బ్యాట్స్‌మెన్ షాట్ సెలెక్షన్ వల్లే వికెట్లు కోల్పోయాం' అన్నాడు. మరి ప్రత్యర్థి టెయిలెండర్లు కూడా ధాటిగా పరుగులు చేస్తున్న చోట మన స్టార్ బ్యాట్స్‌మెన్ ప్రభావం చూపలేకపోవడం ఆశ్చర్యం కలిగించక మానదు. తొలి టెస్టులో అతి జాగ్రత్తకు పోయి వికెట్ సమర్పించుకోవడంతో విమర్శల పాలైన టీమ్‌ఇండియా బ్యాట్స్‌మెన్ రెండో టెస్టులో ఫర్వాలేదనిపించారు. తొలి ఇన్నింగ్స్‌లో ఒక దశలో 194/4తో నిలిచి మ్యాచ్‌పై ఆశలు రేపారు. ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయిన టీమ్‌ఇండియా మరో 48 పరుగులే చేసి ఆలౌటైంది. కివీస్ గడ్డపై పరిమిత ఓవర్ల క్రికెట్‌లో దుమ్మురేపిన కేఎల్ రాహుల్‌ను టెస్టు సిరీస్‌కు ఎంపిక చేయకపోవడంపై అనేక విమర్శలు రాగా.. తుది జట్టు ఎంపికలోనూ విరాట్ తప్పిదాలు చేశాడు. వికెట్ కీపర్‌గా సాహాను కాదని పంత్‌కు తుదిజట్టులో చోటు కల్పించాడు. కీలక సమయాల్లో బ్యాటింగ్‌కు వచ్చిన పంత్.. తన వికెట్ విలువ తెలుసుకోకుండా నిర్లక్ష్యపు షాట్లతో పూర్తిగా నిరాశపరిచాడు.
స్వదేశంలోని ఫ్లాట్‌పిచ్‌లపై సెంచరీలపై సెంచరీలు బాదే మనవాళ్లు ఈ సిరీస్‌లో కేవలం నాలుగంటే నాలుగే అర్ధశతకాలు కొట్టగలిగారు. అత్యధిక స్కోరు 58 మాత్రమే. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో కలిపి కోహ్లీ 9.50 సగటుతో కేవలం 38 పరుగులే చేయడం టీమ్ ఇండియాను దెబ్బకొట్టింది. అద్భుత ఫామ్‌లో ఉన్న ఓపెనర్ రోహిత్ శర్మ గాయం కారణంగా పర్యటనకు దూరం కాగా.. అతడి స్థానంలో చోటు దక్కించుకున్న పృథ్వీ షా పరిణతి చూపలేకపోయాడు. మరో ఓపెనర్ మయాంక్ కూడా పెద్దగా ఆకట్టుకోలేపోయాడు. డిపెండబుల్ బ్యాట్స్‌మన్ పుజారా.. క్రీజులో కుదురుకున్నాక వికెట్ సమర్పించుకొని నిరాశ పరిస్తే.. రహానే కూడా అదే తీరు కొనసాగించాడు. ఉన్నంతలో బౌలర్లు నయం అనిపించారు.



# ఒలింపిక్ బెర్తుల కోసం..

**అమన్(జోర్డాన్):** టోక్యో ఒలింపిక్స్ అర్హత పోటీలకు భారత బాక్సర్లు సిద్ధమయ్యారు. మంగళవారం ఇక్కడ ప్రారంభం కానున్న ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో ప్రపంచ చాంపియన్‌షిప్ రజత పతక విజేత అమిత్ పంగాల్(52కేజీలు) టాప్ సీడ్‌గా బరిలోకి దిగనుండగా.. మహిళల 51కేజీల విభాగంలో దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ రెండో సీడ్‌గా పోటీ పడనుంది. పురుషుల విభాగంలో భారత్ నుంచి మొత్తం ఎనిమిది మంది, మహిళల విభాగంలో ఐదుగురు పోటీలో ఉన్నారు. మహిళల కేటగిరీలో రెండు సార్లు ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహెన్(69కేజీలు), పూజా రాణి(75కేజీలు) వరుసగా రెండు, నాలుగు సీడ్‌లుగా పోటీలోకి దిగనున్నారు. టోర్నీకి ముందు ఇటలీలో ప్రాక్టీస్ చేసిన మన బాక్సర్లు ఒలింపిక్స్‌లో చోటు దక్కించుకోవాలని పట్టుదలగా ఉన్నారు. పురుషుల విభాగంలో అమిత్‌తో పాటు మనీశ్ కౌశిక్(63కేజీలు)పైనా భారీ అంచనాలు ఉన్నాయి. కాగా, చైనాలోని వుహాన్‌లో ఈ అర్హత పోటీలు జరగాల్సి ఉండగా.. కరోనా వైరస్ కారణంగా జోర్డాన్‌కు వేదిక మారిన సంగతి తెలిసిందే.

# సెమీస్‌లో ఆస్ట్రేలియా

మహిళల టీ20 ప్రపంచకప్




**మెల్‌బోర్న్:** మహిళల టీ20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా సత్తాచాటింది. న్యూజిలాండ్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో ఆసీస్ 4 పరుగుల తేడాతో గెలుపొందింది. ఫలితంగా 6 పాయింట్లతో గ్రూప్–ఏలో రెండో స్థానంలో నిలిచి సెమీస్ బెర్త్ ఖరారు చేసుకుంది. ఇదే గ్రూప్‌లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన భారత జట్టు 8 పాయింట్లతో ఇప్పటికే సెమీస్‌కు చేరిన విషయం తెలిసిందే. గ్రూప్–బి నుంచి ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్లు కూడా సెమీస్‌లో అడుగుపెట్టాయి. దక్షిణాఫ్రికా మరో మ్యాచ్ ఆడాల్సి ఉండటంతో ప్రస్తుతానికి భారత ప్రత్యర్థి ఖరారు కాలేదు. సోమవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లకు 155 పరుగులు చేసింది. మూనీ (60) అర్ధశతకంతో ఆకట్టుకుంది. లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 151 పరుగులు చేసింది. కేటీ మార్టీన్ (37) టాప్ స్కోరర్.

## సుమిత్‌పై నిషేధం ఎత్తివేత

**న్యూఢిల్లీ:** ఆసియా క్రీడల రజత పతక విజేత, బాక్సర్ సుమిత్ సంగ్వాన్(91కేజీలు)పై విధించిన ఏడాది నిషేధాన్ని జాతీయ మాదకద్రవ్య నిరోధక ఏజెన్సీ(నాడా) ఎత్తేసింది. నిషిద్ధ ఉత్ప్రేరకాలను తన ప్రమేయం లేకుండానే అతడు తీసుకున్నాడని నిర్ధారించిన నాడా అప్పీల్ ప్యానెల్ సోమవారం ఈ నిర్ణయం తీసుకుంది. ఉత్ప్రేరకాలు తీసుకున్నట్టు తేలడంతో సుమిత్‌ను నాడా గతేడాది డిసెంబర్‌లో ఏడాది పాటు నిషేధించింది.

## కొలిక్కిరానున్న సెలెక్టర్ల జాబితా

**ముంబై:** భారత సెలెక్టర్ల జాబితా మంగళవారం ఒక కొలిక్కి రానుంది. మంగళవారం సమావేశం కానున్న క్రికెట్ సలహాదారుల కమిటీ(సీఏసీ) సెలెక్టర్ల ఎంపిక ప్రక్రియకు తుదిరూపు ఇవ్వనుంది. బీసీసీఐ రాజ్యాంగం ప్రకారం సెలెక్టర్లను సీఏసీ..ఎంపిక చేస్తుంది. రెండు పోస్టుల కోసం మొత్తం 44 దరఖాస్తులు వచ్చాయని సీఏసీ సభ్యుడు మదన్ లాల్ పేర్కొన్నాడు. ఎమ్మెస్కే ప్రసాద్, గగన్ ఖోడా పదవీకాలం ముగియడంతో దరఖాస్తులు ఆహ్వానించిన సంగతి తెలిసిందే.